
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
epaper.vaartha.com WWW.VAARTHA.COM



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

24-5-2025 శనివారం సంపుటి: 31 సంచిక: 113 పేజీలు: 12 వెల: 6.50


హింసను వీడుతున్న ఈశాన్యం: ప్రధాని మోడీ 5లో

రాజీనామా యోచనలో బంగ్లా చీఫ్ యూనస్

# అమరావతిని నోటిపై చేయండి

## కేంద్రాన్ని కోరిన సిఎం చంద్రబాబు

- ఢిల్లీలో కేంద్ర మంత్రులు అమిత్‌షా, రాజ్‌నాథ్, నిర్మలా సీతారామన్, జితేంద్రసింగ్, ప్రహ్లాద్ జోషి, సిఆర్ పాటిల్‌తో భేటీ
- పునర్విభజన చట్టం హామీలు అమలు చేయాలి
- నిధుల బకాయిలు పూర్తిగా ఇవ్వాలి
- ఢిల్లీలో మీడియాతో సిఎం చంద్రబాబు

కేంద్రమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, నిర్మలా సీతారామన్, జితేంద్రసింగ్, ప్రహ్లాద్‌జోషి, సిఆర్ పాటిల్‌తో శుక్రవారం సిఎం చంద్రబాబు న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. రాష్ట్ర అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, కేంద్రం నుంచి లభించవలసిన సాయంపై వారితో క్షుణ్ణంగా చర్చించారు.



శుక్రవారం న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు. చిత్రంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ మే 23 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర విభజన జరిగి 10 ఏళ్లు పూర్తయినందున అమరావతిని రాజధానిగా పునర్విభజన చట్టంలో పెట్టి నోటిపై చేయాలని కేంద్రాన్ని కోరినట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అనంతరం సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. 2019-24 మధ్య ఎపిలో భారీగా విధ్వంసం జరిగింది. వైకాంగ్రెస్‌పార్టీ చేసిన విధ్వంసం నుంచి రాష్ట్రాన్ని గాడిన పెట్టాలంటే పదేళ్లు పడుతుంది. మా ప్రభుత్వం రాగానే రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. అందుకు అనుగుణంగా అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. గత ప్రభుత్వం రూ.1.20 లక్షల కోట్ల బిల్లులు చెల్లించకుండా బకాయిలు పెట్టింది. ఈ ఏడాదిలో రాష్ట్రానికి అత్యధికంగా పెట్టుబడులు వచ్చాయి. ఢిల్లీకి వచ్చిన ప్రతిసారి ఏడుగురు కేంద్రమంత్రులను కలుస్తున్నాం. సూర్యఘర్ కింద 35 లక్షల కుటుంబాలకు విద్యుత్ ఇవ్వాలని ఆకాంక్షించాం. ఈపథకంకింద ప్రతి నియో >>2

# రూ. 2,065 కోట్లతో ఓర్వకల్లు, కొప్పర్తి ప్రాజెక్టు

## మౌలిక సదుపాయాలతో పాటు 'వాక్ టు వర్క్' విధానం

**విజయవాడ,మే 23,ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో ఓర్వకల్లు,కొప్పర్తి పారిశ్రామిక నోడ్‌లను రూ.2,065 కోట్లతో ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ అండ్ ఇంప్లిమెంటేషన్ ట్రస్ట్(నిక్‌డిట్) ఆమోదించింది. సంబందిత సమాచారాన్ని మీడియాకు విడుదల చేసింది.ఓర్వకల్లు నోడ్‌లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.1,120.81 కోట్లు,కొప్పర్తిలో రూ.944.30 కోట్లను ఖర్చు చేయనుంది. ప్రాజెక్ట్ మొదటి దశలో సర్వే, డిజైన్లు, నిర్మాణం, టెస్టింగ్,రోడ్లు,డ్రెయిన్లు, కల్వర్టులు,వంతెలను,పార్కులోని పరిశ్రమలకు అవసరమైన నీటి సరఫరా పనులు,మురుగునీటి శుద్ధి ప్లాంట్లు, విద్యుత్ సరఫరా పనులకు ఈ మొత్తాన్ని ఖర్చు చేయనుంది. మల్టీ ప్రొడక్ట్ ఇండస్ట్రియల్ క్లస్టర్లుగా నోడ్‌ను అభివృద్ధి చేసేలా ప్రతిపాదించింది. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలతో పాటు వాక్ టు వర్క్ విధానానికి ప్రాధాన్యం కల్పించేలా నోడ్‌ల అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పనుల నిర్వహణకు గుత్తేదారుల ఎంపిక కోసం ఎపిఐఐసి ఇపిసి విధానంలో టెండర్లు పిలిచింది. బిడ్‌ల దాఖలుకు జూన్ 12 తుది గడువుగా నిర్ధేశించింది. అదే రోజు సాంకేతిక బిడ్‌ల పరిశీలన పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. పనులు దక్కించుకున్న గుత్తేదారుకు 30 రోజుల్లో లెటర్ ఆఫ్ అవార్డు (ఎల్‌వోఏ) అందిస్తామని పేర్కొన్నారు. రెండు నోడ్‌లు అందుబాటులోకి వస్తే రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు,ఎగుమతులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ప్రభుత్వం పేర్కొంది.ఓర్వకల్లు నోడ్ హైదరాబాద్-బెంగుళూరు ఇండస్ట్రియల్ కారిడార్(హెచ్‌బిఐసి)లోభాగంగా కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు దగ్గర సుమారు >>2



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

## లారీ, కారు ఢీ: ఆరుగురు దుర్మరణం

### ప్రకాశం జిల్లాలో ఘోర ప్రమాదం

**ఒంగోలు, ప్రభాతవార్త:** ప్రకాశం జిల్లా కొమరోలు మండలం తాటిచెర్ల మోటు గ్రామ సమీపంలోని అమరావతి అనంతపురం జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. లారీ, కారు ఢీకొన్న సంఘటనలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు చిన్నారులకు తీవ్ర గాయాలు కావడంతో వారిని 108 వాహనంలో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతులలో ఇద్దరు మహిళలు నలుగురు పురుషులు ఉన్నారు. మృతులుబాపట్ల మండలం >>2



# త్వరలో వెంకన్న సత్వర దర్శనం

## ఎఐతో సామాన్యభక్తులకు అందుబాటులోకి

### గూగుల్, టిసిఎస్ సహకారంపై టిటిడి అడుగులు

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** రోజులు...గంటల తరబడి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి నిరీక్షణ లేకుండా సకాలంలో వీలైనంత త్వరగా భక్తులకు దేవుని వీక్షణభాగ్యం కలిగించేలా తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు కసరత్తు చేస్తున్నారు.కొండకు వస్తే నాలుగుగంటల్లోనే ఆ దేవుని దర్శనభాగ్యం చేయించాలనే ప్రణాళికలు ఆచరణలోకి తీసుకువచ్చే దిశగా టిటిడి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్‌నాయుడు, టిటిడి ఇఒ శ్యామలరావు, అదనపుఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి కృత్రిమమేధ (ఏఐ-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)సహకారం గూగుల్, టిసిఎస్‌తో ఒప్పందం కుదుర్చుకునేలా అధ్యయనం చేస్తున్నారు. ఇప్పటికే టిటిడి అధికారులు టెండర్లు కూడా ఆహ్వానించింది. తిరుమలలో భక్తులు వేచివుండే వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లు, వెలుపల క్యూలైన్ల వద్ద ఏఐ కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ఏఐ సేవలకోసం ప్రతి భక్తుడికి >>2

# కోవిడ్‌పై ఆందోళన వద్దు

## జాగ్రత్తలు అవసరం: మంత్రి సత్యకుమార్ యాదవ్




శుక్రవారం కొవిడ్ వ్యాప్తిపై సమీక్ష జరుపుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:**రాష్ట్రంలో తరుణ వ్యాధులను నియంత్రించేందుకు అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు వైద్యఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలో ప్రారంభంకానున్న వర్షాకాలంలో సంక్రమించే వ్యాధుల నివారణ కోసం సంబంధిత అన్ని శాఖల సమన్వయంతో సమర్థవంతంగా కృషి చేయాలని ఆరోగ్య శాఖా మంత్రి అధికారుల్ని ఆదేశించారు. కొవిడ్ సంక్రమణలు,తరుణ వ్యాధులను అరికట్టేందుకు సమాయత్తంపై మంత్రి సమీక్షను ఆయన శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిశుభ్రత, కలుషిత నీరు మరియు దోమ కాటు ద్వారా కలిగే సీజనల్ వ్యాధుల వలన ప్రజల జీవన నాణ్యత, ఉత్పాదకతలు దెబ్బతింటున్న నేపథ్యంలో ఈ రానున్న వర్షాకాలంలో ఆయా వ్యాధులను అదుపు చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలని మంత్రి సూచించారు. వర్షాకాలపు వ్యాధులు, కొన్ని చోట్ల వెల్లడవుతున్న దృష్ట్యా ఆధునిక టెక్నాలజీతో దోమలపై యుద్ధం డ్రోన్లు, మస్కిటీర్ వంటి యాప్‌లను వినియోగించుకుని రానున్న వర్షాకాలం, తదనంతరం దోమల వ్యాప్తిపై పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఈ దిశలో సత్ఫలితాలతో వ్యాధుల్ని అరికట్టవచ్చని మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యా నించారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలతో పాటు దోమలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో డ్రోన్ల ద్వారా దోమల నిరోధక రసాయనా లను చిమ్మటంతో మంచి ఫలితాలుంటాయని అన్నారు. అదే విధంగా దోమల సాంద్రతను గుర్తించడానికి ఉపయోగపడే మస్కిటీర్ యాప్ ను కూడా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు.

సమిష్టి పోరాటం అవసరం అపరి శుభ్రత, నీటి కాలుష్యం, నీటి నిల్వ, డ్రైనేజీ వ్యవస్థ వైఫల్యం, బహిరంగ మల విసర్జన వలన సంక్రమించే వ్యాధులను అరికట్టడానికి ఆయా శాఖల స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని మంచి ఫలితాల్ని సాధించేందుకు స్థానిక జిల్లా, క్షేత్ర స్థాయి అధికారులు కృషి చేయాలని మంత్రి సూచించారు.

గత సంవత్సరాల డేటా ఆధారంగా ఈ సమస్యలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల(హాట్ స్పాట్స్) వివరాల్ని ఆయా శాఖల అధికారులకు తెలిపి తగు నివారణ చర్యలు చేపట్టేలా చూడాలని మంత్రి ఆదేశించారు. అవసరాల మేరకు బ్లీచింగ్ పౌడరు మరియు క్లోరిన్ ట్యాబ్లెట్లు అందుబాటులో ఉండేలా ఆయా శాఖలను అప్రమత్తం చేయాలని అన్నారు. >>2

### కడపలో కరోనా పాజిటివ్ కేసు

**కడప, మే 23:** దేశవ్యాప్తంగా కరోనా వ్యాప్తి చెందుతుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూడా కరోనా కేసులు నమోదు అవుతున్నాయి. ఈ కోవలోనే నంద్యాల జిల్లాకు చెందిన వ్యక్తి తీవ్ర జ్వరంతో కడప రిమ్స్‌లో చేరారు. ఆయనకు కరోనా పాజిటివ్‌గా వైద్యులు నిర్ధారించారు.

## కొడాలి నానిపై త్వరలో లుకవుట్ నోటీసులు?

**విజయవాడ,మే 23,ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి,వైఎస్సార్సీ నేత కొడాలి నానిపై త్వరలో లుకౌట్ నోటీసులు జారీ అయ్యే అవకాశముంది. నాని అక్రమాలపై ఇప్పటికే విజిలెన్స్ విచారణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో తప్పుడు చిరునామాతో పాస్‌పోర్టు సృష్టించి విదేశాలకు వెళ్లే అవకాశమున్నందున ఆయనపై చర్యలు తీసుకోవాలని సిఐడి అదనపు డిఐజి కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు లేఖ రాశారు. దీంతో ఈ అంశాన్ని సంబంధిత అధికారులు పరిశీలిస్తున్నారు. తెలంగాణ చిరునామాతో కొడాలి నాని పాస్‌పోర్టు సృష్టించుకొని విదేశాలకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు పోలీసు వర్గాలు గుర్తించి >>2

# ఆర్డిటిపై కేంద్రంలో కదలిక

## కొత్తగా ఎఫ్‌సిఆర్‌ఎ కింద దరఖాస్తు చేసుకోవాలని కేంద్రం ఆదేశం, రంగంలోకి దిగిన మంత్రి నారాలోకేష్

### కేంద్ర ప్రభుత్వ అధికారులతో ఎంపిల బృందం భేటీ



**అనంతపురం, మే 23 ప్రభాతవార్త బ్యూరో :** ప్రముఖ స్వచ్ఛంద సంస్థ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ (ఆర్డిటి)కి ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ (ఎఫ్‌సిఆర్‌ఏ) కింద విదేశీ నిధులు వచ్చేందుకు మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వంలోని ముఖ్య అధికారులు ఆదేశించడం, ఆమేరకు ఆర్డిటి తాజాగా దరఖాస్తు చేసుకోవడం చకచక జరిగిపోయినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. టిడిపి రాష్ట్ర యువనేత, మంత్రి నారాలోకేష్ స్వయంగా పర్యవేక్షిస్తుండటంతో ఆర్డిటిపై కేంద్ర స్థాయిలో కదలిక వచ్చినట్లు సమాచారం. తాజాపరిణామాలు ఆశాజనకంగా ఉన్నట్లు ఆర్డిటి వర్గాలు భావిస్తున్నాయి. ఆర్డిటికి ఎఫ్‌సిఆర్‌ఏ కింద విదేశీ నిధులు ఆగిపోయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల స్పందించి రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఎంపిల బృందానికి కీలక బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. అందులో భాగంగా రాష్ట్రంలో ముఖ్య హోదాల్లో ఉన్న ఎంపిల బృందం మంత్రి నారాలోకేష్ చొరవ మేరకు ఢిల్లీకి వెళ్లి ఎఫ్‌సిఆర్‌ఏ ఉన్నతాధికారులతో సమావేశమై ఆర్డిటి చేస్తున్న ఎన్నో ఏళ్లుగా చేస్తున్న సేవ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించి వారి సందేహాలను నివృత్తి చేసినట్లు తెలియవచ్చింది. అందులో భాగంగా ఢిల్లీలోని ఎఫ్‌సిఆర్‌ఏ ఉన్నతాధికారులు కూలంకుశంగా చర్చించిన తర్వాత పాత యాక్టును కొనసాగించడం వీలుకాదని, కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపిల బృందానికి చెప్పడంతో ఆర్డిటి తగు రీతిలో స్పందించినట్లు సమాచారం. ఆర్డిటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ నేతృత్వంలో సంబంధిత ఆర్డిటి డైరెక్టర్లు, ఇతర ముఖ్యులు సమావేశమై ఫారిన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ యాక్ట్ కింద విదేశీ నిధులు ఆర్డిటి సంస్థకు వచ్చే విధంగా సంబంధిత నిబంధనల ప్రకారం తాజాగా దరఖాస్తు చేసుకున్నట్లు తెలియవచ్చింది. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఎఫ్‌సిఆర్‌ఏ కింద విదేశీ నిధులు వచ్చేందుకు కొత్త దరఖాస్తుకు అనుమతించేందుకు రాష్ట్రంలోని చంద్రబాబు సర్కార్ గట్టి ప్రయత్నం చేయడం, ఈ విషయంలో మంత్రి నారా లోకేష్ >>2



# దేశవ్యాప్తంగా 50 కొత్త ఎయిర్‌పోర్టులు

## వచ్చే ఐదేళ్లలో నిర్మిస్తాం: కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

**విజయవాడ, మే23,ప్రభాతవార్తప్రతినిధి:** దేశ వ్యాప్తంగా రాబోయే ఐదేళ్లలో 50 కొత్త విమానాశ్రయాలు నిర్మిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహననాయుడు పేర్కొన్నారు. శ్రీకాకుళంలో జరిగిన పార్లమెంట్ స్థాయి మినీ మహానాడు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అత్యంత చిన్న వయస్సులో కేంద్ర మంత్రిగా నాకు అవకాశం ఇచ్చారు. నేను ఎలా పనిచేస్తున్నానని ప్రధాని మోడీ తూకం వేస్తుంటే.. రాష్ట్రానికి ఎన్ని నిధులు తీసుకొస్తున్నానని ముఖ్యమంత్రి చంద్రబాబు తూకం వేస్తున్నారు. అందుకే ఐదేళ్ళలో 50 విమానాశ్రయాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇప్పటికే కొన్ని ప్రారంభం కాగా,మరికొన్నింటికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

రాష్ట్రంలో శ్రీకాకుళం, నెల్లూరు, కుప్పం, అమరావతిల్లో విమానాశ్రయాలను త్వరలో ప్రారంభిస్తాం. వీటితో పాటు మరో మూడు చోట్ల ఏర్పాటు చేసేందుకు పరిశీలిస్తున్నాం. అమరావతికి రూ.48 వేల కోట్లు,పోలవరానికి రూ.12 వేల కోట్లు,విశాఖ ఉక్కు పరిశ్రమకు రూ.10,500 కోట్లు తెచ్చుకోగలిగాం. రైల్వే జోన్‌కు శంకు >>2

## 2 రోజుల పోలీసు కస్టడీకి వల్లభనేని

### నకిలీ ఇళ్ల పట్టాల కేసు

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** నకిలీ ఇళ్ళ పట్టాల కేసులో వైకాపా నేత గన్నవరం మాజీ ఎంఎల్‌ఏ వల్లభనేని వంశీని రెండు రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ కేసులో సమగ్ర దర్యాప్తు నిమిత్తం వంశీని ఏడు రోజులు కస్టడీకివ్వాలని హనుమాన్‌జంక్షన్ పోలీసులు ఈ నెల 19న పిటీషన దాఖలు చేశారు. దీనిపై నూజివీడు సెకండ్ అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో ఈ నెల 20న వాదనలు వినిపించారు. తుది విచారణ అనంతరం వంశీని రెండు రోజులు కస్టడీకిస్తూ, న్యాయాధికారి శ్రావణి గురువారం ఆదేశాలు జారీ చేశారు. దీంతో శుక్ర,శనివారాల్లో పోలీసులు ఆయన్ను విచారించను >>2

# మరో ఐదుగురు మావోయిస్టుల ఎన్‌కౌంటర్

- గడ్చిరోలిలో నలుగురు, సుక్మాజిల్లాలో ఒకరు
- మూడు రోజుల్లో 32 మంది హతం

**చర్ల, మే 23 ( ప్రభాతవార్త ):** టార్గెట్ 2026 మార్చి 31 ని యుద్ధ ప్రాతిపదికన అమలు చేస్తుంది కేంద్ర ప్రభుత్వం.అనుకున్న సమయానికల్లా ముగింపు పలకాలని భీష్మించుకుంది. వరుసగా మూడురోజుల్లో భద్రతా బలగాలు మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో 32 మంది మావోయిస్టులు మరణించారు. బుధవారం నారాయణ్ పూర్ జిల్లా మాడ్ అడవులలో జరిగిన ఎదురుకాల్పులలో మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్రకమిటి ప్రదాన కార్యదర్శి నంబాల కేశవరావు పార్టీ పత్రిక జంగ్ ఎడిటర్ నాగేశ్వరరావు లతో సహా 27 మందిని హతమార్చిన సంఘటన నుండి మావోయిస్టులు కోలుకోకముందే వారిపై మరిన్ని దాడులు జరుగుతున్నాయి.తాజా గా గురువారం బీజపూర్ జిల్లా తుమ్రెల్ అటవీప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పులలో ఒక మావోయిస్టు ఒక డిఆర్జి జవాన్ మృతి చెందారు. శుక్రవారం సుక్మా జిల్లా కిష్టారం అటవీప్రాంతంలో జరిగిన ఎదురుకాల్పులలో ఒక మావోయిస్టు మృతి చెందాడు.

మహారాష్ట్ర ఛత్తీస్‌ఘడ్ సరిహద్దులోని గడ్చిరోలీ జిల్లా కవండే నెల్గుండ అటవీప్రాంతంలోని ఇంద్రావతి నది ఒడ్డున జరిగిన ఎదురుకాల్పులలో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఇంద్రావతి నది ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ రమేష్ ఆద్వర్యంలో సి 60కు >>2

# సజ్జల భార్గవ రెడ్డికి 'సుప్రీం'లో చుక్కెదురు

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** వైకాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మాజీ కన్వీనర్ సజ్జల భార్గవరెడ్డికి సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులకు సంబంధించిన కేసుల్లో ఆయనకు ముందస్థు బెయిలు ఇచ్చేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. అరెస్ట్ నుండి 2వారాల పాటు మధ్యంతర ఉపశమనం కల్పించింది. ఆ లోపు ట్రయల్ కోర్టును ఆశ్రయించాలని ఆదేశించింది. విచారణ సందర్భంగా సజ్జల భార్గవరెడ్డిపై జస్టిస్ పంకజ్ మిత్తల్,జస్టిస్ ఎస్వీఎన్ భట్టి ధర్మాసనం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సోషల్ మీడియాలో ఆయన పెట్టిన పోస్టులపైనా తీవ్ర అభ్యంతరం తెలిపింది. సోషల్ మీడియాలో మీరు పెట్టిన పోస్టులు మాకు అర్థం కాలేదనుకున్నారా?ఏ ఆలోచనతో పోస్టులు పెట్టారో ఆ మాత్రం తెలుసుకోలేమా? ఆ పోస్టులు భరించరాని స్థాయికి వెళ్లాయి. తప్పు ఎవరు చేసినా తప్పే.ఇలాంటి వాటిని వ్యవస్థ క్షమించదు. తప్పక శిక్షిస్తుంది. సోషల్ మీడియా దుర్వినియోగం కేసుల్లో త్వరగా బెయిలు వస్తుందనుకోవద్దు.అలా బెయిల్ వస్తే ప్రతి ఒక్కరూ ఇష్టారీతిన వ్యవహరిస్తారు అని సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది.

**రాజ్ కెసిరెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ**

ఎపి మద్యం కుంభకోణం కేసులో రాజ్ కెసిరెడ్డికి సుప్రీం కోర్టులో ఎదురుదెబ్బ >>2




శుక్రవారం న్యూఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్రసింగ్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

# అంతరిక్ష రంగంలో ముందుకు..

## కేంద్ర మంత్రులు, రాజ్‌నాథ్ సింగ్, నిర్మలా సీతారామన్, జితేంద్రసింగ్, సిఆర్ పాటిల్, ప్రహ్లాద్ జ్యోషితో సిఎం చంద్రబాబు వేర్వేరుగా భేటీ

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సిఎం చంద్రబాబు శుక్రవారం ఢిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రక్షణ, ఏరోస్పేస్‌రంగాలలో ఆంధ్రప్రదేశ్ దూరదృష్టిని కేంద్ర రక్షణ మంత్రికి సిఎం వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని కీలక ప్రాంతాల్లో పారిశ్రామిక వృద్ధికి అవసరమైన మౌలికసదుపాయాలు, పరిశోధన సహకారం, వ్యూహాత్మక సంస్థాపనలతో కూడిన సమగ్ర ప్రణాళికను వివరించారు. ఈ ప్రతిపాదనలలో ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ యూనిట్ల అభివృద్ధి, కీలక తయారీ యూనిట్ల పునరుద్ధరణ, స్వదేశీ విమానయాన కార్యక్రమాలకు మద్దతు, టెస్టింగ్, శిక్షణా కేంద్రాల ఏర్పాటు, ప్రత్యేకంగా స్థానికంగా లభించే సామర్థ్యాలను ప్రోత్సహించడానికి తగ్గ రక్షణ కేంద్రాల సృష్టి ఉన్నాయన్నారు. పటిష్టమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన శ్రామికశక్తి, క్రియాశీలక విధాన వాతావరణంతో ఆత్మనిర్భర్ భారత్‌ను రక్షణ ఉత్పత్తి, ఆవిష్కరణల ద్వారా ముందుకు తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించ డానికి ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేశరక్షణ,ఉగ్రవాద శక్తుల అణచివేత తదితరంశాల్లో ఎపి కేంద్రానికి పరిపూర్ణ మద్దతును ఇస్తుందని తెలిపారు.

**నిర్మలా సీతారామన్‌తో..**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సిఎం చంద్రబాబు ఢిల్లీ బేటీ అయ్యారు. రాష్ట్రానికి కేంద్రబడ్జెట్‌లోను,విడిగా కేటాయించిన నిధుల విడుదల తదితరంశాపై సిఎం ఆమె చర్చించారు. రాజధాని అమరావతి నిర్మాణ పనులు ఆరంభమయ్యాయని,ఈ దిశలో రాష్ట్రానికి కేటాయించిన నిధుల సకాలంలో విడుదల చేయాలని విజ్ఞప్తి చేసారు.రూ.30వేల కోట్ల మేరకు వివిధ రూపాల్లో రాష్ట్రానికి ఇచ్చే దిశలో కేంద్రపరంగా అందుతున్న సహకారం పట్ల చంద్రబాబు ఆమెకు ధన్యవాదాలు తెలిపారు.రాష్ట్రానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని కోరారు. పోలవరం ప్రాజెక్ట్ పురోగతి,ఆ ప్రాజెక్ట్ లింక్ ప్రాజెక్టు బనకచర్లకు సహకరించాలని కోరారు.

**జితేంద్రసింగ్‌తో..**

అంతరిక్ష తయారీ, ఆవిష్కరణలకు కీలక కేంద్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ మద్దతు ఇవ్వాలని సిఎం చంద్రబాబు కేంద్ర మంత్రి జితేంద్రసింగ్‌ను కోరారు.ఈ మేరకు ఆయనకు ఒక సమగ్ర ప్రతిపాదనను సిఎం సమర్పించారు. ఈ సందర్భంగా ఈ ప్రతిపాదనలో రాష్ట్ర మద్దతుతో రెండు స్పేస్ సిటీల అభివృద్ధికి సంబంధించిన వివరాలున్నాయి. వీటిలో ఒకటి ఇస్రో షార్ అంతరిక్ష కేంద్రం సమీపంలో, మరొకటి లేపాక్షి వద్ద ఉంటాయి. ఉపగ్రహాల ఉత్పత్తి, ప్రయోగ వాహనాల అభివృద్ధి, పరిశ్రమల సహకారానికి ఇవి సమగ్ర కేంద్రాలుగా ఉపయోగపడనున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అంతరిక్ష సాంకేతికత సలహాదారుగా ఇస్రో మాజీ ఛైర్మన్ డా.ఎస్. సోమనాథ్ నియామకం గురించి కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి ప్రత్యేకంగా తెలియజేశారు. ఆయన మార్గదర్శకత్వంలో అంతర్జాతీయంగా పోటీపడే అంతరిక్ష ఎకోసిస్టంను నిర్మించడంలో రాష్ట్ర ప్రయత్నాలకు ఈ నియామకం దిశానిర్దేశం చేస్తుందని వివరించారు.

**'పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు సహకరించండి'**

కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను ఢిల్లీలో సిఎం చంద్రబాబు కలిశారు. ఈ సమావేశంలో పోలవరం – బనకచెర్ల అనుసంధాన ప్రాజెక్టు ప్రతిపాదనను సమర్పించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరించాలని కోరారు.ఈ ప్రాజెక్టు నిర్మాణం వలన రాష్ట్రమంతటా సాగు,మంచినీటి సమస్య ఉండదని తెలిపారు.గోదావరి వరద నీటిని ఎపిలోని కరువు పీడిత ప్రాంతాలకు మళ్లించడమే ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు లక్ష్యమన్నారు.

# త్వరలో వెంకన్న సత్వర దర్శనం

>> శాశ్వత ఐడి కేటాయించనున్నారు. దేవదేవుని దర్శనాలకోసం టిటిడి ప్రస్తుతం రోజువారీగా ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లో, సిఫార్సు లేఖల ద్వారా, ప్రత్యేక దర్శనాలు ఇలా 70వేలవరకు భక్తులకు జారీచేస్తున్నారు. ఎలాంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేకుండా సామాన్యభక్తులు నేరుగా తిరుమలకు వచ్చినా క్యూకాంప్లెక్స్‌ల వెలుపల అదనపు క్యూలైన్లలోగానీ, వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలో కిలోమీటర్లు, గంటలు తరబడి నిరీక్షణకు చెక్‌పెట్టనున్నారు. ఇందుకు అవసరమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పనితీరును ప్రయోగాత్మకంగా పరిశీలించాలని నిర్ణయించారు.

**భక్తుల ఆధార్, ముఖగుర్తింపుతో టోకెన్:**

తిరుమలకు రోజువారీగా లక్షమందివరకు భక్తులు వస్తుండటం, తిరుమలలో వైకుంఠమ్ 1, వైకుంఠమ్ 2 క్యూకాంప్లెక్స్‌లలో 62కంపార్టుమెంట్లు ఉన్నాయి.ఒక్కోకంపార్టుమెంట్ సామర్థ్యం 450మంది భక్తులు. వచ్చిన వారిలో గంటకు 4,700మంది వరకు మహాలఘులో గోవిందుని దర్శనమ్ చేయిస్తున్నా రోజులో సరాసరి 80వేలమందికి మించి దర్శనభాగ్యమ్ కల్పించలేకపోతున్నారు. దర్శనాల్లో గంటలతరబడి నిరీక్షణకు చెక్‌పెట్టాలనేది టిటిడి అధికారుల ఆలోచన. ఇందుకోసం ప్రయోగాత్మకంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో దర్శనానికి తిరుమలకు చేరుకున్న భక్తులకు వారి ఆధార్‌కార్డు నంబర్, ముఖగుర్తింపు ఆధారంగా చేసుకుని టోకెన్ జారీచేయనున్నారు. ఇందులో భక్తులకు దర్శనసమయం కేటాయించబడుతుంది. టోకెన్ పొందిన భక్తులు వారికి కేటాయించిన సమయానికి వైకుంఠమ్ క్యూలైన్లోకి ప్రవేశిస్తే అక్కడ కూడా భక్తుల ముఖగుర్తింపు స్కాన్‌చేసి ఆ తరువాత దర్శనానికి అనుమతినిస్తారు. అక్కడ ప్రవేశించిన భక్తుడు గంట,గంటన్నర సమయంలోనే ఆలయంలోనికి చేరుకుని ఇష్టదైవం ఏడుకొండలవాడిని సంతోషంగా దర్శనం చేసుకుని ఆలయం వెలుపలకు వచ్చే అవకాశం త్వరలోనే కలగనుంది.

## మద్యం కేసు నిందితుల కస్టడీ పిటిషన్ల విచారణ వాయిదా

**విజయవాడ మే 23 ప్రభాతవార్త ప్రతినిధి:** మద్యం కుంభకోణం కేసుల అరెస్టై జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న సిఎంవో మాజీ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను విజయవాడ ఎసిబి కోర్టు ఈ నెల 26 కి వాయిదా వేసింది. మద్యం కుంభకోణం కేసులఅరెస్టై జ్యుడిషియల్ కస్టడీలో ఉన్న సిఎంవో మాజీ కార్యదర్శి కె.ధనుంజయరెడ్డి జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్ రెడ్డి భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను వారం రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలంటూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను విజయవాడ ఏసీబీ కోర్టు ఈ నెల 26కి వాయిదా వేసింది. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డిని మరోసారి కస్టడీకి ఇవ్వాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ కూడా అదే రోజుకు వాయిదాపడింది. ధనుంజయరెడ్డి కృష్ణమోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, రాజ్ కెసిరెడ్డిలు విచారణకు సహకరించలేదని వారిని కస్టడీకి ఇవ్వాలని సిట్ తరపు న్యాయవాదుల కోరారు.

## 'సుప్రీం'లో చుక్కెదురు

>> తగిలింది. కెసిరెడ్డి ఉపేంద్రరెడ్డి,రాజ్ కెసిరెడ్డి పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఇప్పటికే కస్టడీలో ఉన్నందున బెయిలు కోసం సంబంధిత కోర్టును ఆశ్రయించాలని సూచించింది. తన కుమారుడి అరెస్ట్ సమయంలో నిబంధనలు పాటించలేదని ఉపేంద్రరెడ్డి పిటీషన్ వేసిన విషయం తెలిసిందే. మరోవైపు తన అరెస్ట్ అక్రమమని రాజ్ కెసిరెడ్డి పిటీషన్ దాఖలు చేశారు. పక్క రాష్ట్రంలో ఉంటే అరెస్ట్ చేసే అధికారి ఏపీ సీఐడికి లేదని అందులో పేర్కొన్నారు.

# మావోయిస్టులు ఎన్‌కౌంటర్

>> చెందిన 12 బృందాలు సిఆర్పీఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించాయి. కవండె నెల్గుండ అటవీప్రాంతంలో మావోయిస్టులు ఎదురుపడటంతో ఇరువర్గాల నడుమ హోరాహోరీగా కాల్పులు జరిగాయి.ఈ ఎదురుకాల్పులలో నలుగురు మావోయిస్టులు మృతిచెందగా వారి మృత దేహాలను భద్రతా బలగాలు స్వాదీన పరుచుకున్నారు. సంఘటనా ప్రాంతం నుండి ఒక ఆటోమెటిక్ కార్గో రైఫిల్, రెండు 303 రైఫిల్స్, ఒక రివాల్వర్, పక వాకీటాకీ, మావోయిస్టు సామగ్రి, విప్లవ సాహిత్యం స్వాదీన పరుచుకున్నారు. తప్పించుకున్న మావోయిస్టుల కొరకు కూంబింగ్ కొనసాగుతున్నట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి.

# ఓర్వకల్లు, కొప్పర్తి ప్రాజెక్టు

>> 9,305 ఎకరాల్లో అభివృద్ధి చేసేలా ప్రతిపాదించారు. మొత్తంగా 8 ప్రాంతాల్లో నోడ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. కొప్పర్తినోడ్‌లో విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్(విసిఐసి)లో భాగంగా వైఎస్సార్ కడప జిల్లాలోని కొప్పర్తి పారిశ్రామిక నోడ్‌ను 2,595.74 ఎకరాల్లో అభివృద్ధిచేయనుంది. మొదటి దశలో డిజైన్లు,కన్‌స్ట్రక్షన్,టెస్టింగ్,కమీషనింగ్ పనులను నిర్వహించనుంది. విశాఖపట్నం,చెన్నై మధ్యలో పారిశ్రామిక నోడ్ ఉండటం కలిసొస్తుంది. ఈ పనుల పర్యవేక్షణ కోసం ఎపి ఇండస్ట్రియల్ కారిడార్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరిట ప్రత్యేక ప్రణాళిక నైపౌకని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# కేంద్రంలో కదలిక

>> స్వయంగా పర్యవేక్షిస్తుండటం గమనించ దగ్గ విషయం. ఈ నేపథ్యంలో మంత్రి నారాలోకేష్ నేతృత్వంలో ఎంపిల బృందం ఢిల్లీలో సంబంధిత ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి త్వరగా ఎఫ్‌సిఆర్‌ఏ కింద విదేశీ నిధులు ఆర్డిటికి వచ్చే టట్లు అనుమతి ఇప్పించేందుకు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆర్డిటి సేవలు అందిస్తోంది. ఆంధ్రతోపాటు, తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో ఆర్డిటి సేవలందిస్తున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లా, కర్నూలు జిల్లాల్లో ఎన్నో గ్రామాల్లో విద్య, వైద్య, ఇతర రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తోంది. గత ఏడాది నుంచి ఎఫ్‌సిఆర్‌ఏ కింద విదేశీ నిధులు ఆర్డిటి సంస్థకు ఆగిపోతూ వస్తున్నాయి. ఈ ఏడాది పూర్తిగా నిలుపుదల చేశారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు సేవలు అందించడంలో కీలకంగా గుర్తింపు తెచ్చుకున్న ఆర్డిటి సంస్థ చిక్కుల్లో పడింది. ఆర్డిటి సంస్థ ద్వారా ఎందరో విద్యార్థులను ఉన్నత చదువులను చదివించే విద్య పథకాన్ని నిధుల లేమితో నిలుపుదల చేసింది. బత్తలపల్లి, కళ్యాణదుర్గం లాంటి ఎన్నో ఆసుపత్రుల్లో గణనీయమైన సేవలను ఆర్డిటి నిర్వహిస్తోంది. ఆసుప్రతుల్లో కూడా సేవలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. ఆర్డిటి సంస్థకు విదేశీ నిధులు ఆగిపోవడంతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేక మాంఛో ఫెర్రర్ నేతృత్వంలోని ఆర్డిటి సంస్థ ఆందోళనకు గురవుతోంది. 55 ఏళ్ల చరిత్ర కలిగిన ఆర్డిటి సగటున ఏడాదికి 350 కోట్ల నుంచి దాదాపు 500 కోట్ల వరకు బడ్జెట్ ఉంటూ వచ్చింది. ఆర్డిటి వ్యవస్థాపకులు దివంగత విన్సెంట్ ఫెర్రర్, అన్నేఫెర్రర్ నేతృత్వంలో దశాబ్దాల కాలం కృషి చేసిన ఫలితంగా ఆర్డిటి సంస్థ ఒక పెద్ద సంస్థగా మారిపోయింది. ఆర్డిటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్, వై.మల్లారెడ్డి లాంటి ఎందరో డైరెక్టర్లు ఆర్డిటి సిబ్బంది చేసిన కృషి ఫలితంగా ఆర్డిటికి మంచి పేరు వచ్చింది. దేశంలో టాప్ 10 ఎన్జీఓలలో ఆర్డిటి ఒక సంస్థగా నిలిచింది. అయితే విదేశీ నిధులు ఎఫ్‌సిఆర్‌ఏ కింద ఆగిపోవడంతో ప్రతి యేటా 8.5 లక్షల మందికి వస్తరించే దాదాపు 300 కోట్ల రూపాయల విలువైన వైద్య సేవలు నిలిచిపోయే ప్రమాదం కనిపిస్తోంది. అందులో పని చేసే 3వేల మంది సిబ్బంది నిరుద్యోగులుగా మారే అవకాశం కనిపిస్తోంది. బత్తలపల్లి, కళ్యాణదుర్గం ఆసుపత్రుల్లో ఎంతో మంది ఔట్ పేషంట్లు వస్తున్నారు. కోవిడ్ సమయంలో బత్తలపల్లిలో 300 పడకల ఆసుపత్రి చేసిన సేవలు అపారం. ఆర్డిటి 264 మంది విద్యార్థులతో 3 ఇన్‌క్లూజివ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, 466 మంది విద్యార్థులతో రెండు ఇన్‌క్లూజివ్ ఉన్నత పాఠశాలలు నిర్వహిస్తోంది. ఈ విధంగా విద్య, వైద్య, గృహ నిర్మాణం, వికలాంగులకు సేవలు, రైతులు, రైతు కూలీలకు సహాయం వివిధ రూపాల్లో ఆర్డిటి సంస్థ అభివృద్ధి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయింది. ప్రస్తుతం ఆర్డిటి ఎగ్జ్క్యూటివ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్ నేతృత్వంలో ఆర్డిటి సంస్థ డైరెక్టర్లు, ఇతర సిబ్బంది అంకిత భావంతో పని చేస్తూ ఆర్డిటిని ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఎఫ్‌సిఆర్‌ఏ కింద విదేశీ నిధులు వచ్చే విధంగా కొత్తగా ఆర్డిటి చేసుకున్న దరఖాస్తుపై కేంద్రం త్వరితగతిన చర్యలు తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనంతపురం జిల్లాలో ఆర్డిటికి విదేశీ నిధులు నిలుపుదలపై అన్ని రాజకీయ పార్టీలు రాజకీయాలకు అతీతంగా స్పందించాయి. వివిధ సంఘాలు, స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ఉద్యమం బాట పట్టారు. అనంతపురం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, పరిటాలసునీత, అమిలినేని సురేంద్ర బాబు, దగ్గుపాటి ప్రసాద్ తదితరులు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిసి ఆర్డిటి విషయంలో వినతిపత్రం సమర్పించారు. ఇటీవల కాలంలో మంత్రి నారాలోకేష్ జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా ఆర్డిటి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మాంఛోఫెర్రర్, ఇతర టిడిపి ప్రజా ప్రతినిధులు మంత్రి నారాలోకేష్‌ను కలిసి పరిస్థితిని వివరించారు. ఆ తర్వాత మంత్రి నారాలోకేష్ స్వయంగా రంగంలోకి దిగడంతో ఎంపిల బృందం కేంద్ర ప్రభుత్వ ముఖ్యులను కలవడం, ఆ తర్వాత ఆర్డిటి కొత్తగా దరఖాస్తు చేసుకోవడం చకచక జరిగిపో యాయి. ఈ నేపథ ్యంలో త్వరితగతిన కేంద్రం అనుమతి ఇప్పించే విషయంలో రాష్ట్రంలో కూటమి సర్కార్‌లో ఉన్న టిడిపి, బిజెపి, జనసేన ముఖ్యులు తగిన రీతిలో స్పందిస్తారని జిల్లా ప్రజలు ఆశిస్తున్నారు.

# ఎయిర్‌పోర్టులు

>> స్థాపనచేసుకున్నాం. ఓర్వకల్లు, కొప్పర్తిలో 5వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయబోతున్నాం. రాష్ట్రంలో అనేక ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వాటిని నాయకులే అనుభవించాలి తప్ప ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలని సిఎం చంద్రబాబు పని చేస్తున్నారు. సంక్షేమం–అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నారు అని రామో ్మహన్‌నాయుడు అన్నారు.

# కస్టడీకి వల్లభనేని

>> న్నారు. ఉదయం 10నుండి సాయంత్రం 4 గంటల వరకూ మాత్రమే విచారణ చేయాలని, ఆయన తరపు న్యాయవాదిని అనుమతించాలని కస్టడీ ఉత్తర్వుల్లో న్యాయాధికారి సూచించారు. మరోవైపు ఇదే కేసులో ఈ నెల 16న వంశీకి రిమాండ్ విధించిన నేపథ్యంలో ఆయన తరపున వేసిన బెయిలు పిటీషన్‌పై గురువారం ఇదే కోర్టులో వాదనలు కొనసాగాయి. బెయిలు ఇస్తే సాక్షులను,సాక్ష్యాలను ప్రభావితం చేస్తారని ఏపీపీ ప్రసన్న వాదనలు వినిపించగా.. ఆరోగ్య కారణాల రీత్యా బెయిలు మంజూరు చేయాలని వంశీ తరపు న్యాయవాది కోరారు. దీనిపై తీర్పును ఈనెల 26కు వాయిదా వేశారు.

# నోటీసులు?

>> నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే ఆయనపై లుకౌట్ నోటీసుల జారీకి సమాయత్తమవుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు నాని అక్రమాలపై విజిలెన్స్ విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆయన కదలికలపై నిఘా పెట్టాలని డిజీపికి తెదేపా ఫిర్యాదు చేసింది. ఈ మేరకు టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు.

# దుర్మరణం

>> స్టువర్టుపురం గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. మృతులు గజ్జల అంకాలు (40) గజ్జల భవాని (25) గజ్జల నరసింహులు (20) బొచ్చు సన్నీ (30) కర్రెద్దుల దివాకర్ (30) గజ్జల బబ్బులు (30) గజ్జల జనార్ధన్ (30) గా పోలీసులు తెలిపారు. గాయపడ్డ చిన్నారులలో జీతన్ పరిస్థితి విషమంగా ఉండటగా శిరీషకు తీవ్ర గాయాలయ్యాయి. వీరు ప్రస్తుతం గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మీరు నంద్యాల జిల్లా డోన్‌లోని బంధువుల ఇంటికి పెళ్లికి వెళ్లి అక్కడినుండి మహానంది దర్శనం అనంతరం తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. కారు డ్రైవర్ దివాకర్ నిర్లక్ష్యంగా కారు నడపడం వల్లే రోడ్డు ప్రమాదం జరిగిందని విచారణలో పోలీసులు గుర్తించారు. ప్రమాద స్థలాన్ని డీఎస్పీ నాగరాజు పరిశీలించారు. మృతదేహాలన్నిటిని పోస్టుమార్టం కొరకు గిద్దలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసునమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వారం - వర్జ్యం

తేది : 24-05-2025, శనివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
వైశాఖ మాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, కృష్ణ పక్షం
ద్వాదశి రా.7.17
రేవతి మ.1.45
వర్జ్యం ఉ.7.36-9.02
దు.శె.5.36-7.16
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం :** ఖర్చులు పెరుగుతాయి. భూవివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. శ్రమ పెరుగుతుంది.

**వృషభం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక సమస్యలు ఎదురై చికాకులు పెడతాయి.

**మిథునం:** కుటుంబంలో సమస్యలు ఎదురైన అధిగమించి ముందుకు సాగుతారు. బాధలు తప్పవు.

**కర్కాటకం:** దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**సింహం:** ఆర్థిక లావాదేవీలతో పురోగతి సాధిస్తారు. విందు, వినోదాలు, శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**కన్య :** పనులలో పురోగతి. జీవిత భాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. వాహనయోగం.

**తుల :** కుటుంబంలో శుభకార్యాలు. నూతన ప్రయత్నాలు ఫలిస్తాయి. పనులలో అనుకూలత. ఆకస్మిక ధనలాభం.

**వృశ్చికం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురై చికాకులు పెడతాయి.

**ధనుస్సు:** పనులలో ఆటంకాలు ఎదురై చికాకులు పెడతాయి. ఋణబాధలు తప్పవు. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు.

**మకరం:** కుటుంబంలో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. వ్యవహారాలు మందగిస్తాయి. వాహనయోగం.

**కుంభం:** ప్రముఖుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి. ప్రయాణాలు.

**మీనం :** సంఘంలో మీ మాటకు విలువ పెరుగుతుంది. శ్రమపడ్డా ఫలితం ఉండదు. ఋణవత్తిడులు తప్పవు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం న్యూఢిల్లీలో క్రిమినల్ చట్టాలపై సమావేశంలో పాల్గొన్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సిఎం చంద్రబాబు తదితరులు

# అమరావతిని నోటిపై చేయండి

>> జకవర్గంలో 10 వేల కుటుంబాలకు విద్యుత్ ఇస్తా.ం సూర్యఘర్ అమలుకు మద్దతు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం. మా ప్రభుత్వం ఎపి ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని తీసుకొచ్చింది ఈ పాలసీ ప్రకారం 72 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయాలని. రూ.28346 కోట్ల విలువైన గ్రీన్ ఎనర్జీ కారిడార్ ఇవ్వాలని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషీని కోరాం. అందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.రాష్ట్రానికి సంబంధించి ముఖ్య అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చించేందుకు నీతి అయోగ్ పాలకమండలం సమావేశంలో పాల్గొనేందుకు సిఎం చంద్రబాబు గురువారం రాత్రి ఢిల్లీ చేరుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకూ హోంమంత్రి అమిత్‌షా సహా ఏడుగురు కేంద్ర మంత్రులను కలుసుకున్నారు. ఉదయం 10 గంటలకు కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ 11 గంటలకు రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మధ్యాహ్నం 12గంటలకు జలశక్తి మంత్రి సిఆర్ పాటిల్ ఒంటి గంటకు కేంద్ర శాస్త్ర సాంకేతిక వ్యవహారాలు శాఖ మంత్రి జితేంద్రసింగ్ 3 గంటలకు ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌లను కలుసుకున్నారు.సాయంత్రం షెడ్యూల్‌ను అనుసరించి ఆయన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, ఎలక్ట్రానిక్స్ ఐటీ రైల్వే శాఖల మంత్రి అశ్వినీవైష్ణవ్‌లను సీఎం చంద్రబాబు కలుసుకున్నారు. గ్రీన్‌ఎనర్జీ ఆంధ్రప్రదేశ్‌లో రక్షణ ఉత్పత్తుల తయారీ ఏరోస్పేస్ హబ్ ఏర్పాటు పోలవరం ప్రాజెక్టు నిర్మాణం , జల్‌జీవన్ మిషన్ అమలుకు సహకారం రాష్ట్రానికి మెరుగైన ఆర్థిక సాయం ఎలక్ట్రానిక్స్ ఐటీ పరిశ్రమల ఏర్పాటులో సహకారం కొత్త క్రిమినల్ చట్టాల అమలు గురించి చర్చించనున్నారు. రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు ఏర్పాటుచేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించాలని కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నందున అందుకు కేంద్రం తరపున సహకారం అందించాలని చంద్రబాబు కోరున్నారు. సాగునీరు, తాగునీరు, ఇతర మౌలిక వసతుల ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయడానికి ఆర్థికంగా అనుమతుల పరంగా వేగంగా చేయూతను ఇవ్వాలని విజ్ఞప్తి చేయనున్నారు.

**నీత్ అయోగ్ పాలకమండలి సమావేశం నేడు**

భారత్ మండపంలో ప్రధాని మోడీ ఆధ్వర్యంలో శనివారం జరిగే నీతి అయోగ్ పాలకమండలి 10వ సమావేశంలో చంద్రబాబు పాల్గొననున్నారు. ఉదయం 8-45నుంచి సాయంత్రం 4వరకు సమావేశం ఉంటుంది.

# రైల్వే స్టేషన్‌లో బాలుడి మృతిపై నేడు విచారణ

## నలుగురు ఉన్నతాధికారులతో నిజనిర్ధారణ కమిటీ

**గుంతకల్లు రైల్వే,మే 23,ప్రభాతవార్త:** గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం మణికంఠ అనే బాలుడు మృతిచెందిన సంఘటనకు సంబంధించి డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా విచారణకు ఆదేశించారు. కర్నూలుకు చెందిన వెంకటేశ్వర్లు కుటుంబం శుక్రవారం ఉదయం గుంతకల్లు నుంచి (అహ్మదబాద్ నుంచి తిరుచిరాపల్లి వెళ్లే నెంబర్ 09419ఎక్స్‌ప్రెస్‌లో) తమిళనాడుకు తీర్థయాత్రలకు వెళ్లాల్సి ఉంది. అయితే గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో ప్లాట్ ఫాం నెంబర్ 6-7మద్యనున్న వెయిటింగ్ హాల్‌లో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో శుక్రవారం తెల్లవారుజామున 4.30గంటల ప్రాంతంలో స్టేషన్ పై కప్పు పెచ్చులు మణికంఠపై విరిగిపడడంతో తలకు బలమైన, తీవ్రంగా గాయాలయ్యాయి. బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డిఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్ఎం సుధాకర్ డివిజన్‌కు చెందిన సంబంధిత ఉన్నతాధికారులకు చెందిన నలుగురు ఉన్నతాధికారులతో నిజనిర్ధారణ కమిటీని నియమించారు. ఈ కమిటీ విధుల నిర్వహణలో ఉన్న 15మంది రైల్వే సిబ్బందిని గుర్తించి వారిని శనివారం జరిగే విచారణకు హాజరు కావాలని ఆదేశాలు జారీ చేసింది.

## ధనుంజయ్, కృష్ణమోహన్‌రెడ్డిని స్పెషల్ కేటగిరిగా చూడాలి

**విజయవాడ మే 23 ప్రభాతవార్త ప్రతినిధి:** జైలు నిబంధనల ప్రకారం ధనుంజయ్‌రెడ్డి కృష్ణమోహన్ రెడ్డిలను స్పెషల్ కేటగిరీగా చూడాలని కోర్టు ఆదేశించింది. ధనుంజయ్‌రెడ్డి కృష్ణమోహన్‌కి జైలులో సౌకర్యాల కోసం పిటిషన్లపై ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది.విచారణ సందర్భంలో నిందితుల తరపు న్యాయవాదులు తమ క్లైయింట్లుకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని కోరారు.అంతేకాకుండా వారికి బయటనుంచి భోజనంఅందించాలని అభ్యర్థించింది.ఈ క్రమంలో నిందితులిద్దరికీ వారంలో మూడ్రోజులు సోమవారం, బుధవారం, శుక్రవారం బయటి భోజనానికిఅనుమతినిస్తూ ఆదేశాలు జారీ చేసింది.

# కొవిడ్‌పై ఆందోళన వద్దు

>> **కరోనాపై ఆందోళన వద్దుజాగ్రత్త చాలు**

రాష్ట్రంలో గురువారం నాడు విశాఖపట్నంలో ఒక కరోనా కేసు నిర్ధారణ జరిగిన నేపథ్యంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ విషయానికి సంబంధించిన పలు అంశాలపై శాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. మొదటి కరోనా కేసుకు గురైన వ్యక్తి కుటుంబంలోనే మరో వ్యక్తితో పాటు, చికిత్సనందించిన ప్రభుత్వ వైద్యునికి కరోనా సోకినట్లు మంత్రి వెల్లడించారు. ఇరుగు పొరుగు రాష్ట్రాలతో పోల్చుకుంటే మన రాష్ట్రంలో కరోనా విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.....అయితే ఈ విషయంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించడం మంచిదని మంత్రి అన్నారు. ఇప్పటి వరకు కేంద్ర ప్రభుత్వం ఎటువంటి సలహాలు,సూచనలు చేయలేదని, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నామని ఆయన అన్నారు.

# మద్యం మత్తులో తిరుమలలో ఎపిఎస్‌పి పోలీసులు హంగామా

## వాహనంతో సచివాలయం గోడను ఢీ, అదుపులో పోలీసులు

**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** కంచేచేనుమేసిన చందంగా శాంతిభద్రతలు కాపాడటం, పవిత్రంగా ఆలయం భద్రత విధుల్లో ఉండే ఎపిఎస్‌పి పోలీసులు ముగ్గురు మద్యంసేవించి మత్తులో హంగామా సృష్టించారు. అంతేగాక వాహనంతో ఢీకొని అభాసుపాలయ్యారు. ఈ సంఘటన తాజాగా శుక్రవారం రాత్రి తిరుమలలో జరిగింది. పవిత్రపుణ్యక్షేత్రం తిరుమలలో వరుసవివాదాలు చోటుచేసుకుంటున్నాయి. ముగ్గురు ఎపిఎస్‌పి బెటాలియన్ పోలీసులు పీకలదాకా మద్యం సేవించి మత్తులో ఏం చేస్తున్నామనేది తెలియకుండా భక్తుల మధ్యలో హంగామా చేశారు. అంతేగాక ప్రయాణిస్తున్న వాహనంతో తిరుమలలోని సచివాలయం ఢీ కొన్నారు. వేగంగా వాహనాన్ని ఢీ కొనడంతో టైరు పంక్చరైంది. తిరుమలలో ఆలయం పైబాగంలో, ఆలయం ముందు,గొల్లమండపంపై ఎపిఎస్‌పి బెటాలియన్ పోలీసులు భద్రత విధులు నిర్వహిస్తారు. వీరికి పాంచజన్యం అతిదిగృహం సమీపంలో విశ్రాంతి భవనంఉంది. శుక్రవారం సాయంత్రం ముగ్గురుఎపిఎస్‌పి పోలీసులు కర్నూలుకు చెందిన బి.రాజశేఖర్, కె.ఓంకార్‌నాయక్, షేక్ సిరాజుద్దీన్ ఉన్నారు. వీరిలో సిరాజుద్దీన్ తప్పించుకోగా మిగిలిన ఇద్దరిని తిరుమల 2టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైద్యపరీక్షలు చేయగా బ్రీత్‌అనలైజర్‌లో 300ప్లస్ పాయింట్లు నమోదైందని పోలీసులు తెలిపారు. తదుపరి వీరిపై చర్యలకు కర్నూలు ఎపిఎస్‌పి బెటాలియన్ కమాండెంట్‌కు నివేదికపంపారు. పోలీసులే భక్షకులుగా మారడంతో తిరుమల కొండపై భద్రత కూడా గాలిలో దీపంలా మారింది. గురువారం ఓ అన్యమతస్తుడు నమాజ్ చేయగా ఎపిఎస్‌పి పోలీసులు మద్యంసేవించి హంగామా చేయడం పోలీసుల ఉనికి పోయేలా మారింది.

# పెద్దిరెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ మే 23 ప్రభాతవార్త ప్రతినిధి:** మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వేసిన పిటిషన్లను ఎపి హైకోర్టు కొట్టివేసింది. తమ ఆధీనంలో ఉన్న అటవీభూముల్లో ప్రభుత్వ జోక్యాన్ని అడ్డుకోవాలని పెద్దిరెడ్డి వేసిన పిటిషన్ కొట్టివేసింది. అటవీభూముల ఆక్రమణ కేసులో క్రిమినల్ చర్యలు నిలిపివేయాలన్న పెద్దిరెడ్డి పిటిషన్ హైకోర్టు కొట్టివేస్తూ ఈ అంశంపై పెద్దిరెడ్డిని కొన్ని సున్నిత వ్యాఖ్యలు చేసింది.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

## ఎస్ఎంఎస్2లో హైడ్రాలిక్ ఆయిల్ లీక్

## విద్యుత్ కేబుల్స్, గొట్టాలు దగ్ధం

**గాజువాక, మే 23, ప్రభాతవార్త:** విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం సంభవించింది. శుక్రవారం ఉదయం 8.25గం లకు స్టీల్ మెల్టింగ్ స్టేషన్2 (ఎస్ఎంఎస్ 2) విభాగంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సిసిఎం 2 ఓసిలేటర్ ట్యాంక్ నుంచి నూనెను తీసుకెళ్లుతున్న గొట్టం నుంచి ఆయిల్ లీకు అయ్యింది. లీక్ అయిన నూనెవేడివాతావరణంతో తాకడంవలన అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. దింతో కొన్నివిద్యుత్ వైర్స్, హైడ్రాలిక్ గొట్టాలు కాలిపోవడంతో మంటలు సంభవించాయి. ప్రమాదాన్ని గమనించిన సిబ్బంది వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. అగ్నిమాపక దళాలు, రెస్క్యూ టీమ్‌లు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో కార్మికులకు ఎటువంటి ప్రాణ నష్టం,గాయాలు జరగలేదని,పునరుద్ధరణ పనులు వెంటనే ప్రారంభమయ్యాయని ఉక్కు యాజమాన్యం ఒక ప్రకటన ద్వారా తెలిపింది.



## ఎస్వీ అన్నప్రసాదం ట్రస్ట్‌కు రూ.17లక్షలు విరాళం

**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వెంకన్న దర్శనానికి తిరుమలకు వస్తున్న భక్తులకు ఆకలి అనేది తెలియకుండా రుచిగా, శుచిగా అన్నప్రసాదాలు వడ్డిస్తున్న అన్నప్రసాదం కోసం దాతలు విరాళాలిస్తున్నారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌కు చెందిన పవర్‌మెక్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్ ఎండి సత్యరోహిత్ ఎస్వీ అన్నప్రసాదానికి 17లక్షల రూపాయలు డిడిని టిటిడి అదనపుఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి అందజేశారు. ఆలయంలోపల రంగ నాయకుల మండపంలో విరాళాలిచ్చిన అన్నప్రసాద భవనంలో మధ్యాహ్నం ఒకపూట భోజనం భక్తులకు వడ్డించాలని కోరారు.

# రికార్డుస్థాయిలో భక్తుల దర్శనం

### అదనపు ఇఒ చొరవతో టిటిడి చరిత్రలో తొలిసారిగా గురువారం 73వేలమంది నమోదు



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** అసలే వేసవి సెలవులు ఆపై గత వారంరోజులుగా తిరుమలలో భక్తుల తాకిడి పెరగడంతో త్వరితగతిన భక్తులకు దర్శనం చేయించేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి చొరవ తీసుకుంటున్నారు. అందులో హనుమాన్ జయంతి పర్వదినం గురువారంరోజు తిరుమలేశుని ఆలయంలో ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు ఉదయం తిరుప్పావడసేవ, ఆ తరువాత మధ్యాహ్నం పూలంగిసేవ ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఈ సేవల కారణంగా రెండు మూడు గంటలు సామాన్యభక్తుల దర్శనం సమయం తగ్గుతుంది. అలాంటిది కొండకు వచ్చిన సామాన్యభక్తులకు సకాలంలో దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ అధికారులను సమన్వయం చేసుకుని గురువారంరోజు రికార్డు స్థాయిలో 72,579మంది భక్తులు వెంకన్నను దర్శించుకునేలా చూశారు. ఇందుకు తిరుమలలోని అన్ని విభాగాలను ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ దాదాపు పదివేల మందికిపైగా భక్తులకు గురువారంరోజు అదనంగా దర్శనం చేయించగలిగారు. దీంతో గురువారంరోజు తొలిసారిగా రికార్డుస్థాయిలో భక్తుల దర్శనం చేసుకోగలిగారు. అన్ని విభాగాల అధికారులను వెంకయ్యచౌదరి అభినందించారు.

సాధారణంగా తిరుమల ఆలయంలో ప్రతి గురువారం కేవలం 62వేలమందినుండి 63వేలమంది వరకు భక్తులు మాత్రమే దర్శనం చేసుకుంటారు. అయితే 22న గురువారం అనూహ్యంగా 12వేలమందికి అదనంగా దర్శనం చేయించారు. భవిష్యత్తులో కూడా ఇదే రీతిలో సామాన్యభక్తులకు త్వరగా దేవుని దర్శనం చేయించేలా, వారికి సౌకర్యాలు కల్పించేలా చూడటం అందరి బాధ్యత అన్నారు. అంతేగాక వేసవిసెలవుల్లో దేశం నలుమూలల నుండి దర్శనానికి వచ్చిన భక్తుల వెలుపల క్యూలైన్లలో ఉన్న వారికి సౌకర్యాలు, క్యూలైన్లలో భక్తుల సమస్యలు తెలుసుకునేందుకు శుక్రవారం వేకువ జామున సామాన్యభక్తుడిలా తనవెంట సిబ్బంది కూడా లేకుండా వైకుంఠం క్యూకాంప్లెక్స్ కృష్ణతేజ విశ్రాంతి భవనంవద్ద లైన్లలో వెళ్లి పంపిణీ చేస్తున్న అన్నప్రసాదాలు, పాలు, తాగు నీరు పరిశీలించారు. భక్తులనుపలకరించి దర్శనం సమయం, సౌకర్యాలపై ఆరా తీశారు.

## మద్యం కుంభకోణం అరెస్టులతో జగన్‌కు వణుకు

### మంత్రి సత్యకుమార్

**విజయవాడ,మే23,ప్రభాతవార్త ప్రతినిధి:** వైకాపా ప్రభుత్వ పాలనలో జరిగిన మద్యం కుంభకోణానికి సంబంధించిన అరెస్టులను చూసి, మాజీ సిఎం జగన్‌రెడ్డి వణికిపోతున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వ్యాఖ్యానించారు. మద్యం కుంభకోణంలో జగన్ సన్నిహితులు పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని దీంతో తన పరిస్థితి ఏంటోనన్న భయం జగన్‌కు పట్టుకుందన్నారు. జగన్ గురువారం విలేకర్ల సమావేశంలో చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంత్రి ఓ ప్రకటన చేశారు. లిక్కర్ విక్రయాల్లో కొనుగోలుదారుల నుండి డిజిటల్ పేమెంట్లను రద్దు చేసి, మాన్యువల్ చెల్లింపుల ద్వారా అమ్మకాలేందుకు చేశారన్న దానిపై జగన్ స్పందించలేదు. గత వైకాపా పాలనలో బెవరేజెస్ కార్పొరేషన్ ఎండిగా ఉంటూ అడ్డగోలుగా వ్యవహరించిన వాసుదేవరెడ్డి, దిద్దుకలంపొటు జగన్‌కు సన్నిహితంగా మెలిగిన విజయసాయిరెడ్డి, మరో ప్రధాన నిందితులు రాజ్ కెసిరెడ్డి వాంగ్మూలాల విశ్వసనీయతను జగన్ ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉంది. ధనుంజయరెడ్డి, కృష్ణమోహనరెడ్డిలు సచ్చీలురని కితాబివ్వడం జగన్‌లో నెలకొన్న భయానికి నిదర్శనం. వైకాపా ప్రభుత్వ మద్యపాన విధానంతో ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చినట్లు జగన్ మాట్లాడటం విడ్డూరంగా ఉంది అని మంత్రి మండిపడ్డారు.

## 1/2019 సర్క్యులర్ పునరుద్ధరణ

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీలో 48 వేల మంది ఉద్యోగులకు ఊరట కల్పించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించే 1/2019 సర్క్యులర్ పునరుద్ధరించాలని నిర్ణయించింది. ఆర్టీసీ ఉద్యోగ భద్రత కోసం 2019 లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం 1/2019 సర్క్యులర్ ను తీసుకువచ్చింది. ప్రభుత్వంలో విలీనం చేసిన వైఎస్సార్సీపీ సర్కారు ఈ సర్క్యులర్ అమలును ఆపివేస్తూ ఆదేశాలు జారీ చేసింది. 1/2019 సర్క్యులర్ అమలు కోసం ఇటీవల ఎన్ఎంయూఏ నేతృత్వంలో ఉద్యోగుల ఆందోళనలు చేశారు. ప్రభుత్వ ఆదేశం మేరకు ఎన్ఎంయూ నేతలతో ఇటీవల ఆర్టీసీ యాజమాన్యం చర్చలు జరిపింది. ఉద్యోగులపై చిన్న తప్పిదాలకే పెద్ద శిక్షలు విధిస్తున్నారని నేతలు యాజమాన్యం దృష్టికి తెచ్చారు. అక్రమంగా సస్పెన్షన్లు, రిమూవల్స్ చేస్తున్నారని తెలిపారు. 1/2019 సర్క్యులర్ ను పునరుద్ధరించి దానికి కట్టుబడి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావును కోరారు. ప్రభుత్వంతో చర్చించిన అనంతరం ఉద్యోగుల విజ్ఞప్తి మేరకు ఎండీ సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. సిబ్బందికి క్రమశిక్షణ చర్యలు తీసుకునే ముందు 1/2019 సర్క్యులర్ లోని మార్గదర్శకాలు తప్పక పాటించాలని లిఖితపూర్వకంగా ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని బస్ డిపో అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీలో 1/2019 సర్క్యులర్ అమలుపై ఆదేశాలివ్వడంపై ఎన్ ఎంయూఏ నేతలు వై శ్రీనివాసరావు, రమణా రెడ్డి హర్షం ప్రకటించారు.



## దేవుని సేవకుడిగా సరైన వ్యక్తి

### స్వయంగా సిఎం చంద్రబాబుకు తెలిపిన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి

**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** సహజంగానే తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సన్నిధిలో క్రిందిస్థాయి సబార్డినేట్(అటెండర్)గా ఉన్నా దేశం నలుమూలల నుండి వచ్చే భక్తులకు అదో ప్రత్యేకత. అలాంటిది దేశంలోనేగాక విదేశాల్లోనూ టిటిడి ఛైర్మన్ పదవిలో ఉన్న వ్యక్తి గౌరవం, పేరుప్రఖ్యాతులు ఎలా ఉంటాయో వేరే చెప్పవలసిన అవసరం లేదు. అయితే ఆడంబరాలకు దూరంగా, దేవుని దర్శనానికి ప్రముఖులు వచ్చినపుడు సాదాసీదాగా వ్యవహరిస్తున్న ప్రస్తుత టిటిడి ఛైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు పనితీరు, ఆయన సేవల పట్ల కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వివరించడం ఇప్పుడు హాట్‌టాఫిక్‌గా మారింది. టిటిడి ఛైర్మన్ హోదాలో దేవునిచెంత సేవకుడిగా, ఎంతో విజ్ఞత నైపుణ్యం కలిగిన వ్యక్తి బిఆర్ నాయుడును నియమించారని వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఢిల్లీపర్యటనలో శుక్రవారం ఉదయం టిటిడి ఛైర్మన్ సేవలు, పనితీరు, హుందాగా వ్యవహరించడం, సంయమనంతో భక్తుల సేవలపై దృష్టి పెట్టడం మంచివిధానమన్నారు. సరైన సమయంలో మంచి వ్యక్తిని ఛైర్మన్‌గా నియమించారంటూ జోషి సిఎం చంద్రబాబుతో అన్నారు. ఇటీవల తాను తిరుమల వెళ్ళానని, దేవుని దర్శనానికి ముందు, దర్శనం తరువాత బిఆర్‌నాయుడు సేవలు చూసిన తరువాత తనకు కలిగిన అభిప్రాయాన్ని సిఎంతో పంచుకున్నారు. తిరుమలలో పనితీరు అద్భుతంగా ఉందని అభినందించారు.

# గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో పెచ్చులు పడి బాలుడు మృతి

**గుంతకల్లు రైల్వే,మే 23,ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పైకప్పు పెచ్చులు విరిగిపడి మణికంఠ(8) అనే బాలుడు మృతిచెందిన విషాద ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కర్నూలు నగరంలోని ఎన్‌ఆర్ పేటకు చెందిన వెంకటేశ్వర్లు కుటుంబం తమిళనాడులోని రామేశ్వరం వెళ్లేందుకు గుంతకల్లు రైల్వే స్టేషన్ ప్లాట్ ఫాం 6-7లో ఓపెన్ వెయటింగ్ హాల్‌లో రైలు కోసం వేచి ఉండగా(వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫారం 6-7 మధ్యలో ఉన్న ఓపెన్ వెయిటింగ్ హాల్‌లో) విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో దురదృష్ట వశాత్తు శుక్రవారం తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో స్టేషన్ పైకప్పు పెచ్చులు విరిగి అక్కడ నిద్రిస్తున్న వారిఅబ్బాయి మణికంఠ



బాలుడిపై విరిగిపడిన రైల్వే స్టేషన్ పైకప్పు పెచ్చులు

తలపై పడ్డాయి. ఈ ఘటనలో బాలుని తలపై బలమైన తీవ్రగాయాలు కావడంతో పాటు రక్తస్రావం అధికం కావడంతో బాలుని తల్లిదండ్రులు రైల్వేఅధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆర్‌పిఎఫ్, రైల్వేసిబ్బంది గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం స్థానిక రైల్వే ఆసుపత్రికి పంపించారు. అక్కడ వారు మెరుగైన వైద్యంకోసం అనంతపురంజిల్లా ఆసుపత్రికి రెఫర్ చేయడంతో అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. గాయపడిన బాలుడిని పరీక్షించిన వైద్యులు అప్పటికే మణికంఠ మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్‌ఎం సుధాకర్, రైల్వే అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని సంఘటన వివరాలు అడిగి తెలుసుకుని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. గుంతకల్లు జిఆర్‌పి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

## శ్రీహరికోటనుంచి త్వరలోనే భారీ ఉపగ్రహ ప్రయోగం

### ఇస్రో, నాసా సంయుక్త ఆధ్వర్యంలో నిసార్ ఉపగ్రహం ప్రయోగానికి సిద్ధం

**శ్రీహరికోట (తడ), మే 23 ప్రభాతవార్త:** శ్రీహరికోట నుంచి మరో భారీ రాకెట్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఇస్రో, నాసాలు సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహం షార్‌లోని ప్రయోగ వేదికలో తుది ఏర్పాట్లు జరుపుకుంటోంది. ఈ భారీ ఉపగ్రహాన్ని జిఎస్‌ఎల్‌వి-ఎఫ్17 ద్వారా ప్రయోగిస్తున్నారు. గతంలోనే నిసార్ ప్రయోగ సన్నాహ ఏర్పాట్లు చేశారు. అయితే పిఎస్‌ఎల్‌వి-సి61 రాకెట్ ప్రయోగం కారణంగా నిసార్ వాయిదా పడింది. ప్రస్తుతం ఇస్రో, నాసాల కలయికతో నిసార్‌కు శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. రాకెట్ ప్రయోగం మొత్తం శ్రీహరికోటలోని ఇస్రో ఆధ్వర్యంలో జరుగుతుండగా, ఉపగ్రహానికి సంబంధించి ఇస్రోతో పాటు నాసా సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది ప్రతిష్టాత్మక ప్రయోగం కాబట్టి శ్రీహరికోటలో జాగ్రత్తగా ప్రయోగ సన్నాహాల్లో నిమగ్నమయ్యారు.

# పంచాయితీరాజ్‌శాఖలో బదలీలకు మార్గదర్శకాలు

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఇంజనీరింగ్ విభాగాల్లో ఉద్యోగుల బదిలీల కోసం ప్రభుత్వం మార్గదర్శకాలు వెలువరించింది. ఒకే చోట ఐదేళ్ళకు పైగా పని చేస్తున్న ఉద్యోగులను విధిగా బదిలీ చేయనున్నారు. పనితీరు ఆధారంగా కౌన్సిలింగ్ నిర్వహించాలి. ఏసీబీ కేసుల్లో ఉన్న వారికి కీలక హోదాల్లో నియమించరాదు. ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలను సొంత డివిజన్లలో నియమించకూడదు. డివిజనల్ పంచాయితీ అధికారులు, పరిపాలన అధికారులు, మినిస్టీరియల్ సిబ్బందిని కూడ స్వంత డివిజన్లలో నియమించరాదు.

జిల్లా పంచాయితీ అధికారి, డివిజనల్ పంచాయితీ అధికారి కార్యాలయాల్లోని మినిస్టీరియల్ సిబ్బంది బదిలీలకు సంబంధించి కలెక్టర్లకే పూర్తి అధికారం ఉంది, పంచాయితీ కార్యదర్శులకు వారి స్వంత మండలాల్లో పోస్టింగ్ ఇవ్వకూడదు. పనితీరు ఆశాజనకంగా లేని కార్యదర్శులను అప్రాధాన్య పంచాయితీలకు బదిలీ చేయాలి. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను సొంత రెవిన్యూ డివిజన్ల పరిధిలో నియమించవద్దు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, అసిస్టెంట్ ఇంజనీర్లను స్వంత సబ్ డివిజన్ పరిధిలో నియమించకూడదు. క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో పని చేస్తున్న ఇంజనీర్లను విధిగా డివిజన్, సబ్ డివిజన్, మండలాలకు బదిలీ చేయాలి. డిప్యుటేషన్‌పై పనిచేసే కాలాన్ని కూడ మాతృ సంస్థలోనే పని చేస్తున్నట్లుగా గుర్తించి బదిలీ చేయాలి.

# నేటి నుంచి హైదరాబాద్-కొల్లాం మధ్య ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే,మే 23,ప్రభాతవార్త:** ప్రస్తుత వేసవి సీజన్ ముగింపు నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని రైల్వే శాఖ ఈ నెల 24నుంచి జూన్ వరకు హైదరాబాద్-కొల్లాం-హైదరాబాద్‌ల మధ్య ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. హైదరాబాద్ నుంచి కొల్లాం వెళ్లే నెంబర్ 07193ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈ నెల 24,31, జూన్ 7,14,21,28వ తేదీల్లో ప్రతి శనివారం రాత్రి 11.10గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి సోమవారం ఉదయం 7.10గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం నుంచి హైదరాబాద్ వెళ్లే నెంబర్ 07194ఎక్స్‌ప్రెస్ ఈ నెల 26, జూన్ 2,9,16,23,30వ తేదీల్లో ప్రతి సోమవారం ఉదయం 10.45గంటలకు కొల్లాం నుంచి బయలుదేరి మంగళవారం సాయంత్రం 5.30గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు మార్గమధ్యంలో తెలుగు రాష్ట్రాల్లో చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికూడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టేషన్లతో పాటు తమిళనాడు, కేరళ రాష్ట్రాలలోని ముఖ్యమైన స్టేషన్లలో నిలుస్తాయి.

# బదలీల్లో జేఎల్స్,ప్రిన్సిపాల్స్ పనితీరుకు పాయింట్లు

### మే 22 నుండి జూన్ 8 వరకు షెడ్యూలు విడుదల

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటర్మీడియట్ విద్యామండలి పరిధిలోని బదిలీల్లో ప్రిన్సిపాళ్ళు, జూనియర్ లెక్చరర్లకు పనితీరు ఆధారిత పాయింట్లను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల ఆధారంగా వీటిని ఇవ్వనున్నారు. 0 నుండి 40 శాతం ఫలితాలు వస్తే ఎలాంటి పాయింట్లు ఉండవు. 41 నుండి 60 శాతానికి రెండు, 61-80 శాతానికి నాలుగు, 81 నుండి 100 శాతానికి ఆరు పాయింట్ల చొప్పున ఇస్తారు. ప్రిన్సిపాళ్ళకు జనరల్, వృత్తి విద్యా కోర్సులను కలిపి చూస్తైత్తారు. భోధనేతర సిబ్బంది, లెక్చరర్ల బదిలీలను వెబ్ కౌన్సిలింగ్ ద్వారా గురువారం నుండి జూన్ 8 లోపు పూర్తి చేస్తారు. మే 31 నాటికి ఒకే చోట ఐదేళ్ళు పనిచేసిన వారికి తప్పనిసరి బదిలీ ఉంటుంది. జూన్ 1 నుండి మే 31 వరకు అకడమిక్ సంవత్సరంగా పరిగణిస్తారు. ఒక సంవత్సరంలో తొమ్మిది నెలల సర్వీసు పూర్తి చేసుకున్నా సంవత్సరంగానే లెక్కిస్తారు. రెండేళ్ళు సర్వీసు పూర్తి చేసుకున్న వారు అభ్యర్థన బదిలీలకు ధరఖాస్తు చేసుకోవచ్చు. 2027 మే 31కి ముందు ఉద్యోగ విరమణ చేసే వారికి బదిలీల నుండి మినహాయింపు ఉంటుంది. హెచ్‌ఆర్‌ఏ 16 శాతంలో క్యాటగిరీ-ఎలో ఉన్నవారికి కేటగిరి- బి,సి,డీ ప్రాంతాలకు మారేందుకు అనుమతినిస్తారు. హెచ్‌ఆర్‌ఏ 12 శాతంతో క్యాటగిరీ-బీలో ఉన్నవారు క్యాటగిరీ-ఎ,బి,సీ,డీ ప్రాంతాలకు మారేందుకు అనుమతిస్తారు. హెచ్‌ఆర్‌ఏ 12 శాతంతో క్యాటగిరీ-బిలో ఉన్నవారు క్యాటగిరీ-ఎ,బి,సి,డిలకు వెళ్ళవచ్చు. హెచ్‌ఆర్‌ఏ 10 శాతంతో క్యాటగిరీ-సిలో ఉన్నవారు అన్ని క్యాటగిరీలకు మారేందుకు అవకాశం ఉంటుంది.

నోటిఫై చేసిన గిరిజన ప్రాంతాల్లో క్యాటగిరీ-డిలో పనిచేస్తున్న వారు సైతం అన్ని క్యాటగిరిల్లోకి బదిలీ కోరుకో వచ్చు. క్యాటగిరీ-ఏకు రెండు, బీకి నాలుగు, సీకి ఆరు, డీకి ఎనిమిది పాయింట్ల చొప్పున ఏడాదికి ఇస్తారు. అన్ని కళాశాలల్లోనూ కనీస రెగ్యులర్ సిబ్బంది ఉండేలా పోస్టులను బ్లాక్ చేస్తారు.




సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

## లక్షమంది మహిళా వ్యాపారవేత్తలే లక్ష్యం

### మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్

విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్రం మొత్తంమీద లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలు తయారు చేయాలన్న ఉద్దేశంతో నుంచి 123 మున్సిపాలిటీలో కనీసం 30వేల మంది మహిళా వ్యాపారవేత్తలు తయారు చేయడానికి మెప్మా సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. దీనిలో భాగంగా అనేక పేరొందిన సంస్థలతో భాగస్వామ్యం వహిస్తుంది. అందులో భాగంగానే శుక్రవారం మెప్మా మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ ఆధ్వర్యంలో సంస్థ కార్యాలయంలో విస్తృత సమావేశం జరిగింది. ఇందులో తేజ్‌భరత్ మాట్లాడుతూ జిల్లాల్లో ఉన్నటువంటి స్వచ్ఛంద సంస్థలు, పేరొందిన కంపెనీలు గుర్తించాలన్నారు. దీనిలో భాగంగా ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా వచ్చి నటువంటి 60 మంది ప్రముఖ స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలతో సమావేశం ఏర్పాటు చేసి వారి లక్ష్యాలు ఏమిటి, భాగస్వాములు కావటానికి వారి యొక్క కార్యాచరణ పరిధి, వారి కార్యక్రమాలు ఏమిటి అనేదానిమీద మెప్మా మిషన్ డైరెక్టర్ ఆయా సంస్థ ప్రతినిధులతో చర్చించి దానికి ఒక ప్లాన్ ఆఫ్ ఏక్షన్ ఏర్పాటు చేసారు. దీనిలో భాగంగా ఇక్కడకు వచ్చినటువంటి సంస్థలు జిల్లా స్థాయి లో పనిచేయటానికి ఆసక్తి గా వున్నారా, రాష్ట్ర స్థాయి లో పనిచేయటానికి ఆసక్తి గా వున్నారో వారికున్నటువటువంటి రేసోర్సు లు ఏమిటి, వారికున్న మాన్ పవర్ ఎలా వుంది, ఫైనాన్సియల్ రిసోర్స్ ఎలా వున్నాయి అనేది తెలుసుకుని వీటిల్లో మంచి సంస్థలు గుర్తించి అన్ని రకాలుగా అన్ని రంగాలలో మహిళా వ్యాపారవేత్తలను తయారు చేసే లక్ష్యాన్ని సాధించే దిశగా ఈ రోజు ఈ కార్యక్రమాన్ని మెప్మా ప్రధాన కార్యాలయం తాడేపల్లి నందు వర్క్‌షాప్ నిర్వహించడం జరిగినది. ఈ సమావేశంలో స్వచ్ఛంద సంస్థలు, కంపెనీలు సానుకూలంగా స్పందించాయి.

## మీ ప్రయత్నం ప్రశంసనీయం

### డి.సిఎం పవన్ కల్యాణ్‌ని అభినందించిన కేంద్ర మంత్రి లాలన్ సింగ్

**విజయవాడ, మే 23,ప్రభాతవార్తప్రతి నిధి:** రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ ప్రయోగాత్మకంగా ప్రారంభించిన మాటామంతి కార్యక్రమాన్ని కేంద్ర పంచాయితీ రాజ్ శాఖ మంత్రి లాలన్‌సింగ్ అభినందిస్తూ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. డిజటల్ వేదికల ద్వారా గ్రామీణ ప్రజల సమస్యలు తెలుసుకొని సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవడం విన్నూత్నం, ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోడీ గ్రామీణ మహోత్సవ్-2025 ఆశయానికనుగుణంగా నిర్వహిస్తున్న మాటామంతి విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు. దీనిపై మంత్రి పవన్ కళ్యాణ్ స్పందించారు. ఏపీలో చేస్తున్న కార్యక్రమాలకు మీ మద్దతు ప్రకటిస్తున్నందుకు ధన్యవాదాలు, అభివృద్ధి అన్ని గ్రామాలకూ చేరినప్పుడే నిజమైన ప్రగతి అనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రతి పౌరుడూ ఇందులో భాగస్వామి కావాలి. అప్పుడే నిజమైన గ్రామ స్వరాజ్య స్ఫూర్తి సాధించగలం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో గ్రామ సభ, పల్లె పండగ, అడవితల్లి బాట, ఇప్పుడు మాటామంతి కార్యక్రమంలో ముందుకెళ్తున్నాం. ప్రధాని ప్రారంభించిన గ్రామీణ భారత్ మహోత్సవాన్ని ఉత్సాహంగా చేసుకుంటున్నాం అని పవన్‌కళాయణ్ పేర్కొన్నారు.

# రెండు కోచ్‌లతో విజయవాడ మెట్రో రైలు

### క్షేత్రస్థాయిలో సర్వే చేసిన అధికారులు, ప్రాజెక్టు కోసం ప్రాథమిక ప్రణాళికలు సిద్ధం

**విజయవాడ, మే23,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం ప్రాథమిక ప్రణాళికలను అధికారులు సిద్ధం చేశారు. క్షేత్రస్థాయిలో సర్వే చేసిన తరువాతే మెట్రో రైలు కార్పొరేషన్ అధికారులు తుది రూపు తీసుకొచ్చారు. దీనిని ఆచరణలోకి తీసుకొచ్చేందుకు రూ.205 కోట్లతో జనరల్ కన్సల్టెంట్ ఎంపిక కోసం టెండరు పిలిచారు. విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు రుణం ఇచ్చేందుకు ఏఐబీ ఆసక్తి కనబరుస్తున్నట్లు కీలక సమాచారం.. ఇప్పటికే ఈ అంశంపై చర్చలు ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన తరువాత దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏది ఏమైనప్పటికీ నెల రోజుల్లో అన్ని అంశాలు కొలిక్కి వచ్చే వీలుంది.

ప్రారంభంలో ప్రతి రైలు రెండు బోగీలతో నడపనున్నారు. రెండు బోగీల్లో దాదాపు 500 మంది వరకు ప్రయాణించే వీలుంటుంది. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు మెట్రో సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. రద్దీ ఉంటే ఉదయం 5 నుంచి అర్ధ రాత్రి వరకు నడపనున్నారు. ఉదయం 9- 11, సాయంత్రం 5- 7 గంటల వరకు ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. సెలవు రోజులు, ఆదివారాలు



రద్దీ తక్కువగా ఉంటే సర్వీసులను కుదించనున్నారు. విజయవాడలో రానున్న మెట్రో రైలు ప్రాజెక్టు తొలి దశలో రెండు కారిడర్లను నిర్మించనున్నారు. 25.90 కిలో మీటర్లతో గన్నవరం విమానాశ్రయం నుంచి పీఎన్‌బీఎస్ వరకు ఒకటి, అదే విధంగా పెనమలూరు నుంచి పీఎన్‌బీఎస్ వరకు 12.50కిలో మీటర్ల పొడవుతో మరొకటి రానున్నాయి. ఈ రెండు మార్గాల్లో మొత్తం 33 స్టేషన్లను ప్రస్తుతానికి ప్రతిపాదించారు. మెట్రో స్టేషన్లను ఎక్కువగా ప్రజా రవాణా వ్యవస్థలైన ఆర్టీసీ, రైల్వే, ఎయిర్‌పోర్ట్ తో అనుసంధానం చేయనున్నారు. మెట్రో స్టేషన్ల వద్ద నుంచి అన్ని ముఖ్య ప్రాంతాలకు వెళ్లేలా సిటీ బస్సు సర్వీసులను నడపనున్నారు. విజయవాడ రైల్వేస్టేషన్, పీఎన్ బీఎస్, గన్నవరం విమానాశ్రయంతో మెట్రో స్టేషన్లను అనుసంధానించడం ద్వారా ప్రయాణికులకు మేలు కలగనుంది. మెట్రో స్టేషన్ల వద్ద భద్రతా చర్యల కోసం సీసీ కెమెరాలు, బ్యాగేజీ స్కానర్లు, మెటల్ డిటెక్టర్లను ఏర్పాటు చేస్తారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాకే స్టేషన్‌లోకి అనుమతిస్తారు. మెట్రో స్టేషన్ల వద్ద వాహనాల పార్కింగ్ కోసం స్థలాన్ని కేటాయించనున్నారు. పాదచారులు, సైకిల్‌పై వచ్చే వారి కోసం స్థలం లభ్యత మేరకు వేరుగా దారులను కేటాయించేందుకు పరిశీలిస్తున్నారు. టిక్కెట్ల జారీ కోసం స్మార్ట్ కార్డులు, సింగిల్ జర్నీ కోసం క్యూఆర్‌తో కూడిన టిక్కెట్లను జారీ చేస్తారు. మెట్రో రైళ్లతో పాటు సిటీ బస్సుల్లోనూ ఉప యోగించుకునేలా కామన్ మొబిలిటీ కార్డులనూ జారీ చేయనున్నారు. పార్కింగ్‌ఫీజు కూడా ఈ కార్డుతో చెల్లించే అవకాశం ఉంటుంది. మెట్రో రైలు కోసం కేసరపల్లి, పీఎన్‌బీఎస్, పెనమలూరులో ప్రత్యేకంగా విద్యుత్తు సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు.

## దేశీయ జలమార్గముల ప్రాధికార సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన జెడ్. శివప్రసాద్



**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో జల మార్గాల అనుసంధానంతో జల రవాణా సులభతరం అవుతుందని అందుకు నా వంతు కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ దేశీయ జల మార్గముల ప్రాధికార సంస్థ చైర్మన్ జెడ్. శివప్రసాద్ తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ దేశీయ జల మార్గముల ప్రాధికార సంస్థ చైర్మన్ గా డాక్టర్ జెడ్. శివప్రసాద్ శుక్రవారం గుంటూరు జిల్లా తాడేపల్లిలో సంస్థ కార్యాలయంలో సంస్థ సీఈవో జీవీ. రాఘవరావు సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు.. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ విజనరీ నాయకులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నాకు మార్గదర్శి ఐటీ, విద్యా శాఖ ల మంత్రి నారా లోకేష్‌లు నా మీద నమ్మకంతో ఈ బాధ్యతలు ఇవ్వటం సంతోషంగా ఉందని, అందుకు వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. జల రవాణా లాంటి మంచి ప్రాజెక్టు బాధ్యతలను నాకు ఇవ్వటం సంతోషంగా ఉందన్నారు. నా శక్తి వంచన లేకుండా ఇందుకు పనిచేస్తానన్నారు. తక్కువ ఖర్చుతో దేశీయ జల మార్గం ద్వారా రవాణా, కార్గో చాలా సులభతరం అవుతుందన్నారు. జల మార్గంతో రవాణా చేయడం వల్ల రోడ్లపై ట్రాఫిక్ తగ్గుతుందని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. రాష్ట్రంలో 960 కి.మీల పొడవు గల సముద్ర తీర ప్రాంతం ఉందని జల రవాణాకు ఇది ఎంతో అనుకూలమన్నారు. కృష్ణా, గోదావరి, పెన్నా నదుల అనుసంధానంతో జల రవాణా కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. దీనివల్ల రాష్ట్రానికి పెట్టుబడులు వస్తాయన్నారు. సాగరమాల ప్రాజెక్టుకు అనుసంధానం చేసే కార్యక్రమాలు చేపడతామన్నారు. పాశ్చాత్య దేశాలు జల రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాయన్నారు. జల రవాణాలో ఉన్న ఇబ్బందులను తొలగించి సంస్థను పురోభివృద్ధిలో పయనించేలా కృషి చేస్తామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. రవాణా శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ప్రోత్సాహంతోసంస్థను ముందుకు తీసుకెళ్లతామన్నారు. జలరవాణాలో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని శివప్రసాద్ తెలియజేశారు.

ANDHRA PRADESH CAPITAL REGION DEVELOPMENT AUTHORITY (APCRDA)
Lenin Center, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
NIT No. MAU61-ADMN0SD(VI)/16/2025-HB/2nd call Dt. 23.05.2025
E PROCUREMENT TENDER NOTICE(SECOND CALL)
Name of Work: "Construction of Horticulture Nursery cum Training Centre (HNTC) at UD Palem in CRDA Region"- Estimate Cost: Rs. 96,00,000/-.
The bid can be downloaded on AP e-procurement portal from 24.05.2025 to 31.05.2025 up to 14.00 Hrs. Due date for submission of Bid 31.05.2025 up to 15.00 Hrs, Technical bid opening 31.05.2025 @ 16.00 Hrs. For further details please refer to www.apeprocurement.gov.in and www.crda.ap.gov.in
Sd/- Commissioner, APCRDA, Vijayawada

వార్త

ఆలోచన వికసించే పుష్పం వంటిదైతే ఆలాపన దాని అంకురం. ఆచరణ ఫలం.

- ఎమర్సన్

# కరోనా.. మాస్క్ ప్లీజ్!

ఒకప్పుడు జాతి యావత్తును కదిలించి కలకలం సృష్టించిన కోవిడ్ మరల జనాన్ని ఏదో విధంగా పలకరిస్తోందంటే వారంతా బెంబేలు పడిపోతున్నారు. కరోనా మహమ్మారి ఇప్పుడు హాంకాంగ్, సింగపూర్, థాయిలాండ్‌లలో కరాళ నృత్యం చేస్తోంది. ఆ తర్వాత గాలి ఎటు వేస్తుందో ఎటు పరుగులు తీస్తుందో చెప్పలేం. కానీ ఆసియా దేశాలకు మాత్రం భయం పట్టుకుంది. చైనాలో మళ్లీ విజృంభిస్తోందన్న వార్తలు వస్తున్నాయి. కానీ దాని వెనుక రహస్యం ఇంతవరకు చేధించబడనట్లే..మొన్నా మధ్య సినీ నటి శిల్ప శిరోద్కర్ తనకు కరోనా సోకిందంటూ జనానికి పంపిన సంకేతాలతో జనం ఉలిక్కిపడ్డారు. ఒకసారి ప్రపంచాన్ని ఒక ఊపు ఊపి వెళ్ళిపోయిన కోవిడ్ మళ్లీ ఇంత త్వరగా వస్తుందని ఎవరూ ఊహించలేదు. రావాలని కోరుకోలేదు కూడా. 2020 మార్చి11 న కరోనాను ప్రపంచ ఆరోగ్య సంస్థ మహమ్మారిగా ప్రకటించడం తెలిసిందే. అయితే భారత్, రష్యాలు దానికి విరుగుడు కనుక్కొనిమూడు వాక్సిన్‌లు కోవాక్సిన్, కోవిషీల్డ్. స్పుట్నిక్-విలను ప్రపంచానికి వరప్రసాదంగా అందచేసి కోవిడ్ ఆటకట్టించిన వైనం మనకు తెలిసిందే. అప్పట్లో జరిగిన ప్రాణనష్టం ఎవరూ పూడ్చలేనిది. కరోనాకు వైద్యం పొందిన వారిలో అతి కొద్ది మంది దాని దుష్ప్రభావం వల్ల కూడా చనిపోయిన సంగతి కూడా మనం చూశాం. అందుకే మళ్ళీ మాస్కులు తప్పేటట్లు లేదు. తాజాగా విశాఖపట్నంలో ఒక మహిళకు కరోనా సోకిందటూ వచ్చిన వార్తలకు జనం గుండెల్లో రైళ్ల పరుగెడుతున్నాయి. దేశంలో కరోనా వైరస్ కేసులు మళ్లీ పుంజుకోవడం ఆందోళన కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా 279మంది కరోనా లక్షణాలతో చికిత్స పొందుతున్నట్లు వార్తలు వచ్చాయి. వారిలో అధికంగా కేరళ రాష్ట్రంలో 95మంది, తమిళనాడులో 66, మహారాష్ట్రలో 56 మంది, కర్ణాటకలో 13 మంది, పుదుచ్చేరిలో 10 మంది కరోనా లక్షణాలతో చికిత్స పొందుతున్నారు కొన్ని రోజుల క్రితం యావత్ ప్రపంచాన్ని వణికించిన కరోనా.. ఇప్పుడు మళ్లీ అదే డేంజర్ బెల్స్ మోగిస్తోంది. ఇప్పటికే ఆగ్నేయాసియాలో అడుగుపెట్టిన కరోనా అక్కడి కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, చైనా, థాయిలాండ్లో విజృంభించింది. అక్కడ నమోదైన కేసులు కరోనా విస్తృతిని నమోదు చేస్తున్నాయి. ఇప్పటికే దేశంలో కేసులు పెరుగుతుండడంతో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని, సరైన నివారణ చర్యలు తీసుకోవాలని వైద్యనిపుణులు చెబుతున్నారు. వీటి లక్షణాలని ఎప్పటికప్పుడు గమనిస్తూ రాకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా గర్భిణులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ పరిణామంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు, వ్యాధి వ్యాప్తి తీరుతెన్నులపై నిశితంగా దృష్టి సారించారు. ప్రస్తుతం మన దేశంలో కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాల్లో కోవిడ్ కేసులు ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. అయితే, హాంకాంగ్, సింగపూర్లలో కోవిడ్ విజృంభణకు ఎల్ఎఫ్.7,ఎన్బీ.1.8 అనేకరోనా వేరియంట్లు కారణమని నిపుణులు తేల్చారు. ఈ రెండు వేరియంట్లు కూడా జేఎన్.1 అనే మరో కొత్త వేరియంట్ నుంచి ఉద్భవించినవే. ఒమిక్రాన్ బీఏ.2.86 వేరియంట్ నుంచి జేఎన్.1 వేరియంట్ పుట్టుకొచ్చింది. దీన్ని తొలిసారిగా 2023 ఆగస్టు నెలలో గుర్తించారు. గతంలో వచ్చిన వేరియంట్లతో పోలిస్తే, ఒకటి రెండు అదనపు జన్యు ఉత్పరివర్తనాల (మ్యూటేషన్లు) కారణంగా ఈ వేరియంట్లు వేగంగా వ్యాపించే సామర్థం ఎక్కువగా ఉందని నిపుణులు చెబుతున్నారు. ఇది శరీరంలోని రోగ నిరోధక శక్తిని సులభంగా ఛేదించి ఇన్ఫెక్షన్ కలుగజేస్తుంది. ఫలితంగా ఇది రోగనిరోధక శక్తి కంచెను దాటు కుని ఇన్ఫెక్ట్ చేయగలుగుతోందని యేల్ యూనివర్సిటీ పరిశోధకులు వివరించారు. జేఎన్.1 వేరియంట్ సోకిన వారిలో సాధారణంగా పొడి దగ్గు, రుచికోల్పోవడం, తలనొప్పి, ముక్కు దిబ్బడ, తీవ్రమైన అలసట, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాకుండా, ఈ వేరియంట్ బారిన పడిన కొందరిలో డయేరియా (విరే చనాలు) కూడా ఎక్కువగా కనిపిస్తోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.అయితే, ప్రస్తుతం భారత్‌లో పరిస్థితి నిలకడగానే ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డీజీహెచ్ఎస్) నేతృత్వంలో కోవిడ్ పరిస్థితిని సమీక్షించేందుకు నిర్వ హించిన ఉన్నతస్థాయి అత్యవసర సమావేశంలో వెల్లడైన వివరాల ప్రకారం, నమోదవుతున్న కేసుల్లో వ్యాధి లక్షణాలు చాలా వరకు ఓ మోస్తరుగానే ఉన్నాయని, బాధితులు ఆసుపత్రిలో చేరాల్సినంత తీవ్రత లేదని విశ్వసనీయ వర్గాలు తెలియజేశాయి. అయినప్పటికీ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కోవిడ్ నియంత్రణ నిబంధనలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు నమోదవు తున్నాయి. బుధవారం ఒక్క రోజే తమిళనాడులో 66కేసులు నమోదయ్యాయి. దీంతో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. అలాగే ప్రతిఒక్కరూ మాస్క్ ధరించాలని సూచిస్తున్నారు. జ్వరం, జలుబు, గొంతునొప్పి, దగ్గు,ఒళ్లునొప్పులతో ఆస్పత్రులను ఆశ్రయించేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది. బహిరంగ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ ప్రజలకు విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలో కరోనా వ్యాప్తి ఉందని, కానీ తీవ్రమైన హానికలిగించే అవకాశం లేదన్నారు. బహిరంగ ప్రాంతాల్లో మాస్క్ ధరించడంతోపాటు నివారణ చర్యలు పాటించాలన్నారు. జ్వరం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడుతున్న వారు వైద్యుడిని సంప్రదించి చికిత్స పొందాలని అధికారులు సూచించారు.

అంతరాయాలు కలుగుతున్న కొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.



శ్రీ రమణ మహర్షి

అందరిలోనూ మంచినే చూడటం మనం నేర్చుకుంటే మనలోని మంచి పెరుగుతుంది.



రామకృష్ణ పరమహంస

## ప్రజావాక్కు



### కౌలు రైతులను ఆదుకోవాలి

**మన దేశంలో** లక్షలాది మంది రైతులు తమకెదురుగా ఉన్న పరిస్థితుల వల్ల ఇతరుల భూములను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నారు. వీరే కౌలు రైతులు. కానీ, వ్యవసాయానికి అందుతున్న ప్రభుత్వ సాయం, పంట బీమా, రుణసదుపాయాలు,సబ్సిడీలువంటివి వీరికిచేరడం చాలా కష్టం. వీరి వద్ద భూమి యాజమాన్యం లేకపోవడం వల్ల, అధికారికంగా వీరురైతులుగా గుర్తింపు పొందలేకపోతున్నారు. ఈకారణంగా వ్యవసాయం చేసేందుకు కావలసిన నిధులు, వనరులు లేక తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వాలువీరిని గుర్తించేవిధంగా ప్రత్యేకవిధానాలనురూపొందించాలి. కౌలురైతుల నమోదు కోసం ప్రత్యేకమైన డేటాబేస్ రూపొందించి, వారికి కౌలు ఒప్పందాల ఆధారంగా గుర్తింపుఇవ్వాలి. అలాగే,ప్రత్యేకపథకాల ద్వారా రుణాలు, పంట బీమా, విత్తనాలు, ఎరువులపై సబ్సిడీలు కల్పించాలి. కౌలు రైతులను వ్యవసాయ వ్యవస్థలో ఒక ముఖ్య భాగంగా గుర్తించి, వారికి సరైన ప్రోత్సాహకాలు అందించినప్పుడే వ్యవసాయ రంగం అభివృద్ధి చెందగలదు.

-సి.హెచ్.ప్రతాప్. శ్రీకాకుళం

### పేదల గురించి ఆలోచించండి

**వయసులో** ఉన్నవారు ఆరోగ్యంగ ఉన్నవారు పని చేయగల స్థితిలో ఉన్నవారికి డబ్బులివ్వడం తప్పవుతుంది. కాని వృద్ధులు, రోగాలతో బాధపడుతున్నవారు ఏ పని చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి డబ్బులివ్వటం తప్పెలా అవుతుంది.కార్పొరేట్ శక్తులకుసాయం చేయడం ఎమ్.పి.ల జీతాలు పెంచటమే కాదు,పాలకులు పేదలగురించి ఆలోచించాలి. అర్హులైన పేదలందరికి పెన్షన్ సౌకర్యం కల్పించాలి.

-మిథునం, హైదరాబాద్

### డబ్బులు ఇప్పించగలరు

**గ్రామాలలో** కొందరు వ్యక్తులు వికలాంగుల నుండి మహిళల నుండి అప్పులు తీసుకొని తిరిగి డబ్బులు ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తానని లక్షల రూపాయలు వసూలు చేసి తప్పించుకొని తిరుగుతున్న వారి పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదు అయినాయి. ఇలాంటి మోసగాళ్లను 2016 వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం 2005 మహిళా హక్కుల చట్టం ప్రకారం కఠినంగా శిక్షి ంచాలి.

-రాపాక రవీందర్, జనగాం

### కుంకీల రాకతో ఏజెన్సీ ప్రజలకు ఊరట

**గత** రెండు దశాబ్దాలుగా ఆంధ్రప్రదేశ్‌లోని ఏజెన్సీ ప్రాంతాల్లోని పంట పొలాలు, జనావాసాలపై ఏనుగులు చేస్తున్న దాడులతో జరుగుతున్న ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలలో భాగంగా కర్ణాటక ప్రభుత్వం అందించిన ఐదు కుంకీ ఏనుగులను ఆంధ్ర రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్వయంగా స్వీకరించి తీసుకొని రావడంఅభినందనీయం. రెండురాష్ట్రాల్లో వేర్వేరు రాజకీయ కూటములకు చెందిన ప్రభుత్వాలు ఉన్నప్పటికీ, పర్యావరణ పరిరక్షణ అనేముఖ్యమైన అంశంలో కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం ముందుకురావడం కూడా చాలాహర్షించదగ్గ విషయం.ఈకుంకీల రాకతో ఆంధ్రరాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాలు, అటవీసరిహద్దు గ్రామాల ప్రజలకు కొంతఊరట లభించనుంది.

-దాసం వెంకటరెడ్డి, బెంగుళూరు

### భిన్నత్వంలో ఏకత్వం

**భారత్** ఆపరేషన్ సింధూర్ పేరిట పహల్గామ్ ఉగ్రదాడులకు ప్రతీకారంగా పాకిస్థాన్ మీద జరిపిన కేవలం నాలుగు రోజుల యుద్ధంకాని యుద్ధంకారణాలు ప్రపంచానికి తెలుసున్నా ప్రత్యేకంగా ముప్పై మూడు దేశాల వారికి విశదంగా, వివరంగా, వినయంగా బోధపరచడానికి మనదేశం అన్ని పార్టీలలోని ప్రముఖులతో ఏడు బృందాలుగా చేసి నెరుపుతున్న రీతి మన దౌత్యనీతికిఘననిదర్శనం.పార్టీలమనోగతాలు వేరైనా అందరికి దేశ క్షేమం కావాలి. దీన్నే భిన్నత్వంలో ఏకత్వం అంటారు. అత్యవసర పరిస్థితుల్లో ఈ ఏకత్వమే మనలను కాపాడేది. మనలను చూసి పాక్ కూడా తమదేశ నాయకులను విదేశాలకు పంపుతుందట. పులిని చూసి నక్క వాత పెట్టుకన్నట్లుంది. పాకిస్థాన్‌ను ఇతర ముస్లీం దేశాలే దరిచేర నివ్వటం లేదు. మనదేశం వలన అనేక రకాల సహకారాలతో బతికి బట్టకట్టిన బంగ్లాదేశ్, తుర్కియే లాంటి కృతఘ్నుత లేని దేశాలు తప్ప.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### సీటు బెల్టు ధరించాలి

**వాహన** ప్రమాదాల కారణంగా ప్రతి మూడు నిమిషాలకు ఒకరు ప్రాణాలు కోల్పోతున్నారు. డ్రైవర్లు, ప్రయాణికులంతా సీటు బెల్టు ధరిస్తే, దురదృష్టవశాత్తు ప్రమాదం సంభవించినా, మూడోవంతు మందిని కాపాడుకునే అవకాశం ఉంటుందని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. కాబట్టి అందరూ సీటు బెల్టు ధరించాలి. ప్రాణాలు దక్కించుకోవాలి.

-మా.శ్రీ.రాజు, పాల్వంచ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# గాంధీయిజం టు బ్రాందీయిజం!

***రాజ్యాంగంలోని 47వ అధికరణం ప్రకారం ప్రజల జీవన ప్రమాణాలను పోషకాహార స్థాయిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. దీనిని సంపూర్ణంగా విస్మరించి రోగగ్రస్థ సమాజాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వమే ఈ రంగంలోకి దిగడం అత్యంత దురదృష్టకరం. సంక్షేమం మాటేమోకానీ ప్రజారోగ్యం మాత్రం మద్యం వల్ల సంక్షోభంలోపడుతున్నది. గతంలో ఇరవైఎనిమిదేళ్ల వయసులో ఉన్నవారు మద్యాన్ని సేవించడం మొదలుపెడితే ప్రస్తుతం పదిహేను, పదహారు ఉన్న మైనర్లు కూడా మద్యానికి అలవాటుపడుతున్నారు. మద్యపానంతో ప్రమాదాలు, హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలు తదితర కేసులు పెరిగిపోతున్నాయి. దేశంలో సంచలనం కలిగించిన అత్యాచార కేసుల్లో నిందితుల్లో అధిక శాతం తాగిన మత్తులో ఉన్నవారే. ఒకప్పుడు ఎక్సైజ్, అధికారులంటేనే గడగడలాడే ఈ అక్రమ వ్యాపారులు ఇప్పుడు వారిని పట్టించుకునే పరిస్థితుల్లో లేరు. ఒకపక్క లంచాలు, మరోకపక్క రాజకీయ ఒత్తిడిలతో వారు వానపాముల్లా మారి కాలం గడుపుతున్నారు.***

దామెర్ల సాయిబాబ

కరమ్‌చంద్ నేడుండినా ఈ నిషాబంద్ కాకుండేనా అని ఎంతో ఆవేదనతో అన్నాడో కవి. నిజానికి మద్యపాన నిషేధం అన్నది మహాత్ముడు భారత ప్రజలకు అందించిన అమృత సందేశం. ఆనాడు కాంగ్రెస్ పార్టీకి సంబంధించి మద్యపానాన్ని దేశం నుండి పారద్రోలాలనే సిద్ధాంతం, నినాదం. అఖిల భారత కాంగ్రెస్ సమావేశాల్లో ఎన్నో తీర్మానాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు మద్యపాన నిషేధం దేశంలోనే మొట్టమొదటిసారిగా అమలు చేసింది అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్రమే. అప్పట్లో తాగుబోతు అంటే సమాజంలో ఏమాత్రం గౌరవభావాలుండేవి కాదు. ఒకరకంగా చెప్పాలంటే వారిని సమాజం బహిష్కరించినట్లుగా వ్యవహరించేది. ఎక్కడో చాటుమాటుగా తాగేవారు. తాగిన మైకంలో పదిమందిలోకి రావడానికి ఏమనుకుంటారోననే సిగ్గు, బిడియం ఉండేది. తాగుడుతో వస్తున్న అనర్థాల వల్ల జరిగే కష్టనష్టాలను ప్రజలకు వివరించేందుకు అప్పటి ప్రభుత్వాలు ఎంతో కృషి చేశాయి. దీనికితోడు దొంగసారా, మద్యం అమ్మకందార్లపై ప్రభుత్వం ఎంతో దృఢవైఖరి అవలంబించేది. రానురాను పరిస్థితులు మారిపోయాయి. ఆదాయం కోసమే ప్రభుత్వాలే దుకాణాలు పెట్టించి మద్యం సేవించండి, ప్రభుత్వానికి ఆదాయాన్ని చేకూర్చండంటూ బతిమాలి, భంగపడి తాగించే దురదృష్టపు రోజులు దాపురించాయి. గాంధీవారుసులమని చెప్పుకునే ఖద్దరు వస్త్రాధారణ, గాంధీ టోపీలు పెట్టుకునే పెద్దలు కూడా ఇందులో పాలుపంచుకోవడం అత్యంత బాధాకరం. ఎన్నికల్లో కూడా మద్యం కీలకపాత్ర వహిస్తున్నది. లక్షల్లో కాదు కోట్లాది లీటర్ల అక్రమసారా ఎన్నికల సందర్భంగా ఏరులైపారుతున్నది. ఎంత అభివృద్ధి చేసినా, మరెన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినా ఎన్నికల నాటికి డబ్బుతోపాటు మద్యం సరఫరా చేయకపోతే విజయం సాధించడం కష్టమనేది అందరికి తెలిసిందే. అందుకే పోటీలుపడి ఎన్నికల్లో మద్యం ఇష్టానుసారంగా పంపిణీ చేస్తున్నారు. అటు దేశవ్యాప్తంగా చూస్తే ఎన్నికల్లో కోట్లాది రూపాయల విలువైన మద్యం పట్టుబడుతూనే ఉంది. కేసులు పెడుతూనే ఉన్నారు. జైళ్లకు పంపుతున్నారు. అయినా ఇదేమీ ఆగడం లేదు. తెలుగు రాష్ట్రాల్లో సారాను నిషేధించారు. అయినా సారా ఉత్పత్తిని, పంపిణీని, వినియోగాన్ని అడ్డుకోలేకపోతున్నారు. ఎక్సైజ్ అధికారులంటే గతంలో ఉన్న భయభక్తులు నేడు కానరావడం లేదు. నాటు సారా తాగేవారిని తమవైపు తిప్పుకునేందుకు కొందరు మద్యం వ్యాపారస్తులు తయారు చేసిందే ఈ చీప్ లిక్కర్. చీప్ లిక్కర్ అంటే ఒకరకంగా రంగు కలిపిన నాటుసారే. రెక్టిఫైడ్ స్పిరిట్‌తో నీళ్ల కలిపి, రంగు కూడా చల్లి సీసాల్లో నింపితే చీప్ లిక్కర్ అవుతుంది. తగిన పరిణామాల్లో నీళ్ల కలవకపోయినా, వాడే రంగులు కాలం చెల్లినా, ఖాళీసీసాలు సక్రమంగా శుభ్రం చేయకపోయినా, కలుషితనీరు కలిపినా చీప్ లిక్కర్ కాస్తా విషతుల్యంగా మారుతుంది. దేశంలో చీప్ లిక్కర్ అమ్మకాలే అగ్రభాగంలో ఉన్నాయి. ఎన్నికల్లో పట్టుబడుతున్నది కూడా అధిక శాతం ఈ చీప్ లిక్కరే. ఓటు వేయించుకోవడానికి డబ్బుతోపాటు మద్యం సరఫరా చేసే ఈ దుస్సంప్రదాయం రానురాను పెరిగిపోతున్నది. ప్రజల బలహీనతను సొమ్ము చేసుకునేందుకు మద్యాన్ని వాడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇకపోతే ఇలాంటి కల్తీ లిక్కర్, సారా తాగి ఎంతో

## ఒక్క మాట

మంది ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. మరెందరో ఆస్పత్రులపాలవుతున్నారు. పారిశ్రామిక అవసరాలు వాడే మిథైల్ ఆల్కహాల్ (మిథనాల్) విషపూరితమైంది. తాగితే ప్రాణాలు పోకతప్పదు. ఈ ద్రావకంతో తయారు చేస్తున్న సారా దేశంలో ఎందరినో బలితీసుకుంటున్నది. మరెందరికో కడుపుకోతను మిగులుస్తున్నది. మరెంతో మంది ఆడబిడ్డల తాళిబొట్టులను తెంపేస్తున్నది. గత యేడాది జూన్ మూడోవారంలో తమిళనాడులోని కళ్లకురిచ్చీజిల్లా కరుణాపురానికి చెందిన దంపతులిద్దరు కల్తీసారా తాగి అసువులు బాశారు. ఈ దుర్ఘటన జరిగిన వెంటనే యంత్రాంగం ఏమాత్రం అప్రమత్తంకాలేదు. వైద్యులు పెదవి విప్పలేదు. దాన్ని మామూలు మరణంగా చూపేందుకు ప్రయత్నం చేశారు. ఏకంగా ఆ జిల్లా కలెక్టరే ఆ మరణాలు కల్తీ సారావల్ల కాదని ప్రకటించారు. మరుసటి రోజు ఆ దంపతుల అంత్యక్రియల్లో పాల్గొన్న వారి బంధుమిత్రుల్లో నూటతొంభై మందికిపైగా మిథనాల్ కలిసిన అదే సారాను తాగారు. ఆరోగ్యం విషమించి మరుసటి రోజు ఉదయానికల్లా యాభై మందికిపైగా మరణించారు. అప్పుడు కాని అధికార యంత్రాంగం, పాలకులు నిద్ర లేవలేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ఆ జిల్లా కలెక్టర్‌ను బదలీ చేశారు.అంతకుముందు రెండేళ్ల క్రితం మిథనాల్‌నే నాటుసారా అనుకొని తాగి గుజరాత్‌లో రెండువందల మందికిపైగా ప్రాణాలు పోగొట్టుకున్నారు.మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, పంజాబ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్,జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో ఈమహమ్మారి స్వైరవిహారం చేస్తున్నట్లు వార్తలు అందుతున్నాయి. కల్తీ సారా మరణాలన్నీ ప్రభుత్వ ఖాతాల్లోకి ఎక్కడం లేదు. అంతెందుకు ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెంలో ఈ కల్తీసారాకు ఇరవైఏడు మంది ప్రాణాలు పోయాయి. తెలుగు రాష్ట్రాల్లో నాసిరకం మద్యం, గుడుంబ తాగడం వల్ల లక్ష సంఖ్యలో రోగపీడితులు అవుతున్నారు. కొందరు మంచానికే పరిమితమై తాగి తాగి కృంగికృశించి పరలోకానికి పయనం కడుతున్నారు. దీనిని నిరోధించడంలో అధికారగణం ఘోరంగా విఫలమవుతున్నది. ఇందుకు నిందించాల్సింది, తప్పుపట్టాల్సింది పాలకులనే. ఈపార్టీ, ఆ పార్టీ అని కాదు. ఎవరు అధికారంలో ఉన్నా, మద్యం విషయంలో సర్దుకుపోతున్నారు. యేడాది యేడాదికి ఆదాయం పెంచుకోవడమే ధ్యేయంగా ప్రభుత్వాలు పని చేస్తున్నాయి. అందుకే గుక్కెడు మంచినీళ్లు దొరకని గ్రామాలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయి. మంచినీటి కోసం మైళ్లకొద్దీ నడిచివెళ్లే పరిస్థితుల నుంచి బయటపడని పల్లెలుకోకొల్లలు. కానీ మద్యం దొరకని గ్రామాలు దుర్భిణి పెట్టి వెతికినా కన్పించకపోవచ్చు. బెల్టుషాపులను ఉదారంగా గ్రామగ్రామానికి శివారు పల్లెలకు సైతం మద్యాన్ని చేర్చారు. రికార్డు పరంగా సారాను నిషేధించినా అవి అమలు చేసే త్రికరణ శుద్ధి పాలకులకు లేదనే చెప్పొచ్చు.పొరుగునున్నమహారాష్ట్ర, తమిళనాడు తదితర రాష్ట్రాల నుండి దొంగసారా పెద్ద ఎత్తున తరలివస్తున్నది. మరొకపక్క గుడుంబ తయారీ ఒక కుటీర పరిశ్రమగా మారిపోతున్నది. అప్పుడప్పుడు రికార్డుల కోసం నాటుసారా బట్టీలను పగులకొట్టి కేసులు పెడుతున్నా ఫలితం లేకుండాపోతున్నది. పది బట్టీలు పగు లకొడితే ఇరవై పుట్టుకొస్తున్నాయి. రాజ్యాంగంలోని 47వ అధికరణం ప్రకారం ప్రజల జీవన ప్రమాణాలను పోషకా హార స్థాయిని పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. దీనిని సంపూర్ణంగా విస్మరించి రోగగ్రస్థ సమాజాన్ని తయారు చేసేందుకు ప్రభుత్వమే ఈ రంగంలోకి దిగడం అత్యంత దురదృష్టకరం. సంక్షేమం మాటేమో కానీ ప్రజారోగ్యం మాత్రం మద్యం వల్ల సంక్షోభంలోపడుతున్నది. గతంలో ఇరవైఎనిమిదేళ్ల వయసులో ఉన్నవారు మద్యాన్ని సేవించడం మొదలుపెడితే ప్రస్తుతం పదిహేను,పదహారు వయసు ఉన్న మైనర్లుకూడా మద్యానికి అలవాటుపడుతున్నారు. మద్యపానంతో ప్రమాదాలు, హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలు తదితర కేసులు పెరిగిపోతున్నాయి. దేశంలో సంచలనం కలిగించిన అత్యాచార కేసుల్లో నిందితుల్లో అధికశాతం తాగిన మత్తులో ఉన్నవారే. ఒకప్పుడుఎక్సైజ్, అధికారులంటేనే గడగడలాడే ఈ అక్రమ వ్యాపారులు ఇప్పుడు వారిని పట్టించుకునే పరిస్థితుల్లో లేరు.ఒకపక్క లంచాలు, మరొకపక్క రాజకీయ ఒత్తిడిలతో వారు వానపాముల్లా మారి కాలం గడుపుతున్నారు. అందుకే వీరినినిందించేకంటే పాలకులనే బాధ్యులను చేయాలి. ప్రజాసంక్షేమమే తమ ధ్యేయమని చెప్పుకునే నేతలు,నిరుపేదలు ఇలా బలైపోతున్నా, డబ్బు సంపాదనే ధ్యేయంగా వ్యవహరిస్తుంటే ఎవరికి చెప్పుకో వాలి? ఏమని చెప్పుకోవాలి? ఏదిఏమైనా రాజకీయాలకు అంతీతంగా అందరూ ప్రజాప్రతినిధులు ఆలోచించాల్సిన తరుణమిది. ఇన్ని అనర్థాలకు కారణమైన తాగుడుకు చరమగీతం పాడేందుకు అందరూ నడుం కట్టాల్సిన సమయమిది. ●

# ప్రజల మనసులకు దూరమవుతున్న నాయకులు!

జోస్యుల వేణుగోపాల్

ప్రధాన మంత్రికైనా, ముఖ్యమంత్రులకైనా తాము ప్రజలు గెలిపిస్తేనే ఆ స్థానంలో ఉన్నామనే విషయం అధికారానికి వచ్చిన తర్వాత ఏమాత్రం పట్టించుకున్నట్లు కనపడదు. క్రింది స్థాయి కార్యకర్తలకే అందుబాటులో లేని నాయకత్వం ఇక ప్రజల గురించి వారి సమస్యల గురించి పట్టించుకుంటారనే ఆశలేదు. భద్రతా కారణాల దృష్ట్యా కావచ్చు మరేదైనా కావచ్చు. ప్రజల సంగతి వదిలేస్తే ముఖ్యమంత్రి స్థాయిలో ఎమ్మెల్యేలకు, ప్రధానమంత్రి స్థాయిలో ఎం.పి.లకు కూడా చాలామందికి దర్శనభాగ్యం కరువే. పార్టీ ప్రయోజనాలు, అధికారమే ముఖ్యంగా బద్ధ శత్రువులతోనైనా బంధం కలుపుకుంటారు. వేరే పార్టీలో ఉండంగా మనమే వారిపై కుప్పలు తెప్పలుగా వెదజల్లిన దుర్గంధపు బురద మన పార్టీలో చేరంగానే తులసి తీర్థం చల్లి పరిమళ భరితం, పునీతం చేస్తాము. ఏ నాయకునికైనా తాము, తమ పార్టీ, తమవర్గం, తమ కులం ఆర్థికంగా బలపడడమే ఎజెండాగా అడుగులు పడతాయి తప్ప ఎన్నికల ముందిచ్చిన హామీలన్నీ అల్జీమర్‌తో అంటకాగుతాయి. చట్టం, ధర్మం, న్యాయం అన్నీ తమ చెప్పుచేతల్లో ఉండే సార్వభౌమత్వామే తమ అధికారమను కుంటున్నారు. ఒకప్పటి లాల్ బహదూర్ శాస్త్రి, టంగుటూరి ప్రకాశం పంతులు, బెజవాడ గోపాల రెడ్డి, దామోదరం సంజీవయ్య లాంటి వాళ్ళ తరంలో మరో ఆలోచన లేకుండా కేవలం ప్రజా సమస్యలే ఎజెండాగా పాలన సాగించేవారు. టెక్నాలజీ పరంగా ఎంతో అభివృద్ధి సాధించిన నేటి కాలంలో ఉచితాలు పక్కనబెడితే రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, మ్యారేజి సర్టిఫికెట్లు లాంటి ప్రభుత్వ పథకాలకు పనికి వచ్చే రికార్డులన్నీ




ఆన్‌లైన్‌లో పూర్తి స్థాయి అందుబాటులోకి రాలేదు. నేటికీ పైరవీలు,పైసల చెల్లింపులు తప్పడం లేదు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు ఎటువంటి భద్రత లేదు. ఎవరు అధికారంలోకి వస్తారో ఎవర్ని ఉంచుతారో ఎవరిని తీసేస్తారో సందిగ్ధమే. మన పార్టీ అయితే అస్మ దీయులు, వేరే పార్టీ వారైతే తస్మదీయులు దాడుల, ప్రతి కార దాడుల భయం. ప్రతిపక్షాలైనా, అధికార పక్షాలైనా సరదాల మాటున కొంతమంది, పరదాల చాటున కొంత మంది, పర్యటనల బాటన మరి కొంతమంది,పాలన వంట బట్టని కొత్తవాళ్లు కొంతమంది, అధికారాల అలసత్వంలో మరి కొంతమంది.. కొంతమందికి రెస్టులు, మరి కొంత మంది అరెస్టులు, అందరూ ప్రజలకు దూరంగానే. పార్ల మెంటు, అసెంబ్లీలు జరుతున్నన్నాళ్లు, అందరినీ ఒకే సభలో టీ.వీల్లో చూడగలుగుతున్నామనే సంతృప్తి తప్ప, అక్కడ బల్లచరుపులు, కేకలు,వాయిదాలు,మాటలయుద్ధాలు, ఇగోలు, హావభావాల ప్రదర్శన తప్ప ఒక్క ప్రజా సమస్యపైనా పార్లమెంట్‌లో కానీ అసెంబ్లీలో కానీ కూలంకషంగా పూర్తి స్థాయి చర్చ జరిగి అందరి అంగీకారంతో చట్టం రూపుదాల్చుకున్న సందర్భం చాలాసంవత్సరాలుగా మనకు కనపడలేదు. కులం, మతం, పార్టీ, ఇలా ఎక్కువైతే పక్కన పెట్టాల్సిన అంశాలో వాటిపైనా సభల్లో రచ్చలు, రాద్ధాంతాలు జరుగుతుంటాయి. నాటి తరం రాజకీయాలను గమనించిన ఎంతోమంది సీనియర్లు నేటికీ రాజకీయాల్లో ఉన్నత పదవుల్లో కొనసాగుతున్నా విలువల మాటెత్తితే వీళ్ల కూడా ఉగ్రరూపం దాలుస్తున్నారు. దేశ సార్వభౌమత్వాని కోసం, సర్వజన సంక్షేమంకోసం సర్వోన్నతమైన ప్రగతి కోసమే నిరంతరం రాజకీయాల్లో కొనసాగిన పాత తరం నాయకులను గుర్తు చేసుకుంటూ నేడు కూడా దేశవ్యాప్తంగా అత్యున్నతమైన పదవుల్లో కొనసాగుతున్న వారంతా అదే స్ఫూర్తితో పనిచేసి ప్రజల మనసుల్లో నిలవాలి. ●

# అలంకార ప్రాయంగా మిగిలిపోతున్న కామన్వెల్త్

రామ కిష్టయ్య సంగన భట్ల

కామన్వెల్త్ అనేది ఆయా దేశాలు ఎలాంటి లాంఛనప్రాయమైన కట్టుబాట్లు లేకుండా.. సుహృద్భావంతో స్నేహపూర్వకంగా చారిత్రక సంబంధాలను కొనసాగిస్తూ కలిసివుండటానికి గల ఒక మార్గం. కామన్వెల్త్ ప్రపంచంలోని మూడో వంతు జనాభా గల దేశాల కూటమి. ఎన్నో మతాలు, జాతులు, భాషలు, సంస్కృతుల వారు ఇందులో భాగంగా ఉన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యం దాని వలస రాజ్యాల స్థాపన ప్రక్రియను ప్రారంభించినప్పుడు, మాజీ బ్రిటిష్ కాలనీల నుండి స్వతంత్ర రాష్ట్రాల ఏర్పాటుకు, గతంలో సామ్రాజ్యంలో భాగమైన దేశాల సంస్థ అవసరంఏర్పడింది. కామన్వెల్త్ దినోత్సవాన్ని అంతకు ముందు 'ఎంపైర్ డే' అని పిలిచేవారు. అప్పటి రాయల్ కామన్వెల్త్ సొసైటీ అయిన రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్ కెనడియన్ శాఖ 'ఎంపైర్ డే 'జరపాలన్న సూచన చేసింది. ఈ ప్రతిపాదనను 1898లో కెనడియన్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ సమావేశంలో ప్రవేశపెట్టగా ఏకగ్రీవంగా అమోదించారు. అలా 'ఎంపైర్ డే' ఓ జాతీయ కార్యక్రమమైనది. 1884 లో లార్డ్ రోజ్‌బెరి అనే బ్రిటిష్ రాజకీయ నాయకుడు మారుతున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని 'కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్'గా అభివర్ణించాడు. ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో బ్రిటిష్ వలస పాలనలోని పలు దేశాలు స్వాతంత్ర్యం పొందటం ప్రారంభమైంది. ఆ క్రమంలో ఆయా దేశాలకు బ్రిటన్‌కు మధ్య ఆయా దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండాలనేందుకు ఒక రాజ్యాంగబద్ధమైన వ్యవస్థ అవసరమైంది. 1916 మే 24 వ తేదీన యునైటెడ్ కింగ్డమ్‌లో తొలిసారిగా 'ఎంపైర్ డే' ను దేశవ్యాప్తంగా జరుపుకున్నారు. 70వేల స్కూళ్లు, స్టాక్ ఎక్ఛ్సేంజ్ వంటి సంస్థలు జెండా వందనం చేసి జాతీయ గీతంను ఆలపించారు. 1921 జనవరిలో 'ఎంపైర్ డే' ఉద్యమాన్ని వీలైనంతగా ముందుకు తీసుకు వెళ్లాలని భావించిన 'మీథ్ రాయల్ కలోనియల్ ఇన్స్టిట్యూట్‌ను లాంచనంగా అహ్వానించారు. ఇన్స్టిట్యూట్ సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీ, మీథ్ బృందము కలిసి ఉద్యమ కార్యక్రమాలను రూపొందించారు. 1927 నుండి 1929 వరకు ఉద్యమ తొలి అధ్యక్షుడుగా మీథ్ కొనసాగాడు. 1901లో మరణించిన క్వీన్ విక్టోరియా జన్మదినం అయిన మే 24వ తేదీన ఏటా 'ఎంపైర్ డే' నిర్వహించాలని నిర్ణయించారు. అలా 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడింది.1931లో, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, ఐరిష్ ఫ్రీ స్టేట్, న్యూఫౌండ్లాండ్, యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికాతో ఐదు ప్రారంభ సభ్యులతో బ్రిటిష్ కామన్వెల్త్ నేషన్స్ వెస్ట్ మినిస్టర్ శాసనం క్రింద స్థాపించబడింది. 1931లో 'బ్రిటిష్ కామన్వెల్త్ ఆఫ్ నేషన్స్' ఏర్పడగా,



1949లో ఆ పేరు నుండి 'బ్రిటిష్' పదాన్ని తొలగించారు. ఆ కూటమిలో చేరటమనేది ఆయా దేశాల ఇష్టాయిష్టాల మేరకే జరుగుతుంది. అలా 53దేశాలు ఇందులో సభ్యులుగా చేరాయి. చివరిగా చేరిన మొజాంబిక్, రువాండాలకు బ్రిటిష్ వలస రాజ్యంతో ఎలాంటి సంబంధం లేదు. బ్రిటిష్ వలస పాలన నుంచి విముక్తమైన దేశాల కూటమిగా అది మారింది. ఆధునిక కామన్వెల్త్ కూటమి మొదట ఆస్ట్రేలియా, కెనడా, భారత్, న్యూజిలాండ్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, యూకేలు సభ్య దేశాలుగా స్వతంత్ర దేశాల 'ఫ్రీ అసోసియేషన్' పేరుతో అది ఏర్పడింది. ఆ తరవాత అది 'కామన్వెల్త్ నేషన్స్'గా రూపాంతరం చెందింది. కామన్వెల్త్ కూటమిలో భాగమైన అత్యధిక దేశాలు బ్రిటిష్ సామ్రాజ్య పాలనతో ఏదో విధంగా సంబంధం ఉన్నవే. రవాండా, మొజాంబిక్ లాంటి దేశాలు మాత్రమే వాటికి అతీతం. రవాండా 2009లో, మొజాంబిక్ 1995లో కామన్వెల్త్ దేశాల కూటమిలో భాగమయ్యాయి. అవి గతంలో బ్రిటిష్ పాలనలోలేవు. ప్రపంచ దేశాలన్నింటి విస్తీర్ణంలో పావుభాగాన్ని కామన్వెల్త్ దేశాలే ఆక్రమిస్తున్నాయి. విస్తీర్ణం పరంగా కెనడా కామన్వెల్త్ కూటమిలో తొలిస్థానంలో, ప్రపంచంలో రెండోస్థానంలో ఉంది. ఆస్ట్రేలియా, భారత్‌లు కూడా విస్తీర్ణం పరంగా చాలా పెద్దవి. సమోవా, టువాలు, ఆంటిగ్వా లాంటి చిన్న దేశాలు కూడా కూటమిలో భాగంగా ఉన్నాయి. ప్రస్తుతం ప్రపంచ జనాభా దాదాపు 8.2 బిలియన్ ప్రజలు ఉన్నారు. 2024లో, ఐక్యరాజ్యసమితి అంచనా ప్రకారం ఇది 8.1 బిలియన్లకు చేరుకుందని పేర్కొంది. ప్రపంచ జానాభాలో మూడో వంతు ప్రజలు కామన్వెల్త్ కూటమిలో భాగమైన 53 దేశాల్లోనే జీవిస్తున్నారు. ఈ దేశాల్లో ఎక్కువమంది 30 ఏళ్ల లోపువారే. ఈ కూటమిలో జనాభా పరంగా భారతే అతి పెద్ద దేశం. మొత్తం కామన్వెల్త్ కూటమి దేశాల జనాభాలో సగం భారత్‌లోనే ఉంది. కూటమిలోని 31 దేశాల జనాభా 16 లక్షల కంటే తక్కువే. 2012 దాకా కామన్వెల్త్ కూటమికి ఎలాంటి రాజ్యాంగం లేదు. ఆ తరువాతే ప్రజాస్వామ్యం, లింగ సమానత్వం, శాంతి, భద్రత లాంటి 16 విలువలకు సభ్య దేశాలు కట్టుబడి ఉండాలని తీర్మానించుకున్నాయి. కామన్వెల్త్ సెక్రటేరియట్ లండన్‌లో ఉంది. విద్యారంగం నుంచి పట్టణ ప్రణాళిక వరకూ అనేకరంగాల్లో కామన్వెల్త్ సంస్థలు కృషి చేస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఆయా దేశాల్లో ఎన్నికలు సక్రమంగా జరిగేలా చూసేందుకు పరిశీలకులు కూడా హాజరవుతుంటారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో ఇతర దేశాల మీద ఆ కూటమి చూపే ప్రభావం ఏదీ లేదనే చర్చ ఉంది. సభ్య దేశాల మధ్య వాణిజ్య సంబంధాల కోసం కామన్వెల్త్ చేస్తున్నదేమీ లేదు. ఇందు కోసం అన్ని దేశాలూ ఏదో ఒక ప్రాంతీయ కూటమి లోనో అంతర్జాతీయ కూటమి లోనో భాగస్వాములుగా ఉన్నాయి. కామన్వెల్త్ అనేది రెండేళ్లకోసారి కామన్వెల్త్ దేశాల రాజకీయ అధినేతల సమావేశం, నాలుగేళ్లకోసారి కొన్ని పతకాల కోసం క్రీడలను నిర్వహించే అలంకార ప్రాయమైన సంస్థగా మిగిలిపోతున్నదనే విమర్శలు కూడా లేకపోలేదు. ●

# రాజీనామా యోచనలో బంగ్లా చీఫ్ యూనస్

## ఎన్నికలు నిర్వహించాలని ఒత్తిడి చేస్తున్న ఆర్మీ




**ఢాకా, మే 23:** బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధి నేత ప్రొఫెసర్ ముహమ్మద్ యూనస్ తన పదవికి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవైపు రాజకీయ పార్టీలు కలిసి రాకపోవడం, మరోవైపు ఎన్నికలను నిర్వహించాలని ఆర్మీ ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో ఆయన రాజీనామా గురించి ఆలోచిస్తున్నారన్న వార్తలు వస్తున్నాయి.
షేక్ హసీనా ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో కీలక పాత్ర పోషించిన విద్యార్థుల నేతృత్వంలోని నేషనల్ సిటిజన్ పార్టీ పార్టీ చీఫ్ నిద్ ఇస్లాం చేసిన వ్యాఖ్యలు ఈ వార్తలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. యూనస్ రాజీనామా గురించి తాను కూడా వింటున్నానని, ఇదే విషయంపై చర్చించడానికి తాను ఆయన దగ్గరికి వెళ్లినట్లు ఇస్లాం పేర్కొన్నారు. అయితే రాజీనామా గురించి తాను ఆలోచిస్తున్నది నిజమే అని యూనస్ చెప్పారని ఇస్లాంఅన్నారు. రాజకీయ పార్టీలు ఒకే తాటిపైకి రాకపోతే తాను ఒక్కడిని ఏమీచేయలేనన్న అభిప్రాయన్ని ఇస్లాంతో యూనస్ వ్యక్తం చేసినట్లు బిబిసి బంగ్లా నివేదం చింది. గత ఏడాది ఆగస్టు 5, 2024న షేక్ హసీనా ప్రభు త్వానికి వ్యతిరేకంగా బంగ్లా దేశ్‌లో భారీ నిరసనలు జరి గాయి. నిరసనలు హింసాత్మకంగా మారడంతో షేక్ హసీనా దేశం విడిచి భారతదేశానికి వచ్చారు. ఉద్రిక్తతల నేపథ్యంలో తాత్కాలిక ప్రభుత్వాధి నేతగా యూనస్‌ను విద్యార్థి నాయకులు, ఆర్మీ, ఇతర రాజకీయ పార్టీలు నియమించారు. వాస్తవానికి డిసెంబర్‌లోగా ఎన్నికలు నిర్వహించాలని ఆర్మీ చీఫ్ జనరల్ వకీర్ ఉజ్ జమాన్ ఇప్పటికే యూనస్‌కు అల్టిమేటం జారీ చేశారు. మరోవైపు బంగ్లాదేశ్ ప్రతిపక్ష పార్టీ నాయకురాలు ఖలీదా జియా వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తు న్నారు. ఇదే సమ యంలో యూనస్ తీసు కున్న కొన్ని నిర్ణయాలు ఆర్మీకి నచ్చలేదు. దీంతో ఆర్మీ చీఫ్‌కు యూనస్‌కు మధ్య గ్యాప్ పెరుగుతూ వస్తోంది. వాస్త వానికి షేక్ హసీనా ప్రభుత్వం కూలిన తర్వాత ఆర్మీ చీఫ్‌కు యూనస్‌కు మధ్య మంచి సంబంధాలు ఉండేవి. రానురానూ అవి సన్నగిల్లుతూ వచ్చాయి. ఇంతలో, దేశంలో తీవ్రమైన ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ఆర్థిక సవాళ్లు యూనస్‌ను మరింత ఇబ్బందుల్లోకి నెట్టాయి.
అన్ని వైపుల నుంచి సమస్యలు చుట్టు ముట్టిన నేపథ్యంలో తాను ఇక ప్రభుత్వాధి నేతగా కొనసాగలేనని యూనస్ విద్యార్థి పార్టీ నాయకుడు ఇస్లాంతో చెప్పినట్లు తెలుస్తోంది. షేక్ హసీనాకు చెందిన అవామీ లీగ్‌ను నిషేధించాలని మే 10న బంగ్లాదేశ్‌లో ఒక పెద్ద నిరసన జరిగింది. ఢాకాలో మళ్లీ నిరసనలు, హింసాత్మక సంఘటనలు చోటుచేసు కుంటున్నాయి. దేశంలో ఉన్న ప్రస్తుత రాజకీయ వాతావరణం, నిరసనల కారణంగా తాను పని చేయలేకపోతున్నానని యూనస్ చెప్పినట్లు సమాచారం. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు కలిసి రాకపోతే తాను రాజీనామా చేయడం కంటే గత్యంతరం లేదన్న యోచనలో ఆయన ఉన్నట్లు తెలుస్తోంది. యూనస్‌తో కలిసి ప్రభుత్వంలోకి వచ్చిన చాలామంది నాయకులు ఇప్పటికే రాజీనామా చేశారు.
తాను కూడా ఇక పదవిలో కొనసాగడా నికి ఇష్టపడటం లేదని, అందుకే కొత్త తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని యూనస్ విద్యార్థి నాయకులను కోరినట్లు సమాచారం. యూనస్ రాజీనామా వార్తలపై నిపుణులు మరో విధంగా స్పందిస్తున్నారు. యూనస్‌పై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో రాజీనామా చేస్తానని బెదిరించి మద్దతును పెంచుకునే యోచనలో ఉన్నట్లు కొందరు విమర్శలుచేస్తున్నారు.




## హింసను వీడుతున్న ఈశాన్య ప్రాంతం!

### పెట్టుబడులకు హబ్‌గా మారుస్తాం: ప్రధానిమోడీ

**న్యూఢిల్లీ, మే 23:** ఈశాన్య రాష్ట్రాలు ఎప్పుడూ లేనంతంగా నేడు పురోగమిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. వాటి అభివృద్ధి పథాన్ని వేగవంతం చేయాలని ప్రభుత్వం నిశ్చయించుకుందని చెప్పారు. ఈశాన్య ప్రాంత వైవిధ్యమే దాని అతిపెద్ద బలం అని, ఈ ప్రాంతం అభివృద్ధి మార్గంలో ముందు వరుసలో నిలుస్తోందన్నారు. ఈ మేరకు ప్రధాని మోడీ రైజింగ్ నార్త్ ఈస్ట్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో పాల్గొని ప్రసంగించారు. ఈ ఈవెంట్‌కు ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులు, పలువురు కేంద్ర మంత్రులు, అధికారులు, దౌత్యవేత్తలతో పాటు తదితరులు హాజరయ్యారు. గతంలో ఈశాన్య ప్రాంతంఅంటే బాంబులు, తుపాకులు, రాకెట్లకు మారుపేరుగా ఉండేదని, దానివల్ల యువత చాలా అవకాశాలు కోల్పోయారని నరేంద్ర మోడీ అన్నారు. అయితే గడచిన దశాబ్ద కాలంలో దేశంలోని ఈశాన్యప్రాంత యువత హిసంను వదిలిపెట్టారని తెలిపారు. తమ ప్రభుత్వం ఉగ్ర వాదం, నక్సలిజాన్ని ఉపేక్షించడం లేదన్నారు. రానున్న కాలంలో ఈశాన్య ప్రాంతాన్ని అవకాశాల భూమిగా చేయడం, జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యంగా ఈ శిఖరాగ్ర సమావేశం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల కీలక వాటాదారులు, ఇన్వెస్టర్లు, విధాన రూపకర్తలను ఒకే వేదిక వస్తారని చెప్పారు. పలు రోడ్‌షోలు, రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్‌సమావేశం వంటి ప్రీసమిట్ కార్యక్రమాల తర్వాత ఈ శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిఖరాగ్ర సమిట్‌లో మంత్రుల సమావేశాలు, బిజినెస్ టు గవర్నమెంట్ సెషన్స్, బిజినెస్ టు బిజినెస్ మీటింగ్స్ పాలసీ ఎగ్జిబిషన్లు వంటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వా కార్యక్రమాలు ఉంటాయని అధికారులు తెలిపారు. పర్యాటకం, వ్యవసాయఆహార ప్రాసెసింగ్ అనుబంధరంగాలు, వస్త్రాలు,చేనేత, హస్త కళలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, నైపుణ్యాభివృద్ధి, సమాచార సాంకేతికత సమాచార సాంకేతికత ఆధారిత సేవలు, మౌలిక సదుపాయాలు, లాజిస్టిక్స్, ఇంధనం, వినోదం, క్రీడా రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించడంపై ఈసదస్సు ప్రధానంగా దృష్టి సారించింది.

## బెయిల్ రావడంతో గ్యాంగ్‌రేప్ నిందితుల కార్లర్యాలీ

**హావేరి(కర్ణాటక),మే 23:** కర్ణాటకలో జరిగిన ఓ సామూహిక అత్యాచారం కేసులో నిందితులకు బెయిల్ లభించడం, ఆ తర్వాత వారు భారీ ఊరేగింపు నిర్వహించడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. సుమారు 16 నెలల క్రితం జరిగిన ఈ దారుణ ఘటనకు సంబంధించి ఏడుగురు ప్రధాన నిందితులకు హావేరి సెషన్స్ కోర్టు ఇటీవల బెయిల్ మంజూరు చేసింది. హావేరి జిల్లాలో 2024 జనవరి 8న ఓ మతాంతర జంట హోటల్ గదిలో ఉండగా, కొందరు వ్యక్తులువారిపై దాడిచేశారు. మహిళను సమీపంలోని అటవీ ప్రాంతానికి లాక్కెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపణలున్నాయి. ఈ కేసుకు సంబంధించి అఫ్తాబ్ చందనకట్టి, మదార్ సాబ్ మండక్కి, సమీవుల్లా లాలనవర్, మహమ్మద్ సాదిక్ అగసిమని, షోయబ్ ముల్లా, తౌసిప్ చోటి, రియాజ్ సవికేరి అనే ఏడుగురు ప్రధాన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. ఇటీవల వీరికి బెయిల్ లభించడంతో, హావేరిలోని అక్కి ఆలూర్‌పట్టణంలో బైక్‌లు,కార్లతోభారీ ఊరేగింపు నిర్వహించారు. నిందితులు నవ్వుతూ, విజయ సంకేతాలు చూపుతున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో తీవ్ర దుమారం రేగింది.

## హార్వర్డ్ వర్సిటీలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలపై నిషేధం

### నిధులకోత పెట్టిన ట్రంప్.. మరో కొత్త ఉత్తర్వు జారీ



**వాషింగ్టన్, మే 23:** హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థుల ప్రవేశంపై ట్రంప్ సర్కారు నిషేధం ప్రకటించింది. ఇప్పటికే యూనివర్సిటీకి నిధుల్లో కోత పెట్టిన అమెరికా ప్రభుత్వం 2025-26 విద్యా సంవత్సరం నుంచి హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలను నిషేధం విధించింది. ఈ మేరకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్‌ఎస్) కార్యదర్శి క్రిస్టి నోయెమ్ యూనివర్సిటీకి లేఖ రాసారు. ట్రంప్ సర్కారు నిర్ణయం తర్వాత హార్వర్డ్ ఇకపై కొత్త విదేశీ విద్యార్థులను అడ్మిషన్లు ఉండవు. ఇప్పటికే యూనివర్సిటీలో చదువుతున్న విదేశీ విద్యార్థులు మరొక విశ్వవిద్యాలయానికి బదిలీ కావాల్సి ఉంటుంది. లేకపోతే అమెరికాను విడిచి వెళ్లాల్సి ఉంటుంది. ఈ రెండింటిలో ఏది చేయకపోయినా చట్టపరమైన చర్యలు ఉంటాయని నోయెమ్ హెచ్చరించారు. విదేశీ విద్యార్థులపై నిషేధం నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుందని నోయెమ్ లేఖలో పేర్కొన్నారు. అంతేకాకుండా, విశ్వవిద్యాలయం స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ప్రోగ్రామ్ (ఎస్ఇవిఐఎస్) సర్టిఫికేషన్ కూడా ట్రంప్ ప్రభుత్వం రద్దు చేసినట్లు చెప్పారు. విదేశీ విద్యార్థులు వీసాలు, యునైటెడ్ స్టేట్స్‌లో చదువుకోవడానికి ప్రవేశం పొందే వ్యవస్థనే ఎస్ఇవిఐఎస్ అంటారు. హార్వర్డ్ యూనివర్సిటీపై ట్రంప్ సర్కారు తీవ్రమైన ఆరోపణలు చేసింది. హార్వర్డ్‌లో యూదు వ్యతిరేక ప్రచారం జరుగుతోందని, చైనా కమ్యూనిస్ట్ పార్టీతో వర్సిటీ కలిసి పనిచేస్తుందని, అలాగే, హమాస్‌కు మద్దతుగా వ్యవహరిస్తోందని ట్రంప్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. విదేశీ విద్యార్థులను చేర్చుకోవడం, వారి నుంచి అధిక ట్యూషన్ ఫీజుల నుంచి బిలియన్ డాలర్ల సంపదను కూడబెట్టుకోవడం విశ్వవిద్యాలయాలకు హక్కు కాదని నోయెమ్ చెప్పారు. హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో 140 కంటే ఎక్కువ దేశాల నుంచి ఏటా అడ్మిషన్లు పొందుతున్నారు.
ఒక్క మసాచుసెట్స్‌లోని హార్వర్డ్ కేంబ్రిడ్జ్ క్యాంపస్‌లోనే దాదాపు 6,800 మంది విదేశీ విద్యార్థులు చేరుతున్నారు. వీరిలో ఎక్కువ మంది గ్రాడ్యుయేట్ విద్యార్థులే. ట్రంప్ సర్కారు నిర్ణయాన్ని హార్వర్డ్ విశ్వవిద్యాలయం ఖండించింది. ఇది చట్టవిరుద్ధమైన చర్యగా అభివర్ణించింది. ఈ చర్య యూనివర్సిటీకి, అమెరికాకు తీవ్రమైన హాని కలిగించే అంశంగా పేర్కొంది.

## సియాంగ్ ప్రాజెక్టు వద్దంటున్న గ్రామాల ప్రజలు!

### చైనానుంచి ముప్పు తప్పదంటున్న ముఖ్యమంత్రి పెమా ఖండూ



**ఇటానగర్, మే 23:** రాష్ట్రంలోని సియాంగ్ జిల్లాలోని బిగింగ్ గ్రామంలో నిర్మించతలపెట్టిన 11వేల మెగావాట్ల సియాంగ్ ఎగువ బహుళార్థసాధక ప్రాజెక్టుసర్వేను ఆప్రాంత ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ ప్రాజెక్టు సర్వేకోసం గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు రాకుండా కేంద్ర సాయుధ దళాలను నియమించడంపైనా స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసారు. సియాంగ్ జిల్లాకేంద్రంలోను, పరిసర గ్రామాల్లోను ఈ కేంద్రబలగాలను మొహరించారని గ్రామస్తులు చెపుతున్నారు. ఎగువ సియాంగ్, తూర్పు సియాంగ్ జిల్లాల్లోకూడా ఇదేపరిస్థితి ఉందని, జాతీయ హైడ్రో ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ ఈగ్రామాల్లో సర్వే సాధ్యాసాధ్యాల నివేదికను రూపొందించేందుకు యత్నిస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకుంటున్నారు. సియాంగ్ నదిపై నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టువల్ల తమకు అపారనష్టం వాటిల్లుతుందని ఆప్రాంత రైతులు చెపుతున్నారు. నిరసనకారులు మొత్తం అందరూ మహిళలే తమ ఇళ్లనుంచి బయటికి వచ్చి ప్లకార్డులు ప్రదరిస్తూ నిరసన నినాదాలుచేసారు. సియాంగ్ స్వదేశీ రైతు వేదిక (సిఐఎఫ్ఎఫ్) ఆధ్వర్యంలో నిరవధిక ధర్నాకు కూడా పిలుపునిచ్చారు. మరికొన్ని స్థానిక సంఘాలు ఇందుకు తోడయ్యాయి. వెంటనే పారామిలిటరీ దళాలను ఉపసంహరించాలని, ఎస్ఐఎఫ్ఎఫ్‌తో చర్చలుజరిపి ఈ ప్రాజెక్టువల్ల దెబ్బతింటున్న కుటుంబాలను పరిగణనలోనికి తీసుకోవాలని డిమాండ్‌చేసారు. వాస్తవానికి ఈ ఫోరం ఆధ్వర్యంలో ఈరైతు కుటుంబాలు నిరవధికంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. నిర్బంధ సర్వే అనేది రాజ్యాంగం మాకు కల్పించిన ప్రాథమిక హక్కులను ఉల్లంఘించడ మేనన్నారు. అధికారాలను ఉపయోగించి ప్రభుత్వం తమహక్కులను కాలరాస్తోందని ఆరోపించారు.

## అమ్మా.. నేను దొంగను కాదే.. నన్ను నమ్మవే...!

### ఆత్మహత్యకు ముందు లేఖరాసిన 12 యేళ్ల బాలుడు

**కోల్‌కత్తా, మే 23:** అమ్మా నేను చిప్‌ల ప్యాకెట్ దొంగతనం చేయలేదే. పదిమందిలో నాకు జరిగిన అవమానం భరించలేకున్నా అంటూ ఒకనోట్‌రాసి పెట్టి మరీ 12 ఏళ్ల బాలుడు పశ్చిమబెంగాల్‌లో ఆత్మహత్యచేసుకున్న ఉదంతం చూపరులను కంటతడ పెట్టింది. పశ్చిమ్‌మెడ్నిపూర్ జిల్లాలో ఈసంఘటన జరిగిందని పోలీసులు తెలిపారు. కృష్ణేందు దాస్ అనే ఏడోతరగతి విద్యార్థి ఒక షాపులోకి వెళ్లి చిప్స్ కొనుగోలు కోసం చూస్తున్నాడు.
షాప్‌కీపర్‌ను పదేపదే చిప్స్‌కావాలని కోరినట్లు ఆతడి కుటుంబీకులు చెపుతున్నారు. షాప్‌కీపర్ సుభాంకర్ దీక్షిత్ కేకలు విన్నా స్పందించలేదని తెలుస్తోంది. అంకుల్ నేను చిప్స్‌కొనుక్కుంటానని చెప్పినా పట్టించుకోలేదని ఆసమయంలో అక్కడ ఎవ్వరూలేకపోవడంతో ప్రవేశద్వారం వద్దనే ఉన్న ప్యాకెట్‌ను తీసుకున్నట్లు తెలిపారు.
ఆ తర్వాత సొమ్ములు ఇవ్వచ్చులే అన ఉద్దేశ్యంతోనే తీసుకున్నట్లు కుటుంబీకులు చెపుతున్నారు. ఆ తర్వాత షాప్‌కీపర్ వచ్చాడు. కృష్ణేందును కిందపడేసి తీవ్రంగా కొట్టి ఆతడిచేత ప్రజల గుంపు ముందు గుంజీలు తీయించినట్లు కుటుంబీకులు పోలీస్ ఫిర్యాదులో తెలిపారు. బాలుడి తల్లికూడా ఆ సంఘటన ప్రాంతానికివెళ్లి తన కుమారుడినే తిట్టిందని తేలింది. తాను సొమ్ములు తర్వాత ఇవ్వచ్చులే అనే తీసుకున్నానని, అయితే షాప్‌కీపర్ తనను కొడుతూ తిడుతున్నాడని చెప్పాడు. దీక్షిత్ సమ్మతి లేకుండా తీసుకున్నందుకు ఆమె షాప్‌కీపర్‌కు క్షమాపణలు చెప్పింది. ఇంటికిరాగానే తన గదిలోకి పోయి తలుపులు వేసుకున్నా బాలుడు నోట్‌రాసి ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాడు.
స్పృహతప్పి పడి ఉన్న కుమా రుడివద్ద సగం ఖాళీ అయిన పురుగు మందుల సీసాకూడా కనిపించింది. పక్కనే ఒకనోట్‌కూడా రాసి పెట్టి ఉంది. అమ్మా నేను దొంగను కాదే. నేను చిప్స్‌ప్యాకెట్ తస్కరించలేదే.. అంకుల్ అక్కడ లేడే. తిరిగొస్తుంటే కుర్‌కురే ప్యాకెట్ రోడ్డుపై పడి ఉందని, నాకు కుర్‌కురే ఇష్టం అని నీకు తెలుసుగా అని రాసి పురుగు మందు తాగి నందుకు నన్ను క్షమించవే అని రాసి పెట్టి ఆత్మహత్యకు యత్నించాడు. వెనువెంటనే బాలుడిని ఆసుపత్రికి తరలించి ఐసియులో చేర్పించినా తర్వాతచనిపోయి నట్లు తేలింది. బాలుడు చనిపోయినట్లు తెలియగానే షాప్‌కీపర్ కూడా అదృశ్యం అయ్యాడు. ఆతడికోసం గాలిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

## కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు ఢిల్లీకోర్టు నోటీసులు!

**న్యూఢిల్లీ, మే 23:** ఆప్ నాయకుడు సోమ్‌నాథ్ భర్తీ భార్య లిపికా మిత్రా దాఖలుచేసిన పరువునష్టం కేసులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు ఢిల్లీకోర్టు నోటీసులు పంపించింది. 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో సీతారామన్ తనకు తన భర్తకు పరువుకు భంగం కలిగించేలా అప్రతిష్టాకరమైన వ్యాఖ్యలుచేసారని ఆమె ఆరోపించారు. మిత్రా కథనం ప్రకారం ఆర్థికమంత్రి తమ మధ్య ఉన్న పాత వివాదాలను తెరపైకి తెచ్చి సోమ్‌నాథ్‌భర్తి ప్రతిష్టకు భంగం కలిగించే ప్రయత్నంచేసి ఎన్నికల్లో కారుచౌక లబ్దిపొందేందు యత్నించారని ఆరోపించారు. దేశంలో ప్రతి భార్యభర్తల మధ్య జరిగినట్లే తమ మధ్యకూడా వివాదాలు వచ్చాయని, అయితే స్నేహితులు, శ్రేయోభిలాషుల జోక్యంతో ఈ సమస్యలు 2019 మే ఏడోతేదీనే పరిష్కారం అయ్యాయన్నారు. దీనితో తాము తమ పిల్లలతో సంతోషంగా జీవిస్తున్నామన్నారు. ఆర్థికమంత్రి తనను, తనభర్తను కావాలనే కించపరిచారని, తమ రాజకీయ లబ్ధికోసం, బిజెపి అభ్యర్థి గెలుపుకోసం ఇలాంటి చౌకబారు ప్రచారంచేసారని, అందువల్లనే తనభర్త ఓటమి పాలయ్యారని ఆరోపించారు. నేను నాభర్త పిల్లలతో సంతోషంగా జీవిస్తున్నట్లు తెలిపారు. సీతారామన్ వ్యాఖ్యలు తప్పుదారిపట్టించేవిగానే కాకుండా భర్తి ప్రతిష్టను దెబ్బతీసేవిగా ఉన్నాయని,సంఘంలో కూడా ఆయన పరువుకు భంగం కలిగించారన్నారు. ఆమె పిటిషన్‌తో అదనపు చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ పారస్ దలాల్ ఈనెల 19వ తేదీ ఉత్తర్వులు జారీచేస్తూ ఆర్థిక మంత్రికి నోటీసులు జారీచేయాలని, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత పరిధిలో ఈనోటీసులు ఇవ్వాలన్నారు. బిఎన్ఎస్ఎస్ 223 సెక్షన్‌కింద ఈకేసులోప్రతివాదికి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అందువల్లనే ప్రతివాదికి నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. తర్వాత విచారణను జూన్ 12వ తేదీకి వాయిదావేసారు.

## కోటియా అభివృద్ధికి 16 మంది సభ్యులతో కమిటీ

### ఆంధ్రతో వివాదం వేళ.. ఒడిశా ప్రభుత్వం చర్యలు

### రెండు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా సరిహద్దు వివాదం

**భువనేశ్వర్, మే 23:** కోరాపుట్ జిల్లాలోని వివాదాస్పద కోటియా ప్రాంతంలో పరిపాలనా నియంత్రణను బలోపేతం చేసి అభివృద్ధిని వేగవంతం చేయాలన్న వ్యూహాత్మక చర్యగా, ఒడిశా ప్రభుత్వం 16 మంది సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. రెవెన్యూ మరియు విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ పూజారి అధ్యక్షతన ఈ కమిటీ, సంక్షేమ సేవల సమర్థవంతమైన అమలుకు, ఒడిశా భౌగోళిక సమగ్రతను రక్షించేందుకు మరియు ప్రాంతీయ సాంస్కృతిక గుర్తింపును ప్రోత్సహించేందుకు పనిచేస్తుంది. కోరాపుట్ జిల్లా, పోటాంగి బ్లాక్‌లోని 28 రెవెన్యూ గ్రామాలతో కూడిన కోటియా గ్రామ పంచాయతీపై ఒడిశా మరియు ఆంధ్రప్రదేశ్ మధ్య దశాబ్దాలుగా సరిహద్దు వివాదం కొనసాగుతోంది. 1936 నాటి ఒరిస్సా ఆర్డర్ వంటి చారిత్రక మరియు పరిపాలనా ఆధారాలు కోటియాను ఒడిశాలో భాగంగా గుర్తించినప్పటికీ, ఆంధ్రప్రదేశ్ 21 గ్రామాలపై తన అధికారం కొనసాగిస్తూ వస్తోంది. రెండూ రాష్ట్రాలు ప్రత్యామ్నాయ సంక్షేమ సేవలు అందించడంతో సుమారు 5,500 గిరిజనుల జీవితాల్లో అయోమయం, ద్వంద్వ గుర్తింపు సమస్యలు ఎదురవుతున్నాయి. ఇటీవల ఆంధ్రప్రదేశ్ అధికారులు నేరెదివల్స గ్రామంలోకి ప్రవేశించి ఆధార్ వివరాలు నవీకరించడం, పింఛన్లు మరియు విద్యార్థులకు అనుబంధ సహాయం వంటి సేవలు అందించడంతో వివాదాన్ని మరింత తీవ్రతరం చేసింది. ఇదే సమయంలో, ఒడిశా విద్యుత్ ఉపకేంద్రం వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అడ్డుకునేందుకు ఆంధ్ర అధికారులు యత్నించినట్లు సమాచారం. కోటియా ప్రాంత అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక సిఫారసు చేయడంస్వతంత్ర కార్యాలయంతో కూడిన సీనియర్ అధికారిని నాయకత్వం వహించే ప్రత్యేక పరిపాలనా ఏజెన్సీ ప్రతిపాదించడం ఆంధ్రప్రదేశ్ అందించే సంక్షేమ పథకాలతో పోల్చి, ఒడిశా పథకాలు మరింత పోటీగా లేదా మెరుగ్గా ఉండేలా చూడటం. "ఒడియా అస్మితా" కార్యక్రమం కింద ఒడియా భాష, సంస్కృతి మరియు సంప్రదాయాలను ప్రోత్సహించడంవివిధ శాఖల పథకాల సమన్వయంతో సమగ్ర అభివృద్ధి సాధించటం ఈ కమిటీ ముఖ్య లక్ష్యంగా చెపుతున్నారు. ఈ కమిటీలో రెవెన్యూ, హోం, ఎస్టీ,ఎస్సీ అభివృద్ధి, గ్రామీణాభివృద్ధి, కార్మిక, ఆహార సరఫరా, ఆరోగ్యం, విద్య, పంచాయతీరాజ్ మరియు ఒడియా భాషా సంస్కృతి శాఖల సీనియర్ అధికారులు సభ్యులుగా ఉన్నారు.
అదనంగా, కోరాపుట్ కలెక్టర్ మరియు ఎస్పీ, దక్షిణ పశ్చిమ పరిధి డిఐజి, సదరన్ రెవెన్యూ డివిజినల్ కమిషనర్ (ఆర్డీసీ) కూడా సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీని సీఎం మోహన్ చరణ్ మజ్జీ ఆధ్వర్యంలో జరిగిన ఉన్నత స్థాయి సమావేశం తర్వాత ఏర్పాటు చేయడం, కోటియా విషయంలో ఒడిశా ప్రభుత్వ ధృఢ సంకల్పాన్ని సూచిస్తుంది. ఇది ఒడిశా పరిపాలనా ఖచ్చితత్వాన్ని మరియు ప్రాంతీయ సమగ్ర అభివృద్ధిని భద్రపరిచే విధంగా విధాన, సంస్థాగత మద్దతును అందించనుంది కేంద్ర ప్రభుత్వం మాత్రమే రాష్ట్రాల సరిహద్దులను మార్చగలదని సుప్రీం కోర్టు స్పష్టతనిచ్చినప్పటికీ, సేవల అందకం మరియు గుర్తింపుతో కూడిన భూవివాదం కోటియా ప్రజల దైనందిన జీవితాలపై ప్రభావం చూపుతూనే ఉంది. ఈ నేపథ్యంలో ఒడిశా ప్రభుత్వం తాజా చర్యగా తీసుకున్న కమిటీ ఏర్పాటు, తన హక్కును సమర్థంగా వినిపించడం మరియు సరిహద్దు ప్రాంతంలో సమగ్ర అభివృద్ధికి దోహదపడే ప్రయత్నంగా భావించబడుతోంది.

## అత్యవసరసమయంలోనూ పాక్ మన విమానాలు అనుమతించలేదు

### పౌరవిమానయానశాఖ డైరెక్టర్‌జనరల్ వెల్లడి



**న్యూఢిల్లీ, మే 23:** అత్యవసర సమయంలో ల్యాండింగ్‌చేయాలని కోరినప్పటికీ పాకిస్థాన్ తన గగనతలంలోకి ప్రవేశించేందుకు అనుమతి నిరాకరించిందని పౌరవిమానయాన సంస్థ డైరెక్టర్ జనరల్ శుక్రవారం తెలిపారు. ఢిల్లీనుంచి శ్రీనగర్‌కు బయలుదేరిన ఇండిగో విమానం బుధవారం కుదుపులకు లోనయింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కారణంగా ఇండిగో విమానం అప్పటికే పాకిస్తాన్ గగనతలంవైపు ఉండటంతో అత్యవసరంగా ప్రవేశించేందుకు అనుమతికోరింది. అత్యవసరపరిస్థితి అని స్పష్టం చేసినా పాకిస్తాన్ నిరాకరించిందని డిజిసిఎ వెల్లడించింది. పాకిస్తాన్ తన గగనతలాన్ని భారత విమానాలకు నిషేధించిన సంగతి తెలిసిందే. ఆపరేషన్ సింధూర్‌నుంచి కూడా ఈ నిషేధం మరోనెలపాటు పొడిగించింది. దీనిపై డిజిసిఎ అధికారిక ప్రకటనచేస్తూ ఈ విషయమై విచారణచేస్తున్నట్లు వెల్లడించింది. 6ఇ-2142, ఎ321 నియో ఎయిర్‌క్రాఫ్ట్ పఠాన్‌కోట్ సమీపంలోకి వచ్చేసరికి భారీ ఉరుములు మెరుపులతో కూడిన వాతావరణం రావడంతో కుదుపులకు లోనయింది. క్రూసిబ్బంది నివేదికను అనుసరించి ఎయిర్‌ఫోర్స్ ఉత్తర కంట్రోల్‌కు సమాచారం ఇస్తూ ఎడమవైపు అంతర్జాతీయ సరిహద్దుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. అయితే అందుకు అనుమతి రాలేదు. ఆ తర్వాత క్రూ సిబ్బంది లాహోర్ కంట్రోల్‌రూమ్‌ను సంప్రదించారు. వాతావరణం నుంచి తప్పించుకునేందుకు కోరారు. లాహోర్‌సిబ్బందికూడా నిరాకరించారు. విమానంలోని క్రూ ముందు వెనక్కివచ్చేయాలని ప్రయతిననంచారు. అయితే అప్పటికే వాతావరణం పూర్తిగా మారిపోయింది. దీనితో అతితక్కువ దూరం ఉన్న రూటులో శ్రీనగర్‌కు వచ్చేందుకు ప్రయత్నించింది.అయినా కూడా ఉరుముల,మెరుపులు వాతావరణం ఎదుర్కొనక తప్పలేదు. దీనితో తప్పనిసరిపరిస్థితుల్లో ఎయిర్‌క్రాఫ్ట్ స్పీడు నిమిషానికి 8500 అడుగులు చొప్పున పెంచుకుంటూపోయారు. ఉరుములు మెరుపులు వాతావరణం అధిగమించేంతవరకూ ఇదే స్పీడును కొనసాగించారు. శ్రీనగర్ ఎటిసికి సమాచారం ఇచ్చి వెంటనే రాడార్ సంకేతాలు అందుకునేలా చేసుకోవడంతో విమానం సజావుగా లాండ్ అయింది.


## కేంద్రానికి ఆర్‌బిఐ భారీ డివిడెండ్

### రూ.2.69 లక్షలకోట్లు బదిలీచేస్తున్న కేంద్ర బ్యాంకు

**న్యూఢిల్లీ, మే 23:** భారతీయ రిజర్వుబ్యాంకు 2025 ఆర్థిక సంవత్సరానికి రూ.2.69 లక్షల కోట్ల భారీ డివిడెండ్‌ను ఇస్తోంది. 2024 ఆర్థిక సంవత్సరంలో రూ.2.10లక్షలుఇచ్చిన విషయం తెలిసిందే. దాంతో ఈ ఆర్థిక సంవత్సరానికి ఆర్థిక లోటును 4.4 శాతానికి తగ్గించడంలో మోడీ ప్రభుత్వానికి ఉపయోగపడనున్నది. గత సంవత్సరంలో పోలిస్తే 2025 ఆర్థిక సంవత్సరంలో డివిడెండ్ 37.37శాతం పెరిగింది. కంటింజెన్సీ రిస్క్‌బఫర్ 6.5శాతం నుంచి7.50 శాతానికి పెరిగింది. ఇదిలా ఉండగా.. ఆర్‌బీఐ రూ.3లక్షల కోట్ల వరకు డివిడెండ్‌ను బదిలీ చేసే అవకాశం ఉందని పలు నివేదికలు తెలిపాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్ ఆర్‌బీఐ, ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థల నుంచి రూ.2.56 లక్షల కోట్ల డివిడెండ్ ఆదాయాన్ని అంచనా వేసింది. శుక్రవారం జరిగిన 616వ సెంట్రల్ బోర్డు సమావేశంలో ఆర్‌బీఐ అధికారులు, ప్రపంచదేశీయ ఆర్థిక పరిస్థితిని సమీక్షించారు. ఇందులో అంచనాలకు వచ్చే నష్టాలున్నాయి. మోడీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి రూ.2,68,590.07 కోట్ల మిగులును బదిలీ చేయాలని నిర్ణయించారు. ముఖ్యంగా బోర్డు సీబీఆర్‌ను పెంచుతున్నది. ఇది మొండి రుణాలు, పడిపోతున్న ఆస్తి విలువలు, సిబ్బంది ఖర్చులు తదితర నష్టాలను కవర్ చేసేందుకు సహాయపడనున్నది.
ఈ మొత్తం చెల్లింపుతో 2025-26 ఆర్థిక సంవత్సరం కోసం వార్షిక బడ్జెట్‌లో అంచనా వేసిన రూ. 2.2 లక్షల కోట్లు మించిపోనున్నది. రూపాయి మారక విలువను కాపాడేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇటీవల రికార్డు స్థాయిలో డాలర్ అమ్మకాలు చేపట్టిన విషయం తెలిసిందే. 2024 సెప్టెంబర్ ముగింపు నాటికి భారత్ వద్ద రికార్డు స్థాయిలో 704 బిలియన్ డాలర్ల విదేశీ మారకం నిల్వలు ఉండగా 2024 ఏప్రిల్ నుంచి ఫిబ్రవరి 2025 మధ్య 371.6 బిలియన్ డాలర్లను విక్రయించినట్లుగా అంచనా. ఈ నిధులు కేంద్ర ప్రభుత్వానికి ఆర్థిక లోటును తగ్గిస్తాయని, ప్రభుత్వ వ్యయం, బ్యాంకింగ్ వ్యవస్థలో లిక్విడిటీని సైతం పెంచుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.

## హేమ్‌కుండ్‌సాహిబ్ గురుద్వారా యాత్ర ప్రారంభం!

**డెహ్రాడూన్, మే 23:** రాష్ట్రంలోని ఛమోలి జిల్లాలో ఉన్న శ్రీహేమ్‌కుండ్‌సాహిబ్ గురుద్వారా భక్తులకోసం తెరిచారు. సాంప్రదాయ ప్రార్థనల్లో ముఖ్యమంత్రి పుష్కరసింగ్‌ధామి కూడా పాల్గొన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ సర్దార్ గుర్మీత్‌సింగ్ తదితర ప్రముఖులు ఈప్రార్థనల్లో పాల్గొన్నారు. అధికారికంగా గురుద్వారాను ప్రారంభించినప్పటికీ వార్షిక యాత్ర ఇప్పటికే ప్రారంభించారు. మొదటి బ్యాచ్ యాత్రీకులు గురువారంనుంచే బయలుదేరారు. రిషికేశ్‌లోని లక్ష్మణ్‌ఝూలారోడ్డులో ఉన్న హేమ్‌కుండ్ గురుద్వారా సాహిబ్‌నుంచే ఈ యాత్రను ప్రారంభించారు. గవర్నర్ లెఫ్టినెంట్ జనరల్ సర్దార్ గుర్మీత్‌సింగ్, ముఖ్యమంత్రి పుష్కరసింగ్ ధామి తదితరులు జెండా ఊపి ప్రారంభించారు.



పంజ్‌ప్యారే ఆధ్యాత్మిక మార్గనిర్దేశనంలో ఈ యాత్ర జరుగుతుందని చెపుతున్నారు. ఉత్తరాఖండ్ వంటి దైవభూమికి ప్రపంచం నలుమూలలనుంచి యాత్రీకులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సీఎం ధామి చెప్పారు. చార్ ధామ్ యాత్రకు వచ్చే భక్తులతరహాలోనే ఈ యాత్రకు భారీ సంఖ్యలో యాత్రీకులు,భక్తులు వస్తారు.

# గొల్లపల్లి, సోమశిల జలాశయాలను అనుసంధానం చేయాలి

## గొల్లపల్లి, బనకచర్ల కాంప్లెక్స్ పథకాన్ని విరమించుకోవాలి

### పోలవరంపై సిఎం చంద్రబాబుకు కొల్లి నాగేశ్వర్‌రావు అధ్యయన కేంద్రం లేఖ

**అనంతపురం, మే 23 ప్రభాతవార్త బ్యూరో :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు కొల్లి నాగేశ్వరరావు అధ్యాయన కేంద్రం శుక్రవారం రోజు ఒక లేఖను రాసింది. ఆ లేఖలో గోదావరి-కృష్ణ-పెన్నా అనుసంధాన పథకం ఎంతో అవసరమని ఈ పథకాన్ని గొల్లపల్లి (నూతనంగా నిర్మించబోయే)-సోమశిల జలాశయాలను అను సంధానం చేస్తూ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కొల్లి నాగేశ్వరరావు అధ్యయన కేంద్రం కోరింది. అదే సమయంలో గొల్లపల్లి నుంచి పెనకచర్ల కాంప్లెక్స్‌కు గోదావరి జలాలను తరలించే ప్రతి పాదనను ప్రభుత్వం విరమించుకోవాలని కూడా సీఎంకు రాసిన లేఖలో కొల్లి నాగేశ్వరరావు అధ్య యన కేంద్రం కోరింది. కొల్లినాగేశ్వరరావు అధ్య యన కేంద్రం తరపున సమన్వయ కర్త డి.లక్ష్మి


టి.లక్ష్మినారాయణ

నారాయణ శుక్రవారం సీఎం చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. ఆ లేఖలోని ముఖ్య మైన అంశాలు ఇలా ఉన్నాయి. మే 21వ తేదిన విజయవాడలో నా అధ్యక్షతన కొల్లి నాగేశ్వరరావు అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నదుల అనుసం ధానం, ఆవశ్యకత-ప్రతిపాదనలు సానుకూల ప్రతి కూల అంశాలు అనే అంశంపై మేధోమధనం సదస్సును నిర్వహించాము. ఈ సభకు జల వనరుల శాఖకు చెందిన విశ్రాంత ఇంజినీర్లు, రైతు సంఘాల ప్రముఖనేతలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. సభలో తీసుకున్న తీర్మాణం మేరకు గొల్లపల్లి-సోమశిల జలాశయాలను అనుసంధానం చేస్తూ పోలవరం పథకాన్ని చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది. ఇందులో భాగంగా పోలవరం నుంచి ఒక ప్రత్యేక వరద కాలువ ద్వారా గోదావరి వరద జలాలను గరిష్టంగా తరలించి కృష్ణ నదిని, నాగార్జున సాగర్ కుడి కాలువను ఆక్విడెట్ ద్వారా దాటించి గొల్లపల్లి జలాశయానికి చేర్చి నీటిని వినియోగించుకోవాలని ప్రభుత్వాన్ని కోరింది. తద్వారా ఆదా అయ్యే కృష్ణ జలాలను శ్రీశైలం జలాశయం నుంచి 44 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరించిన పోతిరెడ్డి పాడు రెగ్యులేటర్ నుంచి గరిష్ట సామర్థ్యంతో నీటిని తరలించాలని, శ్రీశైలం కుడి ప్రధాన కాలువ ద్వారా పెనకచర్ల క్రాస్ రెగ్యులేటర్‌కు చేర్చి తెలుగు గంగ, గాలేరి నగరి ప్రాజెక్టులకు గ్రావిటీ మీద అందజేయాలని మేదోమధనం సభ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

# నాలుగేళ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య


నిందితుడు

**జమ్మలమడుగు, మే 23, ప్రభాతవార్త:** నాలుగేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి ఆపై చంపి ముళ్ల పొదల్లో వేసిన దారుణ ఘటన మైల వరం మండలం ఎం.కంబాల దిన్నె గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. జమ్మలమడుగు మం డలం మోరగుడి గ్రామానికి చెందిన ఓ జంట వివాహ కార్యక్రమానికి వచ్చిన ఓ యు వకుడు ఈ దారుణానికి ఒడిగట్టినట్లు స్థానికులు తెలిపారు. ఆ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని మైలవరం పోలీసు స్టేషన్‌కు తర లించారు. నిందితుడిని తమకు అప్పగించాలని స్థానికులు ఆందోళన చేపట్టారు.

# నీటి తొట్టిలో పడి ఇద్దరు బాలికలు మృతి

**గోనెగండ్ల మే 23 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా మండల కేంద్రమైన గోనెగండ్లలో ఇద్దరు బాలికలు నీట మునిగి మృత్యువాత పడ్డారు. గోనెగండ్ల గ్రామానికి చెందిన బోయ మందకల్, బోయ సరస్వతిలకు ముగ్గురు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. వీరు కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవారు. వీరి రెండో కుమార్తె బోయ మాధురి(12), ఆరవ తరగతి వరకు చదువుకొని, చదువు మాని వేసింది. తల్లి వెంట పొలాలకు వెళ్ళేది. అలాగే అదే వీధి సమీపంలో బోయ రంగప్ప నాయుడు, బోయ మహేశ్వరిలకు ఇద్దరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. వీరు కూడా కూలి పనులు చేసి జీవనం సాగించేవారు. వీరి రెండో కుమార్తె బోయ మంజుల (12), రోజు తల్లి తోపాటు పొలం వెళ్ళేది. అయితే శుక్రవారం ఇద్దరి పిల్లల తల్లులు సరస్వతి మహేశ్వరిలు గ్రామానికి చెందిన కురువ నాగరాజు పొలంలో పత్తి విత్త నాలు విత్తేందుకు కూలికి వెళ్లారు. ఇద్దరు బాలికలు తమ తల్లులకు చెప్పకుండా మాధురి, మంజుల ఇద్దరూ కలసి నాగరాజు పొలంలో ఉన్న నీటి ట్యాంకులో (తొట్టి ) దగ్గరకు ఈతకు వెళ్లారు. ఆ సమయంలో నీటి తొట్టి దగ్గర ఎవ్వరూ లేరు. దీంతో బాలికలు ఇద్దరు ఈత కొట్టేందుకు తొట్టిలో దిగారు. ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి పోయారు. ఇద్దరికీ ఈత రాకపోవడంతో నీటిలో పూర్తిగా మునిగిపోయారు. వారి అరుపులు కూడా పొలంలోని వారికి వినిపించలేదు. నీటిలో ఊపిరి ఆడక మృతి చెందారు. ఎంతసేపటికి తమ పిల్లలు కనిపించకపోవడంతో సరస్వతి మహేశ్వరిలు పొలంలో వెతికారు జాడ కనిపించ లేదు. ఇక నీటి తొట్టి వైపు వెళ్లి చూడగా అక్కడ మాధురి, మంజుల ఇద్దరు శవాల నీటి తొట్టిలో కనిపించారు. పిల్లలు నీటి తొట్టిలో నుంచి బయటకు తీసి గోనిగండ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు తెలిపారు.



# లేపాక్షి, ఆప్కోల మధ్య ఒప్పందం: ఆర్‌పి సిసోడియా

**విజయవాడ, మే 23, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక సంపదను ప్రపంచం ముందుకు తీసుకురావడం లక్ష్యంగా, లేపాక్షి (ఏపీ హ్యాండిక్రాఫ్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్), ఆప్కో (ఆంధ్రప్రదేశ్ స్టేట్ హ్యాండ్లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్) ప్రతినిధులు విజయవాడలోని ఆప్కో కేంద్ర కార్యాలయంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. లేపాక్షి, ఆప్కో ముఖ్య అధికారుల సమక్షంలో శుక్రవారం జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి చేనేత జౌళి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి. సిసోడియా హాజరయ్యారు. ఈ ఒప్పందం ద్వారా లేపాక్షి ఆప్కో సంస్థలు పరస్పరం తమ అత్యుత్తమ హస్తకళలు, చేతివస్త్రాల ఉత్పత్తులను రెండు సంస్థల షోరూంలలో ప్రదర్శించి విక్రయించేందుకు అవకాశం లభిస్తుంది.

ఈ సందర్భంగా ఆర్.పి. సిసోడియా మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం రాష్ట్ర శిల్పకారుల జీవితాలలో మార్పు తీసుకు రాగల కీలకమైన అడుగని అభిప్రాయపడ్డారు. ఆప్కో, లేపాక్షి సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ విశ్వ మనోహరన్ మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం ద్వారా రెండు సంస్థలు పరస్పరం కలిసి పని చేస్తూ రాష్ట్ర చేనేత కార్మికుల జీవితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కో జనరల్ మేనేజర్లు నాగేశ్వరరావు, రాజారావు, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పార్వతి, అసిస్టెంట్ డైరెక్టర్ బెనహర్, లేపాక్షి మార్కెటింగ్ మేనేజర్ శ్రీధరాచార్యులు, డెవలప్మెంట్ మేనేజర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# ఏడువారాల వెంకన్న దేవాలయానికి మహర్దశ

## మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కమిషనర్ పలు సూచనలు



**ఉమ్మడితూర్పుగోదావరిజిల్లా బ్యూరో మే 23ప్రభాత వార్త:** ఏడు వారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి దివ్య క్షేత్రం అనతి కాలంలోనే ప్రధాన ఆలయాల్లో ఒకటిగా రావడం చాలా ఆనంద దాయాకమని దేవాదాయ ధర్మ దాయ కమిషనర్ కె. రామచంద్రమోహన్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం, వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం సం దర్శించారు. వారికి ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రదరరావు,అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, ప్రసాదలను ఈఓ అందజేశారు. అనంతరం దేవస్థానం ప్రాగణంలోని వసతులను,సేవలను, పార్కింగ్ స్థలాలను, భక్తులు క్యూ లైన్లను,పుష్కరిని, స్నాన ఘట్టలు,కేశఖండన శాల, భోజనశాలలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కమిషనర్ కె రామచంద్ర మోహన్, ఈఓ, నల్లం సూర్య చక్రదరరావులు ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు సలహాలను అందించారు. ఈసందర్బంగా కమీషనర్ కె. రామచంద్ర మోహన్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రూపకల్పన కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ గతం కంటే ఇప్పుడు దర్శనం త్వరగా అయ్యేవిధంగా ఈఓ చర్యలు తీసుకోవడంతో భక్తులకు దర్శనం భాగ్యం రెండు గంటల లోపే అవుతుందని, శనివారాలు భక్తులు పెరుగుతున్న నేపథ్యంలో ఇంకా మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కమిషనర్, కె, రామ చంద్రమోహన్,ఎమ్మెల్యే సత్యానందరావు అధి కారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఈ ఈ దుర్గేష్, డి ఈ శ్రీనివాస్ జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, తహసీల్దార్ టి ఆర్ రాజేశ్వరరావు,అర్చకులు, వేద పండుతులు, సూపరిండెంట్ రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్,వై, శ్రీనివాస్, నందిశ్వరుడు, నారాయణ, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఎన్ని అక్రమకేసులు పెట్టినా బెదరను

## పైలాన్ ధ్వంసం కేసులో విచారణకు హాజరైన ప్రతాప్‌రెడ్డి

**కావలి (నెల్లూరు), మే 23, ప్రభాతవార్త :** ఎన్ని అక్రమకేసులు పెట్టినా భయపడేది, బెదిరేదిలేదని వైసిపి కావలి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అమృతపథకం పైలాన్ ధ్వంసం కేసుకు సంబంధించి శుక్రవారం కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి టూటౌన్ పోలీసుస్టేషన్‌లో విచారణకు హాజరయ్యారు. దాదాపు ఆరున్నర గంటలపాటు పోలీసు అధికారులు మాజీ ఎమ్మెల్యేపై ప్రశ్నలవర్షం కురిపించారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎప్పుడో జరిగిన అమృతపథకం పైలాన్ ధ్వంసం కేసు రీఓపెన్ చేసి తమపై తప్పుడు కేసులు పెట్టారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పైలాన్ ధ్వంసం తమకు సంబంధం లేదన్నారు. ప్రభుత్వ ఆస్తులు పరిరక్షిస్తామే తప్ప ధ్వంసం చేసేందుకు సహకరించమన్నారు. పైలాన్ ధ్వంసం కేసును అడ్డం పెట్టుకుని 13 మందిపై 307, ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేసిన కేసులు వైసిపినేతలపై పెట్టడం జరిగిందన్నారు. వైసిపికి సహకరించిన కొంతమంది పాత్రికేయులను జైలుకు పంపారన్నారు. కొంత మంది మీడియా సోదరులు ప్రెస్‌క్లబ్ కావాలని ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్న తనను అడగడం జరిగిందన్నారు. ప్రభుత్వ స్థలాలకోసం చూడడం, ఆ తర్వాత అధికా రులతో మాట్లాడి అన్నా క్యాంటిన్‌లో ప్రెస్‌క్లబ్‌కు అనుమతివ్వడం జరిగిందన్నారు. పైలాన్ ధ్వంసం కేసును అడ్డంపెట్టుకుని అబద్ధపు సాక్ష్యాలతో కేసులు పెట్టడం జరిగిందన్నారు. టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఆరున్నర గంటలపాటు 42 ప్రశ్నలు వేశారన్నారు. అన్నింటికి సమాధానం చెప్పామన్నారు. టూటౌన్ పోలసుస్టేషన్‌లో విచారణ అధికారిగా టూటౌన్ సిఐ గిరిబాబు వ్యవహారించారు. ఈ విచారణలో వన్‌టౌన్ సిఐ ఫిరోజ్, రూరల్ సిఐ రాజేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కృష్ణా నదిలో రాజధాని కడుతున్నారు

## మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతా మోహన్

**గూడూరు, మే 23 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాజధాని విషయంలో పొరపాటు చేస్తున్నాడని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతా మోహన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష కోట్లు ఖర్చు పెట్టాలను కుంటున్నాడు. ఆ డబ్బు ఎవరిది అని ప్రశ్నించారు. బ్యాంకుల నుంచి అప్పు తెస్తున్నాడు. అమరావతిలో ఒక బిల్డింగ్ నిర్మాణానికి పదింతలు అదనపు ఖర్చు అవుతుందని, సెక్రటేరియట్ కోసం 50 అంతస్తుల భవనాన్ని కట్టాలనుకుంటున్నారు. భవిష్యత్తులో ఆ బిల్డింగ్ కూలిపోతే బాధ్యత ఎవరు వహిస్తారని అన్నారు. అమెరికాలో వాషింగ్టన్, మలేషియాలో, అలాగే ఆస్ట్రేలియాలో ఒక మహా నగరాన్ని కట్టాలని ఫెయిలయ్యారు. ఒక మహా నగరాన్ని కట్టెముందు అందరి సలహాలు తీసుకోవాలన్నారు. మొండిగా ముందుకు వెళ్లవద్దని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు. శివరామ కృష్ణన్ కమిటీ సిఫార్సులో ఏముందని, అమరావతిలో కట్టమని కమిటీ చెప్పలేదు. పేదరికం గురించి ముఖ్యమంత్రి మాట్లాడటం హాస్యాస్పదం. 2029 నాటికి పేదరికాన్ని తీసేస్తానని ముఖ్యమంత్రి అంటున్నారన్నారు. 15 యేళ్ల ముఖ్యమంత్రిగా




పనిచేసిన మీరు పేదరికాన్ని ఎంతవరకు తగ్గించగలిగారన్నారు.

**మేజర్ పోర్టు ప్రారంభించాలి:** దుగరాజ పట్టణ మేజర్ పోర్టును కాంగ్రెస్ పార్టీ, డాక్టర్ మన్మోహన్ సింగ్ ఇచ్చారు. మోడీ, బాబు ఇరువురూ కలిసి గూడూరు ప్రజల చెవిలో పూలు పెడుతున్నారు. గూడూరు ప్రజలకు కావాల్సింది దుగ్గరాజ పట్టణం మేజర్ పోర్ట్ నిర్మాణం. ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నీతి అయోగ్ దగ్గర మేజర్ పోర్ట్ గురించి ప్రస్తావించాల న్నారు. ఇది ఆయన బాధ్యత అని అన్నారు. రాష్ట్రంలో ఉన్న గనులు, ఇసుక, క్వార్జ్ ఖనిజ సంపద కొందరే దోచుకుంటున్నారు. ఒక కిలో క్వార్జ్ రూ. 10 వేల రూపాయలు, ఒక ట్రాక్టర్ ఇసుక 10 వేల రూపాయలు, గనులు సహజ సంపద. సహజ సంపద అందరికీ సమానంగా పంచాలన్నారు. నిరుద్యోగ బ్రాహ్మణులు, ఎస్సీ, ఎస్టీ ఓబీసీ, మైనార్టీలకు ఇసుక, క్వార్జ్, ఖనిజ సంపద గనులు కేటాయించాలన్నారు. రహస్యంగా ప్రకటనలు ఇస్తున్నారు. దీన్ని నేను ఖండిస్తూ ప్రతి మండలంలో అందరికీ అందుబాటులో పేపర్లలో ప్రకటనలు ఇవ్వాలని, దరఖాస్తుకు సమయం ఇవ్వాలని గూడూరు టవర్ క్లాక్ దగ్గర కాంగ్రెస్ ధర్నా చేసారు. సబ్ కలెక్టర్ ఆఫీస్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రామకృష్ణ, వెంకటయ్య, చందనమూడి శివ, పెంచులయ్య, పూల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన టిడిపి

## రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలి

### వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్

**నెల్లూరు, మే 23, ప్రభాతవా-వైద్యం:** నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన నెల్లూరు పార్లమెంట్ మహానాడు కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జిల్లాకు చెందిన శాసనసభ్యులు నెల్లూరు పార్లమెంట్ టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డిలు హాజరయ్యారు. ముందుగా పార్టీ ప్రతినిధులు నమోదు కార్యక్రమం జరిగింది. అనంతరం నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.



స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి నివాళి అర్పించి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. పహల్గాం దాడిలో చనిపోయిన అమాయకులకు, ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన జవాన్లకు, ఇటీవల కాలంలో మృతి చెందిన పార్టీ కార్యకర్తలకు సంతాపం ప్రకటించారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గ తీర్మానాలను ప్రవేశపెట్టారు. చివరిగా నెల్లూరు పార్లమెంట్‌కు సంబంధించిన పది తీర్మానాలను నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ ప్రవేశపెట్టారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని పెంచిన పార్టీ టిడిపి అని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి బయటకు లాగిన గొప్ప నాయకుడు చంద్రబాబునాయుడు అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని మంత్రులను, ఎమ్మెల్యేలను కోరుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పాలక మండలి సభ్యులు పనబాక లక్ష్మి, మాజీ ఎమ్మెల్సీ బోదాటి రాదయ్య, మాజీ ఎమ్మెల్యే కొమ్మిలక్ష్మి నాయుడు, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వంటేరు వేణుగోపాల్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, ఆగ్రోస్ ఇండస్ట్రీస్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు, టీసీసీబీ చైర్మన్ మెట్టు కూరు ధనుంజయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల సమాచారం

## సేవకుడిగా శ్రీవారి భక్తులకు సేవలందిస్తా

### టిటిడి ఎక్స్‌అఫిషియోసభ్యుడు దివాకర్‌రెడ్డి

**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి చెంత సేవకుడిగా భక్తులకు సేవలందిస్తానని, తనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ ఉంచిన నమ్మకాన్ని కాపాడుకుంటానని తుడ ఛైర్మన్, టిటిడి బోర్డు ఎక్స్ అఫిషియోస్యుడు సి.దివాకర్ రెడ్డి తెలిపారు. టిటిడి ఎక్స్ అఫిషియో సభ్యుడుగా ఆయన శుక్రవారం ఉదయం ప్రమాణస్వీకారం చేశారు. ఆయన చేత టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఆయన కుటుంబంతో కలసి దేవుదేవుని దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి



వేదాశీర్వచనం,శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి,బోర్డుసభ్యుడుభాను ప్రకాశ్‌రెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం ఉన్నారు.

## తుడకు మంచిపేరు తీసుకురావాలి

### ఎక్స్‌అఫిషియో సభ్యుడు దివాకర్‌రెడ్డికి టిటిడి ఛైర్మన్ నాయుడు హితవు



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయాలకనుగుణంగా తుడను అభివృద్ధిచేయాలని, తుడకు మంచిపేరు తీసుకురావాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు హితవు చేశారు. తుడ ఛైర్మన్‌గా, టిటిడి బోర్డు ఎక్స్ అఫిషియోసభ్యుడుగా నియమితులై ప్రమాణస్వీకారం చేసిన దివాకర్‌రెడ్డి ఛైర్మన్ నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీవారి చిత్రపటాన్ని అందించారు.

## సదుపాయాలు మెరుగుపడ్డాయి

### టిటిడి ఛైర్మన్ నాయుడుతో దర్శకుడు రాఘవేంద్రరావు

**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** టిటిడి ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత తిరుమలలో సదుపాయాలు మెరుగుపడ్డాయని, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని సినీ దర్శకుడు రాఘవేంద్రరావు అభినందించారు. శుక్రవారం తన పుట్టినరోజున శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఛైర్మన్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా సినీ ప్రముఖులు రాఘవేంద్రరావు, బండ్లగణేశ్ కలిసి ఛైర్మన్‌ను ఆత్మీయంగా అభినందించారు.



## చక్రతీర్థంలో పరిశుభ్రత పాటించండి

### ఆకస్మిక తనిఖీల్లో టిటిడి ఇఒ శ్యామలరావు



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** శేషాచలం కొండల్లో ఎంతో పవిత్రమైన చక్రతీర్థంలో పరిశుభ్రత పాటించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని టిటిడి అధికారులను ఇఒ జె.శ్యామలరావు ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన చక్రతీర్థంలో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఇక్కడ ఉన్న సుదర్శన చక్రత్తాళ్వార్, నర సింహస్వామి, ఆంజనేయస్వామి ప్రతిమలను, ఇక్కడ ఉన్న శివునిసాన్నిధ్యాన్ని కూడా పరిశీలించారు. దర్శనం చేసుకున్నారు.ఈ ప్రాంతాల్లో పార్కింగ్, శుభ్రత నిశితంగా గమనించారు. ఇఒ వెంట ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్‌నారాయణ, ఆరోగ్యఅధికారి డాక్టర్ మధుసూదన్, టిటిడి అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

## రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌ను అన్ని విధాలా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్ళేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషికి తోడు దేవుని శక్తినివ్వాలని కోరినట్లు రాష్ట్ర రవాణామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. శుక్రవారం ఉదయం విఐపి బ్రేక్ దర్శనంలో ఆయన కుటుంబసభ్యులతో కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## ప్రజలందరికీ శ్రీవారి ఆశీస్సులు కలగాలి: సినీప్రముఖులు



**తిరుమల,మే 23ప్రభాతవార్తప్రతినిధి:** తన పుట్టిన రోజున తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అభిషేకసేవలో పాల్గొని, దర్శించుకోవడం సంతోషకరమని సినీదర్శకుడు రాఘవేంద్రరావు తెలిపారు. ఆలయంలో భక్తులకు సౌకర్యాలు, క్యూలైన్ల నిర్వహణ అద్భుతంగా ఉందన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలం దరికి మంచి జరగాలని, అందరూ సంతోషంగా ఉండాలని సినీప్రముఖులు రాఘవేంద్రరావు, బండ్లగణేశ్, దర్శకుడు కెవి రావు ఆకాంక్షించారు. శుక్రవారం వేకువజామున వీళ్ళు ముగ్గురూ కలసి ఆలయంలోనికి చేరుకున్నారు. అభిషేకసేవలో దర్శించుకున్నారు. టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## కోదండరామస్వామి ఆలయంలో మరో కియోస్క్

**తిరుమల,మే 23ప్రభాత వార్తప్రతినిధి:** దేశవిదేశాల నుండి ప్రతిరోజూ దేవదేవుని దర్శనం కోసం తిరుమల, తిరుపతికి వస్తున్న భక్తులు తమకు తోచినంత సులభంగా విరాళాలిచ్చేలా అవస రమైన కియోస్క్ యంత్రాన్ని టిటిడి ఏర్పాటు చేస్తోంది. శుక్రవారం ఉదయం తిరుపతిలోని కోదండరామస్వామి ఆలయంలో ఈ కియోస్క్



యంత్రం ఏర్పాటుకు సౌత్ ఇండియన్ బ్యాంక్ విరాళంగా అందించింది. ఇందులో క్యూఆర్ కోడ్ యంత్రంతో యుపిఐ మోడ్‌లో లక్షరూపాయల వరకు భక్తులు విరాళంగా అందజేయవచ్చు. ఇప్పటికే సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రతినిధులు ఒక కియోస్క్‌మిషన్ అందించగా తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో అందుబాటులో ఉంది. కోదండ రామస్వామి ఆలయంలోనూ భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ప్రస్తుతం టిటిడిలో తిరుమలలో అన్నదానం, పద్మావతి అతిథి గృహం, సిఆర్ఒ కార్యాలయం, దేవుని కడప, తిరుపతిలో గోవిందరాజస్వామి ఆలయం, అమరావతి, ఒంటిమిట్ట ఆలయం, తిరుచానూరు పద్మావతిఅమ్మవారి ఆలయం, వకుళమాత ఆలయం, కపిలేశ్వరస్వామి ఆలయంతో బాటు హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు. విజయవాడలలో టిటిడి వినియోగిస్తోంది. ఈ కార్యక్రమంలో సౌత్ ఇండియన్ బ్యాంక్ ప్రతినిధులు ఏవి నిరంజన్, ఆర్.వెంకటరావు, డి.అశోక్‌వర్ధన్, ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, ఐటి డిజిఎం బి.వెంకటేశ్వర్లు, ఎఇఒ రవి పాల్గొన్నారు.



తూర్పుగోదావరి, కాకినాడ
డా.బి.ఆర్ అంబేడ్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శనివారం 24 - మే - 2025



# ఈ అన్నదమ్ముల అనుబంధానికి బలమెక్కువ - నేడు జాతీయ అన్నదమ్ముల దినోత్సవం



**గండేపల్లి , మే 23, ( ప్రభాతవార్త ) :** "ఆ బంధంలో తెలియని మ్యాజిక్ ఉంది.. కొట్టుకున్నా.. తిట్టుకున్నా..అందులో ప్రేమ ఉంటుంది చెప్పలేని ప్రేమకు ప్రతిరూపం అన్నదమ్ముల అనుబంధం" నేడు మే 24 జాతీయ అన్నదమ్ముల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...పచ్చనోటు ముందు పలుచనై పోతున్న బంధాలు ధనదాహం ముందు గుడ్డిదైపోతుంది గుణంహొఆస్తి,అంతస్థుల ముందు ఆవిరై పోతున్నాయి ఆప్యాయతలు..పెద్దలపైన కుటుంబ వ్యవస్థపైనా అపార ప్రేమాభిమానాలు చూపే గుణం..ఆస్తులు అంతస్తులు కన్నా తన తండ్రి చూపిన ఆధ్యాత్మిక, సేవా మార్గంలోనేహొ ఆప్యాయతలు పంచుతూ విలువలు పెంచుకుంటూ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు ఈ సోదరహొత్రయం ... ఆయన గణితంలో మేజిక్కులు చేస్తారు.. అంకెలతో ఆటలాడుకుంటూ తన విద్యార్థులకు లెక్కలపై లెక్కలేనంత మక్కువ పెంచుతూ ఎన్నో అవధానాలను తాను చేస్తూ తన శిష్యులచే చేయిస్తూహొగణిత మేధావి గాహొప్రసిద్ధిగాంచిన గణిత అవధాని,పుస్తక రచయిత,జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులుగా రాష్ట్రపతి చేతుల మీదుగాహొఅవార్డు పొందిన తోటకూర సాయి రామ కృష్ణ ప్రథముడు. ఆయన తరగతి గదిలోనే కాదు మానవ సంబందాలలోను ఒకలెక్క ఉందని మన తిక్కను ఇతరులపై చూపించకుండా మక్కువతో అక్కున చేర్చుకోవాలని .. అందుకు తనకు తెలిసినహొ లెక్కల పరిభాషలో చూస్తూ అనుబంధాలను కలుపుకుంటూ (+),రాగద్వేషాలను తీసివేసి(-) ప్రేమానురాగాలను హెచ్చువేస్తూ మంచితనాన్ని పదిమందికి పంచుకుంటే (/)జీవితంహొ నిస్సందేహంగా సఫలీకృతం అవుతుందంటారాయన, ఆస్తిగా భావించి సోదరుల సహకారంతో శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి ద్వారా గ్రామంలో సమాజహిత కార్యక్రమాలు చేస్తున్నహొ సమితి అధ్యక్షుడు, ఆదిత్య యూనివర్సిటీ ప్రెస్ రిలేషన్ ఆఫీసర్ గా పనిచేస్తున్న జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత గంగాధర్హొమరొకరు.అన్న మార్గంలోహొగురు పథంలో కొనసాగుతూ సామర్లకోటహొ మండలం వెంకట కృష్ణరాయపురం గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ విద్యా సేద్యం చేస్తూ...విలువలతో కూడిన విద్యను అందిస్తూ యువ భారత నిర్మాతలను తీర్చిదిద్దుతున్నారు.

# ఘనంగా మహాలక్ష్మమ్మ అమ్మవారి సేవ

**మామిడికుదురు , మే 23, ( ప్రభాతవార్త ) :** మామిడికుదురు మండలంలోని పెదపట్నంలంక గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి జాతర మహెూత్సవం సందర్భంగా గురువారం అమ్మవారి సేవను ఘనంగా జరిపించారు. గరగ నృత్యాలు,డప్పు వాయిద్యాలు,చిత్ర విచిత్ర వేషధారణలు,శక్తి వేషాలు, బుట్ట బొమ్మల కోలాహలం, తీన్మార్ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి సేవను దేవి యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది. యువకులు డాన్సులు చేస్తూ ఉత్సాహంగా సేవలో పాల్గొన్నారు. ఆదివారం రాత్రి అమ్మవారి జాతర



జరుగుతోందని,సోమవారం అమ్మవారికి నైవేద్యాలు చెల్లిస్తారని,మంగళవారం సిరిబొమ్మ తీర్థం జరుగుతోందని కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి జాతర ఉత్సవంలో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు.

# ఏడువారాల వెంకన్న దేవాలయానికి మహర్దశ



**- ప్రధాన ఆలయాల్లోకి చేరిన వాడపల్లి.**
**- మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కమిషనర్ పలు సూచనలు**

**ఆత్రేయపురం, మే 23, ( ప్రభాతవార్త ) :** ఏడు వారాల వెంకన్న గా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి దివ్య క్షేత్రం అనతి కాలంలోనే ప్రధాన ఆలయాల్లో ఒకటిగా రావడం చాలా ఆనంద దాయాకమని దేవాదాయ ధర్మదాయ కమీషనర్ కె. రామచంద్రమోహన్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం, వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శుక్రవారం సందర్శించారు. ముందుగా ఇరువురు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. వారికి ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈఓ, నల్లం సూర్య చక్రదరరావు,అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, ప్రసాదలను ఈఓ అందజేశారు. అనంతరం దేవస్థానం ప్రాగణంలోని వసతులను,సేవలను, పార్కింగ్ స్థలాలను, భక్తులు క్యూ లైన్లను,పుష్కరిని, స్నాన ఘట్టలు,కేశఖండన శాల, భోజనశాలలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కమిషనర్ కె రామచంద్ర మోహన్, ఈఓ, నల్లం సూర్య చక్రదరరావులు ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించి తగు సూచనలు సలహాలను అందించారు. ఈసందర్భంగా కమీషనర్ కె. రామచంద్ర మోహన్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రూపకల్పన కృషి చేస్తున్నట్టు తెలిపారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనకు భక్తుల సౌకర్యార్థం డార్మెటరీ వారం రోజుల్లో శంకుస్థాపన చేస్తామన్నారు. వకుళమాత అన్నదాన భవనం త్వరలో నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు భక్తులకు దర్శనానికి ఇబ్బందులు లేకుండా స్వామి వారి దర్శన భాగ్యం త్వరగా అయ్యేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఆలయ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మాట్లాడుతూ గతం కంటే ఇప్పుడు దర్శనం త్వరగా అయ్యేవిధంగా ఈఓ చర్యలు తీసుకోవడంతో భక్తులకు దర్శనం భాగ్యం రెండు గంటల లోపే అవుతుందని, శనివారాలు భక్తులు పెరుగుతున్న నేపథ్యంలో ఇంకా మెరుగైన సౌకర్యాలు, వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కమిషనర్, కె, రామచంద్రమోహన్ ,ఎమ్మెల్యే సత్యానందరావు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ అధికారులు ఈ ఈ దుర్గేష్, డి ఈ శ్రీనివాస్ జిల్లా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, తహసీల్దార్ టి ఆర్ రాజేశ్వరరావు,అర్చకులు, వేద పండుతులు, సూపరింటెంట్ రాంబాబు, సీనియర్ అసిస్టెంట్ కుమార్,వై, శ్రీనివాస్, నందిశ్వరుడు, నారాయణ, దేవస్థానం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే నానాజీ

**కాకినాడ రూరల్, మే 23, ( ప్రభాతవార్త ) :** కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని అనారోగ్యం పాలై మెరుగైన వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన చెక్కులను కాకినాడ గ్రామీణ శాసనసభ్యులు పంతం నానాజీ పంపిణీ చేశారు. గోదారిగుంట ఎమ్మెల్యే స్వగృహం వద్ద శుక్రవారం నియోజకవర్గం పరిధిలో 12 మందికి రూ: 9,69,049/ రూపాయల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పెదపూడి మను, సవితాల రామచంద్ర రావు, తాతపూడి శ్రీనివాస్, రెడ్డి సత్య ప్రసాద్,గొల్లపల్లి సంజయ్ కుమార్, రేలంగి రాజు, మంచినశెట్టి ప్రసన్న కుమార్, రాయుడు శ్రీను, సామాన గౌరమ్మ, తుమ్మలపల్లి సూర్యనారాయణ, ఆచంట రామలక్ష్మి, మెర్నిడి సత్యనారాయణ లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి



వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అభివృధికి పెద్ద పీట వేస్తూ సంక్షోభంలో కూడా పేద ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని, రూరల్ నియోజకవర్గం లో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి సుమారు 81 లక్షల చెక్కులను అందించడం జరిగిందని ఎమ్మెల్యే మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకినాడ రూరల్ మండలం జనసేన పార్టీ అధ్యక్షుడు కరెడ్ల గోవిందు, ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు, నల్లం శ్రీరాములు, భోగి రెడ్డి కొండబాబు,కూటమి నాయకులు, జన సైనికులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికై ప్రత్యేక శ్రద్ధ వహిస్తా

## ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**రావులపాలెం, మే 23, ( ప్రభాతవార్త ) :** ప్రజల సమస్యలకు సరైన పరిష్కార వేదిక ప్రజాదర్బార్ అని, ప్రజా సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. శుక్రవారం రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహించారు, ప్రజాదర్బార్ కార్యక్రమంలో సుమారు 163 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కారం మార్గం చూపేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఇచ్చిన సమస్యల వినతులు పరిష్కారం అయ్యే వరకు వాటిపై నిరంతరం పర్యవేక్షణ



ఉంటుందని ఎమ్మెల్యే సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం కూటమి నాయకులు పాల్గొన్నారు.

# గిడుగు వారి పాలెంలో ఉచిత వైద్య సేవలు

**మామిడికుదురు, మే 23, ( ప్రభాతవార్త ) :** మండలంలోని పెదపట్నంలంక గిడుగువారిపాలెం లో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. హైదరాబాదుకు చెందిన యూనివర్సల్ లైఫ్ స్టైల్ ఆసుపత్రికి చెందిన వి. మురళీధర్,కె.లక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 100 మందికి ఉచితంగా పరీక్షలు చేశారు. కిడ్నీ,లివర్,గుండె, పొట్ట,ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఆరోగ్య సంరక్షణ కొరకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ సుందరనీడి చిన్ని,ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య,మాజీ సర్పంచ్ మామిడిశెట్టి శివరామ ప్రసాద్, గిడుగు వెంకట రామారావు వైద్య శిబిరంలో సేవలందించారు.

# ఎంపీ,ఎమ్మెల్యేల చొరవతో స్వగ్రామం చేరుకున్న మరో గల్ఫ్ బాధితురాలు

**అంబాజీపేట, మే 23, ( ప్రభాతవార్త ) :** జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళుతున్న ఎంతోమంది కార్మికులు అక్కడ ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టాలను పంటి బిగువున భరిస్తూ, అయినవాళ్లకు, కుటుంబానికి దూరంగా వెళ్లి నాలుగు రూపాయల సంపాదించుకోవాలని తాము వచ్చిన విషయాన్ని మర్చిపోకుండా,ఎన్ని ఇబ్బందులు ఎదురైనా భరించే వారు కొందరైతే, భరించలేని ఎంతోమంది కృంగి, కృషించిపోతున్నారు. వీరిలో కొంతమంది సహజంగా తెలివైనవారు, కొంతమంది విద్యావంతులైతే అక్కడ తాము అనుభవిస్తున్న బాధలను,ఇబ్బందులను తమ సెల్ ఫోన్ లతో వీడియో మెసేజ్లు ద్వారా తమ వాళ్లకు సమాచారమందిస్తున్నారు. తమను ఇంటికి తీసుకుపోవాలని లేకుంటే ఇక్కడ భరించలేని,ఉండలేని పరిస్థితి ఏర్పడిందని కన్నీళ్లతో మెసేజ్లు పెడుతున్నారు. ఈ కోవకే చెందిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం తొండవరం గ్రామపంచాయతీ పరిధిలోని సత్యవతి కాలనీకి చెందిన ఉందుర్తి నాగ దుర్గా లక్ష్మి ఒకరు. దుర్గాలక్ష్మి తమ బంధువుల సాయంతో గత ఏడాది ఆగస్టులో ఇంటిలో వంట పని చేసే నిమిత్తం ఖతార్ దేశానికి



వెళ్ళింది. అక్కడ ఒక ఇంటిలో నాలుగు నెలలు పనిచేసి, ఆ ఇంటి యజమాని అనుమతితో ఆమె కుమార్తె ఇంటికి పని కోసం వెళ్ళింది. అక్కడ రెండు నెలలు సాఫీగా గడిచినా అప్పటినుండి నాగ దుర్గా లక్ష్మికి కష్టాలు మొదలయ్యాయి. సమయానికి భోజనం పెట్టకపోవడం, భర్త-పిల్లలు, బంధువులతో ఫోన్లో మాట్లాడనివ్వకపోవడం, కొట్టడం, ఇంట్లో బంధించడం వంటి కష్టాలు మొదలవడంతో కన్నీళ్లు పెట్టుకుంటూ భర్త ప్రశాంత్ కు వీడియో మెసేజ్ ద్వారా తాను పడుతున్న ఇబ్బందులు, ఎదుర్కొంటున్న కష్టాలను తెలియజేసింది. తనను తక్షణమే ఇంటికి తీసుకుపోవాలని లేకుంటే ఇక తాను స్వదేశానికి తిరిగి రాలేనని ఏడుస్తూ చెప్పింది. ఈ విషయం తెలిసిన ఇంటి యజమానురాలు ఫోన్ లాక్కోవడం తోపాటు,ఎట్టి పరిస్థితుల్లోనూ నిన్ను ఇండియాకు పంపించేది లేదని, నీవు వెళ్లాలంటే రూ.1.80 లక్షలు కట్టాలని చెప్పడంతో పాటు మరిన్ని ఇబ్బందులకు గురి చేసిందని నాగ దుర్గాలక్ష్మి కన్నీరు మున్నీరయింది. దీంతో ఆమె భర్త ప్రశాంత్ స్థానిక సర్పంచి పేరాబత్తుల రామలింగరాజు (దొరబాబు), ఉప సర్పంచి దిగుమర్తి చిట్టిబాబుల దృష్టికి తీసుకువెళ్లి, తన భార్య పంపించిన వీడియోను చూపించాడు. తక్షణమే స్పందించిన స్థానిక ప్రజాప్రతినిధులు పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, అమలాపురం పార్లమెంటు సభ్యులు గంటి హరీష్ మాధుర్ ల దృష్టికి తీసుకువెళ్లి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సహకారంతో ఎంపీ హరీష్ మాధుర్ రంగంలోకి దిగారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడ ఇండియన్ ఎంబసీ అధికారులతో చర్చించారు. తక్షణమే నాగ దుర్గాలక్ష్మిని స్వదేశానికి పంపించే ఏర్పాట్లు చేయాలని కోరారు. దీంతో ఈనెల 22 రాత్రి నాగ దుర్గాలక్ష్మి స్వగ్రామంలోని తన ఇంటికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేకు ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

# విభిన్న ప్రతిభావంతుల కు కల్పించే సౌకర్యాలు పై సమావేశం



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 23, ( ప్రభాతవార్త ) :** ఎన్నికలు, విభిన్న ప్రతిభావంతులు, బీసీ సంక్షేమం, విద్యాశాఖ, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల్లో విభిన్న ప్రతిభావంతులకు కల్పించాల్సిన సౌకర్యాలు, విభిన్న ప్రతిభవంతుల ఓటు హక్కు నమోదు వంటి అంశాలపై యాక్సిస్సుబ్ల్ ఎలక్షన్ కమిటీ సమావేశంను డిఆర్ఓ జే వెంకట్రావు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ప్రజలతోపాటు విభిన్న ప్రతిభావంతులకు పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన కనీస సౌకర్యాలు ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 18,710 మంది విభిన్న ప్రతిభావంతుల ఓటర్లు ఉన్నారన్నారు. రానున్న సాధారణ ఎన్నికలు నాటికి వీరి సంఖ్య ఇంకా పెరిగేందుకు అవకాశం ఉన్న నేపథ్యంలో విభిన్న ప్రతిభావంతులు ఓటు హక్కు వినియోగంలో ఎటువంటి ఇబ్బందులు పడకుండా వారికి కావాల్సిన కనీస సౌకర్యాలు ప్రతి పోలింగ్ కేంద్రాల్లోను ఏర్పాటు చేయాలన్నారు. అదేవిధంగా ఓటు నమోదుపై విభిన్న ప్రతిభావంతులకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా బీసీ సంక్షేమాధికారి కె.లల్లి, విభిన్న ప్రతిభవంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ యు.రాజు, మనోవికాస కేంద్రం ప్రతినిధి ఎస్.పీ.రెడ్డి, శాంతి వర్ధన ప్రత్యేక పాఠశాల ఆర్.వీరబాబు, జాతీయ అంధుల సమాఖ్య ప్రతినిధి పీహెచ్.సుబ్బారావు, ఎన్నికల విభాగం డీటీ ఎం. జగన్నాథం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 27 న ప్రముఖ కార్పొరేట్ సంస్థల ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా

**నిరుద్యోగులకు సువర్ణ అవకాశం - మంత్రి సుభాష్**

**కోనసీమ బ్యూరో , మే 23, ( ప్రభాతవార్త ) :** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం 9గంటల30 గంటలకు రామచంద్రపురంలోని ఉపాధిభవన్లో పలు కార్పొరేట్ సంస్థల్లో నియామకాల కోసం జాబ్ మేళా నిర్వహిస్తున్నారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కాంసెంట్రిక్స్, డబ్ల్యూ.ఎన్.ఎస్ , ఫాక్స్ కాన్, హ్యుండై మోబిస్లి తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారు. వైజాగ్ కు చెందిన కాంసెంట్రిక్స్, కంపెనీలలో ఏదైనా డిగ్రీ చేసిన 18 నుండి 27 సంవత్సరాల అభ్యర్థులకు సుమారు రూ.16,000 జీతముతో ప్రాసెస్ అసోసియేట్ ఉద్యోగ అవకాశాలు. బెంగుళూరు కు చెందిన ఫాక్స్ కాన్ కంపెనీలో ఇంటర్, డిగ్రీ చదివిన 18 నుండి 27 సంవత్సరాల స్త్రీ అభ్యర్థులకు రూ.21000 జీతముతో ప్రొడక్షన్ విభాగంలో ఉద్యోగ అవకాశాలు.

# అంకంపాలెం డీపీ ఇన్లెట్ కు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే

**ఆత్రేయపురం, మే 23, ( ప్రభాతవార్త ) :** ఆత్రేయపురం మండలం,కట్టుంగ గ్రామంలో గోదావరి డెల్టా కాలువపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.గన్నవరం కెనాల్ పై కట్టుంగ వద్ద 10 లక్షల వ్యయంతో పునర్మించనున్న అంకంపాలెం డీపీ ఇన్లెట్ కు శంకుస్థాపన చేశారు.అలాగే ఊబలంక గ్రామం వద్ద డెల్టా కెనాల్ వద్ద పునర్మించనున్న కల్వర్ట్ నిర్మాణానికిఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, జుజ్జువరపు శ్రీహరి, దొడ్డపునేని త్రినాథ్,విస్తరణ అధికారి చంద్రశేఖర్, గ్రామస్తులు



కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భీమేశ్వర స్వామి ని దర్శించుకున్న బిఎస్ఎన్ఎల్ సౌత్ ఇండియా జనరల్ మేనేజర్



**సామర్లకోట, మే 23, ( ప్రభాతవార్త ) :** సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి ని గురువారం బిఎస్ఎన్ఎల్ సౌత్ ఇండియా, (ఐ టి సి ) చీఫ్ జనరల్ మేనేజర్ పి మురళీ మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారని ఆలయ కార్య నిర్వహణ అధికారి బళ్ల నీలకంఠం తెలిపారు.స్వామివారి దర్శనం అనంతరం నంది మండపం నందు ఆలయ అధికారి స్వామివారి తీర్ధప్రసాధములు, స్వామి వారి చిత్రపటం అందజేసారు. అనంతరం ఆలయ అర్చకులు,వేద పండితులు వేద ఆశీర్వచనంచేశారు. ఈయన వెంట సామర్లకోట పట్టణ బిఎస్ఎన్ఎల్ అధికారులు, ఆలయ అర్చకులు, వేద పండితులు,ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి గ్రామదర్శిని దోహదం - ఎమ్మెల్యే మద్దిపాటి



**గోపాలపురం , మే 23, ( ప్రభాతవార్త ) :** 'గ్రామదర్శిని' కార్యక్రమం గ్రామాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. గోపాలపురం మండలంలో శుక్రవారం గ్రామదర్శిని కార్యక్రమం ప్రారంభించారు. కరిచర్లగూడెం, గోపాలపురం, జగన్నాధపురం, కరగపాడు తదితర గ్రామాల్లో గ్రామ దర్శని నిర్వహించారు. ఆ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. గోపాలపురం గ్రామంలో రూ.3 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. అదేవిధంగా మిగిలిన గ్రామాల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానన్నారు. ఆపదలో ఉన్న వారికి అవసరమైన నిధులను సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు చేయించడం జరుగుతుందన్నారు. అనతికాలంలోనే అనేక అభివృద్ధి పనులు చేపడుతున్న తనకు ప్రతిఫలంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు విజయాన్నందించి తనకు గిఫ్ట్ గా ఇవ్వాలని ఎమ్మెల్యే కోరారు. సిసి రోడ్లున్నప్పటికీ డ్రైనేజీలు, కల్వర్టులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అదేవిధంగా షాదీఖాన మరామత్తులకు నిధులు ఇస్తానని గతంలో హామీ ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే సభలో గుర్తు చేశారు. అనంతరం పలువురు వద్ద సమస్యల పరిష్కారానికి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రొంగల సత్యనారాయణ, ఏఎంసీ చైర్మన్ యుద్ధనపూడి బ్రహ్మరాజు, జ్యేష్ఠ శ్రీధర్, నున్న వెంకట మోహనరావు, కాకర్ల రామతులసి, గద్దె హరిబాబు, కొర్లపాటి రాము, మద్దిపాటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సత్యదేవ నిత్య అన్నదాన ట్రస్ట్ కు రు. 2,00,116/ విరాళం

**అన్నవరం, మే 23, ( ప్రభాతవార్త ) :** దేవస్థానం లో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుచున్న శ్రీ సత్యదేవ నిత్య అన్నదాన ట్రస్ట్ కు శుక్రవారం విజయవాడకు చెందిన దాతల సాయిబాబు,వెంకట సత్య వాణి దంపతులు శ్రీస్వామి వారి అన్నప్రసాద వితరణకు 2,00,116 రూపాయలు విరాళం దేవస్థానం ఇఓ వీర్ల సుబ్బారావు కు అందజేశారు.ప్రతి ఏడాది జనవరి 1న తమ పేరున అన్నదానము



నిర్వహించాల్సిందిగా వారు కోరారు.

## అంగన్వాడీ కార్యకర్త అక్రమ తొలగింపుతో అంగన్వాడీల నిరసన

శంఖవరం , మే 23, ( ప్రభాతవార్త ) :

శంఖవరంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోగల రౌతులపూడి మండలంలోని రామక్రిష్ణాపురం గ్రామంలో గల అంగన్వాడి కేంద్రంలో కార్యకర్తగా పనిచేస్తున్న ఎం పద్మను అక్రమంగా తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ అంగన్వాడి కార్యకర్తలు తమ నిరసన తెలిపారు. స్థానిక ప్రాజెక్టు కార్యాలయం ఆవరణలో సిడిపిఓకు వ్యతిరేకంగా, కార్యకర్త అక్రమ తొలగింపును విరమించుకోవాలని నినాదాలు చేస్తూ తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు బి రత్నకుమారి మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్త బి సి డి నియామకంలో నాలుగు దఫాల నియామక ప్రకటనలు ఇచ్చినప్పటికీ ఎవ్వరూ రాకపోవడంతోనే ప్రత్యామ్నాయంగా దళిత బిడ్డను అంగన్వాడి కార్యకర్తగా నియమించడం జరిగిందన్నారు. నాటి నుండి నిరంతరంగా కొనసాగుతున్న అంగన్వాడి కార్యకర్త పద్మ దళిత బిడ్డ కావడం ఆమెకు శాపంగా మారిందన్నారు. దళిత బిడ్డపై కక్ష సాధింపు సరైనది కాదని, సిడిపిఓ అక్రమ తొలగింపు నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. 2020లో అప్పటి వరకు పనిచేస్తున్న అంగన్వాడి కార్యకర్తలను కొనసాగించాలని నాటి ప్రభుత్వం జీవో విడుదల చేసిందని, ఇప్పుడు బిసి డి



గా పేర్కొంటున్న వ్యక్తి 2023లో కోర్టుకు వెళితే ఆ 2020లో ప్రభుత్వం జారీచేసిన జీవో కాపీని సిడిపిఓ కోర్టుకు ఎందుకు సమర్పించలేదని అన్నారు. ఈ అక్రమ తొలగింపులో కక్ష సాధింపు,అవినీతి ప్రధాన కారణాలుగా భావిస్తున్నామన్నారు . ఇప్పటికైనా సిడిపిఓ మొండి వైఖరి విడనాడి, పద్మను అంగనవాడి కార్యకర్తగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అంగన్వాడి యూనియన్ జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమానికి శ్రీకారం చుట్టి, దీనికి బాధ్యులపై చర్యలను కోరుతూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ ప్రధాన కార్యదర్శి గెద్దం బుజ్జమ్మ, ఎం సత్యవేణి, సీత, బి అప్పలరాజు, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## ఆదిత్య అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆరిఫ్ కు డాక్టరేట్



గండేపల్లి , మే 23, ( ప్రభాతవార్త ) :

గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఆదిత్య స్కూల్ ఆఫ్ బిజినెస్ నందు అసిస్టెంట్ ప్రొఫెసర్ గా సేవలందిస్తున్న ఆరిఫ్ మహమ్మద్ షేక్ సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కాశ్మీర్ నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పి.హెచ్ డి పట్టా పొందారని డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.ఎం. శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదిత్య యూనివర్సిటీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్న "డా.ఆరిఫ్ ప్రొఫెసర్. ఫయాజ్ అహ్మద్ నిక పర్యవేక్షణలో తాను సమర్పించిన థీసిస్ ఇంపాక్ట్ ఆఫ్ గ్రీన్ హ్యూమన్ రిసోర్స్ మేనేజ్మెంట్ ఆన్ కార్పొరేట్ ఎన్విరాన్మెంటల్ పెర్ఫార్మెన్స్ ఇన్వెస్టిగేటింగ్‌హోది రోల్ ఆఫ్ ప్రో. ఎన్విరాన్మెంటల్ బిహేవియర్. శీర్షిక కు గాను డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. ఈ సందర్భంగా డా. శ్రీనివాస రెడ్డి అభినందనలు తెలియజేస్తూ క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివిన ఆరిఫ్ మహమ్మద్‌హోషేక్ తన విజ్ఞానం విద్యార్థులు మరియు సమాజ అభివృద్ధికి ఉపయోగ పడేలా కృషి చేయాలని భవిష్యత్ లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అన్నారు. "డా.హోఆరిఫ్ మహమ్మద్ షేక్" కి ఆదిత్య విద్యాసంస్థల అధినేత యూనివర్సిటీ ఛాన్సలర్ డా. ఎన్. శేషారెడ్డి,హోప్రో.ఛాన్సలర్ డా. ఎన్. సతీష్ రెడ్డి, వైస్ ఛాన్సలర్ డా. ఎం.బి.శ్రీనివాస్, రిజిస్ట్రార్ డా. జి.సురేష్ ఆదిత్య స్కూల్ ఆఫ్ బిజినెస్ ఉపాధ్యాయ ఉపాధ్యాయేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## కాకినాడ ఆర్టీసీ డిపోలో ఆకస్మిక తనిఖీలు

కాకినాడ టౌన్, మే 23, ( ప్రభాతవార్త ) :

కాకినాడ ఆర్టీసీ డిపోలో డిపిటిఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశం ప్రకారం బస్ స్టేషన్ లో ప్రయాణికులకు సౌకర్యాలు మెరుగు పరచుట కొరకై శుక్రవారం కాకినాడ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం శ్రీనివాసరావు క్యాంటీన్, కార్గో సెక్షన్, స్టాల్స్,టాయిలెట్స్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంటీన్లో టిఫిన్ చేస్తున్న వినియోగదారులను ఆయన ఆ టిఫిన్స్ క్వాలిటీ పై విచారణ చేశారు.. అలాగే కార్గో సెక్షన్ నందు వినియోగదారులను స్వయంగా వారికున్న ఇబ్బందులనుఅడిగి తెలుసుకున్నారు. స్టాల్స్ అన్నిటిలో నిర్ణయించిన ధరల పట్టిక ఉండాలని నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆయన



సూచించారు . ప్రయాణికులకు అందించే సేవల మెరుగు దలపై ఆయన డిపో మేనేజర్ మనోహర్ కి తగు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిపో మేనేజర్ ఎం యు వి మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి బాలకృష్ణ, డి పి టి ఓ ఆఫీస్ అసిస్టెంట్ మేనేజర్ ఎస్ కె ఎం భాష,పిఆర్వో సిహెచ్. వెంకట్ రాజు పాల్గొన్నారు.

## జిల్లాలో బాలికలు, మహిళల రక్షణకై ప్రత్యేక చర్యలు

- జిల్లా ఎస్పిడి. నరసింహా కిషోర్

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 23, ( ప్రభాతవార్త ) :



జిల్లా పోలీస్ కార్యాలయంలో గల కాన్ఫరెన్స్ హాల్ నందు శుక్రవారం జిల్లాలో మహిళలు, బాలికల రక్షణకై తీసుకుంటున్న చర్యల గురించి జిల్లా పోలీసు అధికారులు, శక్తి టీం లతో సమీక్షా సమావేశం నిర్వహించి, శక్తి టీం ల పనితీరును స్వయంగా పరిశీలించి, మెరుగైన పనితీరుకై తగిన సలహాలు, సూచనలు జిల్లా ఎస్పీ డి నరసింహ కిషోర్ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో మహిళల రక్షణకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని, దీనికి అనుగుణంగానే ప్రతి పోలీస్ స్టేషన్లో ఉమెన్ హెల్ప్ డెస్క్, మహిళల ఫిర్యాదు బాక్సులు ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్క మహిళ తమ మొబైల్ ఫోన్లో శక్తి యాప్ నో ఇన్స్టాల్ చేసుకోవాలని, తద్వారా పోలీసు సేవలు 24%%7 మీకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయని, శక్తి యాప్ మహిళలకు రక్షణ కవచంలా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి.ఎం మురళీకృష్ణ , అడిషనల్ ఎస్పీ (లా అండ్ ఆర్డర్) ఏ.వి సుబ్బరాజు,అడిషనల్ ఎస్పీ (క్రైమ్) అల్. అర్జున్ , డి.ఎస్.పి( ఎస్ బి) బి. రామకృష్ణ , డి.ఎస్.పి( మహిళా పిఎస్) కే.వి సత్యనారాయణ, ఇన్స్పెక్టర్ (ఎస్.బి) ఏ. శ్రీనివాసరావు , జోనల్ డీఎస్పీలు, ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు ఇతర అధికారులు మరియు శక్తి టీం సిబ్బంది పాల్గొన్నారు.






## ఎఫెక్స్ ఫ్యాక్టరీని సందర్శించిన అధ్యయన బృందం

కోనసీమ బ్యూరో, మే 23, ( ప్రభాతవార్త ) :

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొబ్బరి క్వాయర్ అధ్యయన బృందం శుక్రవారం కోయంబ త్తూరు సమీపంలోని తిరు పూరు లో కొబ్బరి, క్వాయర్ ఉత్పత్తుల ఎఫ్ ఎక్స్ ఫ్యాక్టరీ ను సందర్శించి స్థానికంగా సుమారుగా 30 ఉత్పత్తుల తయారీ విధానాలను అధ్యయనం చేశారు. ఈ కార్యక్రమం లో ఎఫ్ ఎక్స్ ఫ్యాక్టరీ వ్యవ స్థాపకులు నిర్వాహకులతో సమావేశమై వర్జిన్ కోకోనట్ ఆయిల్ కోకో పీట్, మెస్బాగ్ తదితర 30 ఉత్పత్తుల తయారీ విధానాలను కూలంకశ గా అడిగి తెలుసు కున్నారు. స్థానికంగా ఈ యొక్క ప్రొడక్ట్ విలువ ఆధారిత పరిశ్రమలు ఉపాధి అవకాశాలు మరింత మెరుగు పరచి జీవ నోపాదులు పెంపొందించుటవలన బృందం అభిప్రాయపడింది.

## రేషన్ దుకాణాల ద్వారా నిత్యవసరాలు పంపిణీ చేసేందుకు డీలర్లు సిద్ధం కావాలి

కోనసీమ బ్యూరో, మే 23, ( ప్రభాతవార్త ) :

డాక్టర్ బి. ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అత్యంత పారదర్శకంగా రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీని పునః ప్రారంభించి కార్డుదారులకు నిత్యావసరాలు పంపిణీ చేయాలన్న ప్రభుత్వ నిర్ణయం మేరకు జూన్ 1 నుంచి డీలర్లు రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాలు పంపిణీ చేసేందుకు సన్నద్ధం కావాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిషా%%%తి డీలర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నందు ఎల్పిజి , మరియు రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించి డీలర్ల ద్వారా రేషన్ సరఫరా, దీపం–2 సిలిండర్ ఖరీదు ముందస్తుగానే ఆన్లైన్లో లబ్ధిదారులు ఖాతాకు జమ చేయడం, డెలివరీ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూజూన్ 1న పండగ వాతావరణంలో రేషన్ షాపులను పునః ప్రారంభించాలన్నారు. జిల్లాలో ప్రజా పంపిణీ వ్యవస్థ అందరి సమన్వయంతో ఆదర్శంగా పని చేస్తుందన్నారు. రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని డీలర్లు ఒక సేవా కార్యక్రమంగా మానవసేవ మాధవ సేవగా భావించి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఎల్పిజీ డీలర్లు డెలివరీ సిబ్బంది ద్వారా ఆన్లైన్ చెల్లింపులు నిర్వహించి రసీదులు జారీ చేస్తూ ఆ మేరకే చార్జీలు వసూలు చేసేలా చర్యలు చేపట్టాలని లబ్ధిదారుల నుండి అదనపు చార్జీల అంశస్తులు పేరిట వసూలు చేస్తే చర్యలు గైకొనాలని, లబ్ధిదారుల నుండి ప్రభుత్వం ఆర్టిజిఎస్, ఐవిఆర్ఎస్ వ్యవస్థల ద్వారా ప్రజాభిప్రాయాల సేకరణలో అధిక ధరలు పేరిట అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు వస్తే సహించేది లేదన్నారు. ప్రస్తుతం గ్రామ సచివాలయం ద్వారా కొత్త రేషన్ కార్డులు జారీ, మార్పులు చేర్పులు సంబంధించి విధి విధానాలు అందుబాటులోకి వచ్చా యన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎల్పిజి సిలిండర్ ధరలు ముందుగానే లబ్ధిదారుల ఖాతాకు ఎప్పటికప్పుడు చెల్లించడం జరుగుతుందన్నారు. ప్రక్రియలో సమస్యలు ఉత్పన్నమైనట్లయితే సిబ్బంది పూర్తిగా సహకరిస్తారన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్ళు పైబడి వృద్ధులకు ఇంటి వద్దే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని, పంపిణీలో డీలర్లు అత్యంత పారదర్శకత పాటించాలని సూచించారు. రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి తగు చర్యలు గైకొంటామన్నారు. డీఎస్ఓ ఉదయ భాస్కర్ మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ ప్రక్రియలో కార్డుదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు పూర్తి స్థాయిలో ఈ నెలాఖరు నాటికి ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. రేషన్ దుకాణాల ఆధారిత ప్రజా పంపిణీ వ్యవస్థపై కార్డుదారులకు అవగాహన కల్పించాలన్నారు. రేషన్ దుకాణాలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు పౌర సేవలు అందించాలన్నారు. ప్రజాప్రతినిధులు రేషన్ దుకాణాల ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని, ఇందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. సరైన



- జాన్ కలెక్టర్ నిషాంతి

విధంగా స్టాక్ ను నిర్వహించడం, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడటం, సరైన తూనికలు కొలతలతో కచ్చితత్వంతో నాణ్యమైన సరుకులు పంపిణీ చేయడం, కార్డుదారునికి ఈ-పోస్ రసీట్ అందించడం వంటివి చేయాలన్నారు. ధరలు, స్టాక్ బోర్డులను సరైన విధంగా చౌక ధరల దుకాణాల ముందుభాగ%%%లో స్పష్టంగా కనబడేలా ప్రదర్శించాలన్నారు. ఏదైనా సాంకేతిక సహకారం కావాలంటే టీమ్ లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ-పోస్, వెయింగ్ మెషీన్ల రిపేర్లకు సంబంధించి సర్వీసు క్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందించే సేవల విషయంలో అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా చర్యలు తీసుకుంటోందని, నేరుగా రేషన్ కార్డుదారుల నుంచి అభిప్రాయాలు తీసుకొని, ఎప్పటికప్పుడు విశ్లేషించడం జరుగుతోందన్నారు. ఈ నేపథ్యంలో నిబద్ధతతో రేషన్ దుకాణాలు కార్డు దారులకు సేవలందించాలని, లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేసేలా సరుకుల పంపిణీ విధానాన్ని అమలుచేయాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించిన రేషన్ డీలర్ల పై ప్రజా పంపిణీ వ్యవస్థ నియంత్రణ చట్ట ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా పౌర సరఫరాల మేనేజర్ ఎం.బాల సరస్వతి, ఎల్పిజి డీలర్ల ప్రతినిధి త్రినాథ్, రేషన్ డీలర్ల ప్రతినిధి రమణ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ హాస్టళ్లలో వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 23, ( ప్రభాతవార్త ) :

జిల్లాలోని సంక్షేమ వసతి గృహాలలో అన్ని మౌలిక సౌకర్యాలను కల్పించాలని , స్కూల్స్ ప్రారంభించే నాటికి ఆయా పనులు పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ పి ప్రశాంతి సూచించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ హాస్టళ్లలో , అంగన్వాడీ కేంద్రాలలో వసతుల కల్పన పై , పివిజిటి (గ్రూప్) లకు గృహ నిర్మాణ పనులు చేపట్టడం పై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి ప్రశాంతి మాట్లాడుతూ బడి బయట పిల్లలను గుర్తించి, డ్రాపౌట్ లు ఎక్కువగా గల ప్రాంతాల్లో తిరిగి స్కూల్ లకు వొచ్చేలా వారికి వసతి గృహాలలో సీట్ల కేటాయింపు జరపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందు కోసం ప్రత్యేక డ్రైవ్ లు చేపట్టాలని, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కొవిడ్ సమయం లో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల పై ప్రత్యేక దృష్టి సారించి, వారిని హాస్టల్ లో చేర్పించాలని చెప్పారు. విడాకులు తీసుకున్న, విదేశాలకు వెళ్లిన మహిళ ల పిల్లలు, అనురక్షిత వాతావరణంలో ఉన్న ఆడ పిల్లలు గుర్తించి హాస్టల్ లో చేర్పించాలన్నారు. తక్కువ పిల్లలు ఉన్న వసతి గృహాలను గుర్తించి హేతుబద్దీకరించాలని సూచించారు. అన్ని వసతి గృహాల లో టీవి లు ఏర్పాటు చేయాలని చెప్పారు. వసతి గృహాలలో చేపట్టే పూర్తయిన పనులకు సంబంధించి వినియోగ ధృవీకరణ పత్రం (యుటిలైజేషన్ సర్టిఫికెట్ల) ను ఇవ్వాలని ఆదేశించారు.

**పివిజిటి గ్రూప్ లకు చెందిన సమీక్ష:**

పీఎం - జన్మాన్ పథకం ,హా ఇతర కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న పథకాల సేవల అమలు చేస్తున్న పురోగతిపై కలెక్టర్ పి ప్రశాంతి సమీక్ష నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా లో పి. వి. టి. జి లు గా చెంచు కమ్యూనిటీ కి చెందిన 399 మంది జనాభా ఉన్నారని, వీరందరికి ఆధార్ కార్డు లు , రేషన్ కార్డులు, కుల ధృవీకరణ పత్రం , ఆరోగ్య శ్రీ కార్డులు, ఆయుష్మాన్ కార్డు లు ఉన్నాయా! లేదా! వ్యక్తుల వారీగా సమగ్ర డేటా సేకరణ చేపట్టడం కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలన్నారు. సంబంధిత కార్డు లు లేని వారికి వెంటనే సర్టిఫికెట్లు ఇప్పించేందుకు కావలసిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.హా అర్హత కలిగిన వారికి దివ్యాంగ పింఛన్లు, సదరం ధ్రువపత్రాల జారీకి చర్యలు తీసుకోవాలని , స్వంత ఇంటి నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని,హా ఇళ్ల స్థలాలు లేని వారికి స్థలాలు కేటాయించాలని ఆదేశాలను ఇవ్వడం జరిగింది. బడి ఈడు పిల్లల ను గుర్తించి అందరిని బడిలో చేర్పించాలి అని, అంగన్వాడీ వయస్సు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల కు పంపించే విధంగా చర్యలు , ఒక కిలో మీటర్ లోపు పరిధిలో స్కూల్, అంగన్వాడీ కేంద్రం లేకపోతే అటువంటి హాబిటేషన్ లలో వాటిని నిర్మించేందుకు ప్రతిపాదన లు పంపాలని కలెక్టర్ స్పష్టం చేశారు. యువతను గుర్తించి, వారి ఆసక్తి మేరకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు.

## కోవిడ్ నియమావళితో అప్రమత్తమైన జిజిహెచ్ సూపరింటెండెంట్

కాకినాడ టౌన్, మే 23, ( ప్రభాతవార్త ) :

రాష్ట్ర ప్రభుత్వం కరోనా నియమాలు అమలులోకి తెచ్చిన నేపథ్యంలో కాకినాడలోని ప్రభుత్వ సర్వజన సామాన్య ఆసుపత్రి (జిజిహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ ఎమ్.పి.ఆర్. విఠల్ అప్రమత్తం అయ్యారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న ఇ.ఎన్.టి బ్లాక్ సమీపంలోని కోవిడ్ ఐసోలేషన్ వార్డులను శుక్రవారం సందర్శించి, అక్కడి ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్శనలో ఆయన వెంటిలేటర్లు, బెడ్స్, ఆక్సిజన్ సరఫరా, పి.పి. ఈ. కిట్స్, మాస్కులు, గ్లౌజులు తదితర సదుపాయాల లభ్యతను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూరాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలను అనుసరిస్తూ, జిజిహెచ్ లో ప్రత్యేక కోవిడ్ వార్డులు ఏర్పాటు చేశామన్నారు. రోగుల్ని అప్రమత్తం చేయడానికి అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. రోజుకు దాదాపు పది కోవిడ్ టెస్టులు చేస్తుండగా, హై రిస్క్ గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది.ప్రభుత్వ సూచనల మేరకు ముందస్తు జాగ్రత్తలుగా కోవిడ్ టెస్టింగ్ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లుఆయన తెలిపారు. అయితే కరోనా ముందస్తు హెచ్చరికల నేపథ్యంలో ముందుగా



కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ స్పందించి సుమారు 5 వేల ఎన్ –95 మాస్కులు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు. జిజిహెచ్ యంత్రాంగం కరోనా వైరస్ ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పూర్తిగా సన్నద్ధంగా ఉందని డాక్టర్ విఠల్ స్పష్టం చేశారు.

## వనదుర్గమ్మ ఆలయంలో ఘనంగా చండీ హోమం



అన్నవరం, మే 23, ( ప్రభాతవార్త ) :

రత్నగిరిని కాపాడే దేవతగా పూజలందుకుంటున్న వనదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం చండీ హోమం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుండే ఆలయంలో అమ్మవారికి అర్చక స్వాములు ప్రత్యేక అభిషేకములు, పూజలు నిర్వహించి వివిధ ద్రవ్యాభరణములు, ప్రత్యేక పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ఆలయ మంటపం నందు గల హోమ గుండం వద్ద చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళశ స్థాపన, మండపారాధన, మూలమంత్ర జపములు నిర్వహించి, హోమం అనంతరం ఋత్విక్కులు పవిత్ర ద్రవ్యాలను హోమ గుండంలో సమర్పించి చండీ హోమానికి పూర్ణాహుతి గావించారు. చండీహోమంలో దేవస్థానం ఇఓ వీర్ల సుబ్బారావు దంపతులు, ఛైర్మన్ రాజా ఐవి రోహిత్, భక్తులు పాల్గొని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

## తహసీల్దార్లు క్షేత్రస్థాయి పర్యటనలు తప్పక చేయాలి

- జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 23, ( ప్రభాతవార్త ) :

స్థానిక కలెక్టరేట్లో శుక్రవారం జరిగిన రెవెన్యూ అధికారుల సమావేశంలో జే సి చిన్న రాముడు మాట్లాడుతూమండలాలలో స్థలాలు కేటాయించిన లేఅవుట్లు ఖాళీగా ఉండటానికి, లబ్దిదారులు నిర్మాణాలు చేపట్టక పోవడానికి గల కారణాలను తహసీల్దారులు తెలుసుకోవాలన్నారు. దీనికై లబ్దిదారులతో నేరుగా మాట్లాడాలని సూచించారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయి లో పర్యటించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయని, ఇటువంటి ఘటనలు విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పనితీరు పై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను పాటించకుంటే షోకాజ్ నోటీసు జారీ చేస్తామని హెచ్చరించారు. నీటి పన్ను పూర్తిగా వసూలు అయ్యేలా చూడాలని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని సూచించారు. వివిధ మండలాల్లో ప్రభుత్వ పథకాల అమలు తీరును, ఫిర్యాదులు పరిష్కరిస్తున్న విధానాన్ని ఆయా తహసీల్దారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీతారామమూర్తి , సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణ, ఆర్డీవోలు, తహసీల్దార్ లు, డిప్యూటీ తహసీల్దార్ లు, కలెక్టరేట్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్ బి ఆర్క్ ఫలితాలలో తిరుమల విద్యార్థులు ప్రభంజనం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో, మే 23, ( ప్రభాతవార్త ) :


కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జేఈఈ మెయిన్ బిఆర్క్,బి ప్లాన్ ఫలితాలలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ కాతేరు తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు.బి ఆర్క్ జనరల్ ఈడబ్ల్యూఎస్ విభాగంలో కె యశ్వంత్ సాత్విక్ ఆల్ ఇండియా మొదటి ర్యాంక్,వి రామ సాయి వరుణ్ రెడ్డి నాలుగవ ర్యాంకు సాధించారన్నారు.బి ప్లానింగ్ విభాగంలో వివిధ కేటగిరీలలో జాతీయస్థాయిలో కె యశ్వంత్ సాత్విక్ మూడవ ర్యాంకు,వి రామసాయి వరుణ్ రెడ్డి మూడవ ర్యాంకు, టీ షణ్ముఖ శ్రీనివాస్



24 ర్యాంకు,బి.ఫణీశ్వర్ దొర 63వ ర్యాంకు, వై సాయి తేజ,టి పవన్ శ్రీ కుమార్ చౌదరి 78వ ర్యాంకు,సంకర జోష్ చంద్ 99 వ ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు.ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకాడమీ డైరెక్టర్ జి నరేష్ బాబు,ప్రిన్సిపల్ వి శ్రీహరి లతో కలిసి ఆయన అభినందించారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408.
RNI No.64863/96,"Editor : *Damerla Sai Baba, *Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps

# ముక్కు మీద నలుపు పోయేదెలా?



చర్మ సమస్యలలో బ్లాక్ హెడ్స్ సర్వసాధారణం. అయితే, వీటిని తొలగించుకోకపోతే ముఖం కాంతి విహీనంగా కనిపిస్తుంది. చర్మరంధ్రాల్లో నూనె, మృతకణాలు, ధూళి చేరడం వల్ల ఇవి ఏర్పడతాయి. మరి వీటిని తొలగించుకోవడమెలానో చూద్దామా!

**స్టీమ్ ట్రీట్మెంట్:** బ్లాక్ హెడ్స్ తొలగించడానికి సులువైన మార్గాల్లో ఆవిరిపట్టడం ఒకటి. కనీసం ఐదు నుంచి పదినిమిషాల పాటు ఇలా చేయాలి. ఆపై తడి వస్త్రంతో మృదువుగా తుడిస్తే సరి. బ్లాక్ హెడ్స్ బయటకు వస్తాయి. లేదా వీటిని తొలగించడానికి ప్రత్యేకమైన సాధనం ఉంటుంది. దాన్ని ఉపయోగించి కూడా వీటిని తీయొచ్చు.

**తేనె స్క్రాబ్:** తేనెకు సహజంగా బ్యాక్టీరియల్ గుణాలు ఎక్కువ. దీన్ని ఒక టీస్పూన్ తీసుకుని అందులో కాస్త చక్కెర కలిపి ముఖానికి రాయండి. ఇప్పుడు వేళ్లను తడుపుతూ మృదువుగా స్క్రాబ్ చేసి 10 నిమిషాల తర్వాత కడిగేస్తే సరి. ఇది చర్మాన్ని మృదువుగా మార్చడమే కాదు... బ్లాక్డ్స్‌నై తగ్గుతుంది.

**బేకింగ్ సోడా పేస్ట్:** బేకింగ్ సోడా చర్మంలోని అదనపు నూనెను తొలగిస్తుంది. ఒక టీస్పూన్ బేకింగ్ సోడాలో నీరు కలిపి పేస్ట్ చేయండి. దీన్ని బ్లాకెడ్స్ ఉన్న చోట రాసి 5 నిమిషాలు ఆరనివ్వండి. ఆపై గోరువెచ్చని నీళ్లతో కడిగేస్తే సరి. అయితే, దీన్ని వారానికి ఒకసారి మాత్రమే చేయాలి. ఇలా కొన్నాళ్లు చేస్తే సహజం మస్య దూరమవుతుంది.

**గ్రీన్ టీ మాస్క్:** ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ గుణాలు చర్మాన్ని శుభ్రపరుస్తాయి. వాడేసిన ఈ టీ పొడిని ముఖానికి రాసి 15 నిమిషాలు ఆరనివ్వండి. ఆపై చల్లని నీటితో కడగండి. ఈ మాస్క్ బ్లాక్‌హెడ్స్ తగ్గించడంతో పాటు చర్మానికి తాజాదనం ఇస్తుంది. అయితే, ఇవేవీ పనిచేయనప్పుడు సాలిసిలిక్ యాసిడ్ ఫేస్ వాష్‌ని ఎంచుకోవచ్చు. ఇది చర్మ రంధ్రాలను శుభ్రపరిచి బ్లాక్‌హెడ్స్ తొలగిస్తుంది. గ్లైకాలిక్ యాసిడ్ క్లెన్సర్. చర్మ రంధ్రాల్లో నూనె, దుమ్ము పేరుకోకుండా అడ్డుకుంటుంది. నోస్ స్ట్రిప్స్ మార్కెట్లో దొరుకుతాయి. దాన్ని ముక్కుపై వేసి పదినిమిషాల తర్వాత తీసేస్తే అవి సులువుగా వచ్చేస్తాయి. అప్పటికీ సమస్య తీవ్రంగా ఉంటే సొంతవైద్యం వదిలి చర్మ వైద్యులను సంప్రదించండి. □

# మహిళలే భాగస్వామ్యమైతే..

**ఇంటిని నడిపే ఇల్లాలి చేతికి స్టీరింగ్ ఇస్తే... వ్యవసాయం జీవనాధారంగా బతుకుతున్న వారికి సాంకేతికత పరిచయం చేస్తే... దానిలోనూ మహిళలే భాగస్వామ్యమైతే... ఇలాంటి వినూత్న ఆలోచనలకు వేదికైంది సంగారెడ్డి జిల్లా. క్షేత్ర స్థాయిలో వీటన్నింటినీ ముందుండి నడిపిస్తున్నారు అక్కడి పాలనాధికారి క్రాంతి, కార్యసాధనకోసం ఆమె అనుసరిస్తోన్న ప్రణాళికలు ఆమె మాటల్లోనే...**



"చిన్నప్పట్నుంచీ ఏ పని ప్రారంభించినా... పూర్తయ్యేదాకా వదిలిపెట్టేదాన్ని కాదు. అదే ఈ స్థాయి అధికారిగా నాకు పాలన తెచ్చిపెట్టింది. అయితే, ఈ రంగంలోకి రావడం... అమ్మానాన్నల కోరికతో పాటూ నా అభిలాష కూడా. అమ్మ లక్షి ్మ, నాన్నారెడ్డి. ఇద్దరు డాక్టర్లే. అక్క కూడా ఈ వృత్తిలోనే ఉంది. మాది కర్నూలు. నేను నాలుగో తరగతి చదువుతున్నప్పుడు అమ్మ నాకో మాట చెప్పింది. మహిళగా మనం మంచి స్థానంలో ఉన్నప్పుడే అట్టడుగు స్థాయి వాళ్లకి సాయం చేయగలం అని. నాన్న మాటల్లో ఐఎఎస్ గురించి తెలుసుకన్నా. సివిల్స్ సాధించాలన్న లక్ష్యం అప్పుడు ఏర్పడిందే. అందుకే మెకానికల్ ఇంజినీరింగ్ చేసినా.. రెండుసార్లు ఓటమి ఎదురైనా.. మూడో ప్రయత్నంలో 65వ ర్యాంకు9 సాధించా. ఈ పట్టుదలకు అమ్మే నా స్ఫూర్తి. ఆమె ఎండి చేయాలనుకున్నారు. దానికోసం రాత్రుళ్లు రెండు, మూడు వరకూ చదివింది. లక్ష్యసాధన కోసం కష్టపడటం ఆమె నుంచే నేర్చుకున్నా.

**ప్రోత్సహిస్తే చాలు..** మహిళలు ఏ రంగంలో రాణించాలన్నా.. వాళ్లకి కాస్త ప్రోత్సహం ఇస్తే చాలు. దేనిలో తీసిపోరని నిరూపించుకుంటారు. మహిళా అధికారిణిగా నేనే వాళ్లకు చేయూత అందించకపోతే.. ఇంకెవరు ఇస్తారు. అందుకే నేను పనిచేసే చోట మహిళలు, యువత ఆర్థిక స్వావలంబన కోసం.. మార్గాల్ని వెతుకుతుంటా. ఆడవాళ్లు బయటికి వస్తే చాలు. తిరిగి ఇంటికి వెళ్లేదాకా వాళ్లు ఎలా ఉన్నారో అన్న బెంగే. అందుకే క్యాబ్ డ్రైవర్లుగా ఆడవాళ్లే ఉంటే.. రక్షణ కల్పించొచ్చు అనిపించింది. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా.. 34 మంది మహిళలకు ఇందులో శిక్షణ ఇపించాం. లబ్ధిదారుల ఎంపిక నుంచి.. శిక్షణ, రుణాల మంజూరు, ఉపాధి వరకూ అన్నీ జిల్లా యంత్రాంగమే చూసుకుంది. క్షేత్రస్థాయిలో సమావేశాలు, పంచాయతీ అధికారులు, శిక్షణ కోసం టీచర్లు.. ఇలా ప్రతిదీ సవాలే. అన్నింటకోసం పరుగులు పెట్టాల్సిందే. అప్పుడే ప్రతిఫలాన్ని అందుకోగలం. ఏదైనా పని చేయాలా? వద్దా? అన్న ధర్మసంకటంలో పడితే.. వెంటనే నా భర్త ఆశిష్ సలహా తీసుకుంటా. తనే నా మొదటి గైడ్. ఆయినా కలెక్టరే. కామారెడ్డిలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఎప్పుడైనా ఒత్తిడి అనిపించినా.. ఏకాగ్రత లోపించినా.. ఇష్టమైన పనుల వైపు మనసు మళ్లించుకుంటా. ఇప్పటికీ వారానికోసారైనా టెన్నిస్ ఆడతా.



**డ్రోన్ ఆపరేటర్లుగా...** పంటకు పట్టే చీడపీడల్ని తొలగించ డానికి రసాయనాలు పిచికారీ చేయాలి. ఇలా చేయడానికి ఆధునిక పద్ధతులేమీ అందుబాటులో లేవు. ఉన్నా, అన్నీ ఆర్థికభారంతో కూడుకున్నవే. వీటన్నింటికి పరిష్కారంగా సాంకేతికతను పరిచయం చేయాలనుకున్నాం. 'నమో డ్రోన్ దీదీ' పథకం ద్వారా రాష్ట్రంలోనే తొలిసారి.. మహిళా సంఘాల సభ్యులకు డ్రోన్ ఆపరేటర్లుగా తర్ఫీదు నిప్పించాం. 54 మంది మహిళలకు 9 రోజులు ఈ శిక్షణ కొనసాగింది. క్షేత్రస్థాయిలో ఈ పథకం అందుబాటులోకి వస్తే.. సంప్రదాయ పద్ధతుల్లో రోజంతా చేసే పనిని.. డ్రోన్లు గంటల్లో పూర్తిచేస్తాయి. దీని కొనుగోలుకు రూ.10 లక్షల దాకా ఖర్చవుతుంది. ఇప్పటికే ఆరుగురికి 80 శాతం రాయితీతో కూడిన రుణం అందించాం. మిగతా వారికి గ్రామైక్య సంఘం, మండల సమాఖ్యల ద్వారా బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి రుణాలు ఇప్పించేందుకు ప్రణాళికలు తయారుచేస్తున్నాం. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులతోపాటు సమయం కూడా ఆదా కానుంది. □

# వేసవిలో సౌకర్యంగా ..



అసలే బయట ఎండలు పెరుగుతున్నాయి. ఆఫీసు నుంచి ఇంటికొచ్చి, పనంతా చేసేస్తాం. ఆపై స్నానం చేసి రిలాక్స్ అవుతాం. అందుకు మనం ఎంచుకునేది సాధారనంగా నైటీయే అవుతుంది కదా! కేవలం నిద్రపోయే ముందే కాదు, కొందరు తల్లులు కూడా సౌకర్యంగా ఉంటాయని రోజంతా అవే వేసుకోవాలనుకుంటారు. అలాంటప్పుడు అనుకోకుండా బయటకు వెళ్లాలన్నా, పిల్లల్ని అలా బస్‌దాకా వెళ్లి ఎక్కించి వద్దామన్నా లేదా ఇంటి ముందు మార్కెట్‌కి వెళ్లి అత్యవసరమైన వస్తువుల ఏదైనా తీసుకొద్దామన్నా ఈ నైటీతో బయటకి వెళ్లడానికి సంకోచం. అలా అని ప్రతిసారీ అవసరం వచ్చినప్పుడు డ్రెస్ మార్చుకోవాలంటే సమయం వృథానే కదా. పైగా సాధారణ నైటీలతో వచ్చే చిక్కేంటంటే పైనుంచి కిందకి ఒకేలా ఉండి చూడడానికి కొంచెం ఎబ్బెట్టుగా ఉంటాయి. ఇలాంటి ఇబ్బందులేమీ లేకుండా త్రీ ఫోర్త్, అంతకంటే తక్కువ లెంత్‌లో కూడా చూడడానికి గౌనులా ఉండే నైట్‌వేర్‌లు ప్రస్తుతం మార్కెట్లోకి వచ్చేశాయి. బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు ఓ లెగ్గింగ్ వేసుకోవచ్చు. క్రేప్, కాటన్, శాటిన్, సిల్క్, రేయాన్. లాంటి ఎన్నో రకాల్లో అందుబాటులో ఉంటున్నాయి. తక్కువ బరువుతో, అచ్చం డ్రెస్సుల్లానే ఉండే ఈ నైట్‌వేర్‌లు ఇప్పుడు ట్రెండ్ అవుతున్నాయి. సౌకర్యంగా ఉండడంతోపాటు మంచి లుక్‌నీ ఇస్తాయివి. నాచ్చయా ఆన్‌లైన్లో వెతికేయండి.











# మేలు చేసే మల్బరీ



మల్బరీ పండ్లు.. వీటినే బొంతపండ్లు అనికూడా అంటారు. ఇవి నలుపు, ఎరుపు, తెలుపు రంగుల్లో ఉంటాయి. ఈ పండ్లలో ఆరోగ్యానికి మేలు చేసే ఫైటోన్యూట్రియంట్లు ఎక్కువ. అలానే, విటమిన్లు బి 1,2,3, సి,ఇ,కెతో పాటు పొటాషియం, జింక్ దీన్నుంచి తగినంతగా శరీరానికి అందుతాయి.

✦ వీటిలో జీర్ణక్రియను మెరుగుపరిచే పీచు సమృద్ధిగా ఉంటుంది. ఇది పేగు కదలికను సులభతరం చేస్తుంది. జీర్ణసంబంధిత వ్యాధులతో బాదపడే వారు రోజువారీ ఆహారంలో నీటిని చేర్చుకుంటే ఉపశమనం ఉంటుంది.

✦ మల్బరీల్లో ఉండే పీచు బరువుని తగ్గిస్తుంది. క్యాన్సర్ కణాలను నిర్మూలించే ఆంతో సైనిన్‌లు ఇందులో పుష్కలంగా ఉండి పెద్దపేగు, చర్మ, పొస్టేట్ క్యాన్సర్లను దరిచేరనివ్వవు.

✦. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రక్తనాళాల పనితీరుని మెరుగు పరుస్తాయి. దీంతో గుండె, ఇతర శరీర భాగాలకి రక్తప్రసరణ సరిగ్గా జరిగి రక్తపోటు అదుపులో ఉంటుంది. ఐరన్ శాతం ఎక్కువగా ఉండటం వల్ల ఎర్రరక్తకణాలూ వృద్ధి చెందుతాయి.

✦ రోగనిరోధకశక్తిని మెరుగు పరచడంలోనూ మల్బరీలు ప్రధానపాత్ర పోషిస్తాయి. వీటిలో ఉండే విటమిన్-సి ఇన్‌ఫెక్షన్లను దరిచేరనీయదు.

✦విటమిన్-కె, కాల్షియం, ఐరన్ పోషకాలు ఎముకలు గుల్లబారకుండా కాపాడతాయి. □

**చెలి చిట్కా**

బతానీలను ఎనిమిది గంటల పాటు నానబెడితే రెండు రెట్లు విటమిన్లు పెరుగుతాయి. □

# మిలియరీ టి.బి

**ఆరోగ్య భాగ్యం**




డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

ఇది క్షయవ్యాధి యొక్క ఒక రూపం. ఇది ప్రాణాంతకమైన క్షయవ్యాధి. ఇది ప్రైమరీ ఇన్ఫెక్షన్ సోకిన కొన్నివారాలకి వస్తుంది. పెద్ద సంఖ్యలో బ్యాక్టీరియా రక్తంలో, లింఫ్ ద్వారా ప్రయాణించి శరీరమంతటా వ్యాపించినపుడు వస్తుంది. ఇది అనేక అవయవాల్ని ప్రభావితం చేయడం వల్ల దీన్ని డిసెమినేటెడ్ టి.బి. అని అంటారు. ఇది జనరలైజ్డ్ మాసివ్ ఇన్ఫెక్షన్ అని అంటారు. ఇది అన్ కంట్రోలబుల్ ట్యూబర్క్యులోసిస్. ఇది ఊపిరితిత్తులోని అల్వియోలార్ కణాలు దెబ్బతినడం వల్ల మానక్రోఫేజ్‌లతో చుట్టబడి గ్రాన్యులోమాని ఏర్పరుస్తాయి. ఇవి చిన్నచిన్న మిల్లెట్ గింజల మాదిరి ఉండడం వల్ల దీనికి మిలియరీ ట్యూబర్క్యులోసిస్ అని పేరు వచ్చింది. ఇది లాటిన్ పదం మిలియారియస్ నుండి వచ్చింది. 1700లో జాన్ జాకబ్ మాంగెటనఅనే శాస్త్రవేత్త మెదట దీన్ని గుర్తించడమైనది. ఇది అంటువ్యాధి అని చెప్పవచున ఇవి ఆక్టివ్, విసరల్, కేషియస్ ట్యూబర్కుల్స్ లేదా నోడ్యుల్స్ అని చెప్పవచ్చు. ఇది లివర్ (40%), లంగ్స్ (70%), ప్లీహం (15%) క్లోమం (5%) కిడ్నీ, ఎడ్రినల్ గ్రంథులు, ఎముక యజ్జ, పెరికార్డి యం, కండ్లు, కేంద్రీయ నాడీ మండలం, లింఫాటిక్ సిస్టమ్ వంటి అవయవాల్ని ఎఫెక్ట్ చేస్తుంది. దీన్నే క్షయవ్యాధి క్యూటిస్, అక్యుటా జెనరలిసాటా, క్షయవ్యాధి క్యుటిస్ డిస్సెమినాటా అని కూడా అంటారు. ఇది పల్మోనరీ కేసుల్లో 2%, ఎక్స్‌ట్రా పల్మోపరీ కేసుల్లో 20% వ్యాప్తి చెందిన క్షయవ్యాధి ఇది 10-30% పెద్దలు, 20-40% పిల్లల్లో వస్తుంది.

**కారణాలు :** హెచ్ఐవి పోషకాహారలోపం, అపరిశుభ్రత. రోగనిరోధక వ్యవస్థ సరిగా పనిచేయని వ్యక్తుల్లో ఇది సర్వసాధారణం దీన్నే 'ఇమ్యూనోకాంప్రమైజ్' అంటారు. రక్తం, లింఫ్‌లో వేల సంఖ్యలో ట్యూబర్కుల్ బాసిల్లై గ్రాన్యులోమాటస్ రియాక్షన్‌ను కల్గి ఉంటాయి. దీనివల్ల ఊపిరితిత్తుల గాయాలు గ్రాన్యులోమాటస్ లోని మాక్రోఫాజ్‌లు మరియు లింఫోసైట్స్ కేసియస్ నెక్రోసిస్‌తో లేదా లేకుండా ఉంటాయి. ఇది టి.బి. కాంప్లికేషన్ వల్ల వస్తుంది. ఇది స్త్రీలలోకన్నా పురుషుల్లోనే ఎక్కువగా వస్తుంది.

**వ్యాధి లక్షణాలు :** నీరసం, ఆయాసం, జ్వరం, రాత్రిళ్ళు చెమలు కారడం, కడుపునొప్పి, రక్తంతో కఫం రావడం తలనొప్పి ఆకలి తగ్గడం, లింఫ్ గ్రంథుల వాపు, జలోదరం, ఫ్లూర్లల్ ఎఫ్యూజన్. జ్వరం ఉదయాన ఎక్కువగా రావడం ఉంటుంది. వ్యక్తిత్వంలో మార్పు, మెంటల్ ఛేంజ్స్ రావడం వంటి వ్యాధి



లక్షణాలుంటాయి. రక్తహీనతతో పాలిపోయి ఉంటారు.

**పిల్లలు :** విరేచనాలు, వాంతులు, ఫిట్స్, తలనొప్పి, జాండీస్, మెడ బిగదీయడం, వెలుతుర్ని చూడలేక పోవడం లివర్, స్ప్లీన్ వాపు రావడం, పోషకాహారలోపం, బరువు తగ్గడం, దగ్గు, ఆయాసం జ్వరం, రాత్రిళ్ళు చెమటలు పట్టడం వంటి వ్యాధి లక్షణాలుంటాయి. కొందరిలో జ్వరం ఉండదు. కాని శరీరం శుషించిపోయి మెటస్టాటిక్ కార్సి నోమాలాగా ఉంటుంది. దీన్ని క్రిప్టిక్ మిలియరీ టి.బి. అని అంటారు. ఇది ముసలివారిలోలో ఎక్కువగా కన్పిస్తుంది. క్లినికల్‌గా వ్యాధి తీవ్రతను బట్టి రెండు రకాలుగా ఉంటుంది. □

# శని త్రయోదశి



భూమిపై, అక్కడ నివసించే జీవజాలం పై నవగ్రహాల ప్రభావం ఎప్పుడూ వుంటుంది. అన్ని గ్రహాలలోకీ ముఖ్యంగా శనిగ్రహానికి భయపడని మనిషి వుండరు. ఎందుకంటే శని యొక్క ప్రతికూల దృష్టికి వున్న శక్తి అటువంటిది కనుక.సూర్యభగవానుడు, ఛాయాదేవికి కలిగిన పుత్రుడే శని. యమధర్మరాజు, యమునలకు అగ్రజుడు. వారములలో శనివారం ఏడవది కనుక ఆయనకు ఏడు సంఖ్య అంటే ప్రీతి. ఆయన వాహనం కాకి. శని వల మాత్రమే కాక, మనిషికి కర్మానుసారంగా కూడా కష్టాలు ప్రాప్తిస్తాయి. దానిని ధర్మబద్ధంగా అమలుచేసే వాడు ఆయన. ప్రకోపిస్తే నానా యాతనల పాలుచేయటమేకాక, కరుణించిన వాళ్ళను అందలమెక్కించే శ్రేయోభిలాషి కూడా అవుతాడని చెప్తాయి. నువ్వులు, నల్లవస్త్రం, నీలం, ఇనుము, బద్దకం, అపతిశుభ్రత అన్నవి శనికి నిలయాలు. శని మహత్మంలో బృహస్పతి, దేవతలు, ఋషులు శని ప్రభావం వల్ల పడిన ఇబ్బందుల గురించీ వర్ణింపబడింది. పార్వతీదేవి నలుగు పిండికి ప్రాణంపోసి వినాయకోద్భవం జరిగినపుడు సకల దేవతలూ ఆశీర్వదించగా, శనిదేవుడు తల ఎత్తి చూడలేదని ఆమె కోపగించుకుంది. విధిలేక ఆయన చూసినందువల్లే మానవ రూపంలోని తలను కోల్పోవలసి వచ్చిందని 'బ్రహ్మవైవర్త పురాణం'లో చెప్పబడింది. విక్రమాదిత్య మహారాజుకూడా శనిగ్రహ పీడితుడే.అయితే, ఇందరిపై ప్రభావాన్ని నిరాటంకంగా చూపగలిగిన శని హనుమంతుని విషయంలో వెనుకడుగు వేయక తప్పలేదు. యధాప్రకారం ఆయననూ పట్టి పీడించాలని ప్రయత్నించగా ఆయన అమాంతంగా పెరిగిపోయి విదిలించి కొట్టాడట. సూర్యదేవుడు అదిచూసి హనుమంతుని భక్తితో పూజించిన వారికి శనిబాధలుండవనీ దీవించాడట. శనేశ్వరుడు స్వయంభుగా వెలసిన క్షేత్రం శని శింగణాపూర్. అహమద్ నగర్ జిల్లాలో వుంది. ఈ స్థల పురాణం ప్రకారం ఒకరోజు గొర్రెలకాపరి నేలను త్రవ్వుతుండగా ఆ ఇనుపచువ్వ ఒక రాయికి తగిలి రక్తం వచ్చిందట. అతని కలలోనే శనిదేవుడు కనిపించి తానే అక్కడ వెలసానని, నిత్యపూజలు, శనివారం తైలాభిషేకం చేయించాలని చెప్పారట. అంతే కాకుండా, తనకు ఎలాంటి గుడులూ కట్టకుండా అలా బహిరంగ దేశంలోనే వుంచమని చెప్పి, ఆ ఊళ్ళో దొంగ తనాలు, దోపిడీలు జరగకుండా చూస్తానని వరం ప్రసాదించాడట. అందుకే, ఇప్పటికీ అక్క ఎవరింటికీ, షాపులకీ, కార్యాలయాలకూ తలుపులు వుండవు. శనేశ్వరునికున్న అతికొద్ది క్షేత్రాలలో ముంబైలోని దేవనార్, కర్ణాటక రాష్ట్రం లోని పావగడ మరియు తూర్పు గోదావరి జిల్లాలోని మందపల్లి ముఖ్యమైనవి. శని త్రయోదశి రోజున నువ్వులనూనె, బొగ్గులు, నల్ల వస్త్రం, ఇనుము, నవధాన్యాలు ఒక నల్లటి బట్టలో కట్టి దానమివ్వాలి. లేదా పారే నీటిలో వదలాలి. కాకికి ఆహారం పెట్టడం, పేదవారికి నల్లని వస్త్రదానం చేయటం మంచిది. శనివారం రోజున ఎటువంటి నూనెలుగానీ, తోలు సంబంధ వస్తువులు, గొడుగు, నవధాన్యాలను గానీ కొనకపోవటం చేయాలి. ఏ రాశి వాళ్ళయినా శని ప్రతికూలంగా వుంటే, లేదా ఏలినాటి శని దశ నడుస్తుంటే అష్టకష్టాలు పడతారు. కాబట్టి, శని యొక్క అనుకూల దృష్టికోసం శని త్రయోదశీ పూజ వలన శనిదేవుని ప్రసన్నం చేసుకోవటానికి తోడ్పడుతుంది. ఉపవాసంతో 108 సార్లు శనేశ్వర మంత్రాన్ని జపించి శుభానుగ్రహం పొందగలరు.

**- దేగల అనితాసూరి,**

ఆధ్యాత్మికం

# పని సులువు చేసే గ్లిజరిన్ !

గ్లిజరిన్‌నే గ్లిజరాల్ అని కూడా పిలుస్తారు. కూరగాయల నూనెలు, జంతువుల కొవ్వుల నుంచి తీసే నేచురల్ కాంపౌండ్ ఇది. పారదర్శకంగా ఉండే ఈ ద్రవానికి రంగూ, వాసనా ఉండదు. రుచిలో మాత్రం తియ్యగా ఉంటుంది. మరి దీంతో చాలా రకాల ప్రయోజనాలే ఉన్నాయట. అవేంటో తెలుసుకుందామా !

అయితే, డబ్బులు, పెట్టి హ్యాండ్‌వాష్ కొనేబదులు మీరే దాన్ని గ్లిజరిన్ సాయంతో తయారు చేయండి. మనం స్నానం చేయడానికి వాడే సబ్బు అరిగిపోయి చివర్లో చిన్న చిన్న ముక్కలుగా మిగిలిపోతుంది. వాటిని పారేయకుండా సేకరించి ఓ డబ్బాలో వేయండి. అందులో కాసిన్ని నీళ్ల ఐదారు చుక్కల గ్లిజరిన్, రెండు చుక్కల లావెండర్ నూనె జతచేస్తే సరి హ్యాండ్ వాష్ సిద్ధమైపోయినట్లే.

✪ గ్లిజరిన్‌ని ఎక్కువగా బేబీ ప్రొడక్ట్స్‌లో వాడతారు. ఇది చర్మాన్నీ, జుట్టునీ మృదువుగా మారుస్తుంది. అంతేకాదు ఫేషియల్ క్లీనర్‌గానూ, తేమనందించే టోనర్‌గానూ ఉపయోగపడుతుంది.

✪. తాళంచెవి సరిగా పనిచేయపోయినా, డబ్బాల మూతలు ఓ పట్టాన రాకపోయినా, చేతులకు గాజులు ఎక్కకపోయినా నూనె రాయడం సహజమే. దానికి బదులుగా ఈ సారి కాస్త గ్లిజరిన్ ప్రయత్నించండి. ఏ మాత్రం జిడ్డు లేకుండానే మీ పని ఎంత సులువుగా అయిపోతుందో చూడండి.

✪ పూల పరిమళాలు ఆహ్లాదాన్నిపంచుతాయి. అలంకరణలో కనువిందు చేస్తాయి. మరి ఇవి ఎక్కువ సేపు తాజాగా ఉండాలంటే మాత్రం వాటిని ఉంచే నీళ్లల్లో రెండు చుక్కల గ్లిజరిన్ కలిపి చూడండి. □



✪. మేకప్‌ని తొలగించడానికి కఠిన రసాయనాలున్న రిమూవర్లకు బదులుగా గ్లిజరిన్ వాడొచ్చు. ఇది సులువుగా తొలగించడమే కాదు. చర్మాన్నీ పొడిబార న్వదు. ✪ పని చేశాక తరచూ చేతుల్ని శుభ్రపరచుకోవడం తప్పనిసరి.

# సెలవుల్లో సరదాగా..

వేసవి సెలవులు మొదలైన నాటి నుంచి జరిగే ప్రతి విషయమూ పిల్లలకెంతో నచ్చుతుంది. ఎన్నో మధుర అనుభూతుల్ని అందిస్తుంది. వాటిని పదిలంగా భద్రపర్చుకునే అవకాశం ఇవ్వండి. వారికి నచ్చేవన్నీ పొందుపరుస్తూ ఓ చక్కని స్క్రాప్ బుక్ తయారు చేసుకోనివ్వండి. కెమెరాలో నచ్చిన ప్రదేశాలూ, వస్తువులూ, వ్యక్తులను బంధించి.. వాటి కాపీలను అందులో జత చేస్తూ మనసు చెప్పినట్లు రాయనివ్వండి. ఎంత ఉత్సాహంగా చేస్తారో మీరే చూడొచ్చు. ఈ పని వారి సమయాన్ని చక్కగా సద్వినియోగం చేస్తుంది. చిన్నారుల ఊహలకూ, ఆలోచనలకూ ఊతం ఇస్తుంది. బంధాలనూ, చక్కగా వ్యక్తపరిచేందుకు తోడ్పడుతుంది. □



# 'థగ్ లైఫ్' నాయకుడు కంటే బిగ్గర్ హిట్ అవుతుంది: కమల్

**ఈ సంవత్సరం** భారత సినీప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమాల్లో 'థగ్ లైఫ్' ఒకటి. కమల్ హాసన్ హీరోగా, లెజెండరీ దర్శకుడు మణిరత్నం దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ హైఓక్టేన్ గ్యాంగ్‌స్టర్ డ్రామా జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. త్రిష, శింబు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా నుంచి ఇప్పటికే విడుదలై ప్రమోషనల్ కంటెంట్



నేషనల్ వైడ్‌గా సెన్‌సేషన్ క్రియేట్ చేసింది. హీరో నితిన్ ఫాదర్ ఎన్ సుధాకర్ రెడ్డి శ్రేష్ఠ మూవీస్ ద్వారా ఈ సినిమా తెలుగులో విడుదల కానుంది. గతంలో విక్రమ్, అమరన్ లాంటి బ్లాక్‌బస్టర్లు అందించిన ఈ సంస్థ ఇప్పుడు 'థగ్ లైఫ్' భారీగా విడుదల చేయబోతోంది. ఈ రోజు మేకర్స్ మీడియా మీట్ నిర్వహించారు.

మీడియా మీట్‌లో యూనివర్సల్ హీరో కమల్ హాసన్ మాట్లాడుతూ, ఒక దర్శకుడిగా మణిరత్నం 'నాయకుడు' సినిమాతో ఎలా అయితే అందరినీ సర్ప్రైజ్ చేశారో.. థగ్ లైఫ్‌తో కూడ ఆయన ఆడియన్స్‌ని సర్ప్రైజ్ చేయబోతున్నారు.నేను మణిరత్నం సినిమాలో యాక్ట్ చేయను, జస్ట్ బిహేవ్ చేస్తాను. మేమంతా సినిమా అభిమానులం. సినిమాని ఎప్పుడు కూడా భుజాలపై మోస్తాం. నాజర్ ఆల్‌రౌండర్. మేము ఎప్పటినుంచో జర్నీ చేస్తున్నాం. ఇంద్రుడు చంద్రుడు సినిమాకి తనికెళ్ల భరణి రాయాల్సింది. కానీ అది కుదరలేదు. ఆయనతో కలిసి మరింత ప్రయాణం చేయాలని ఉంది. ఆయన ఇంకా ఎక్కువ రాయాలని కోరుకుంటున్నాను. శింబు చైల్డ్ వుడ్ నుంచి నేను తన సినిమాలు చూస్తూ ఉన్నాను. నేను కూడా చైల్డ్ యాక్టర్ నుంచి జర్నీ స్టార్ట్ చేశాను. అందుకే మేము ఎంతో కనెక్ట్ అయ్యాం.ఇంత మంచి సినిమా మళ్ళీ మళ్ళీ రాదు. అందుకే నా శక్తి వంచన లేకుండా ప్రమోట్ చేయడానికి ప్రయత్నం చేస్తున్నాను. జూన్ 5న సినిమా వస్తోంది. చాలా ప్రేమతో చేసిన సినిమా ఇది. సినిమా చూసిన తర్వాత మరింత గొప్పగా సెలబ్రేట్ చేసుకుందాం అన్నారు.

డైరెక్టర్ మణిరత్నం మాట్లాడుతూ, కమలహాసన్‌తో ఫస్ట్ టైం కలిసి నాయకుడు సినిమా చేశాను. మౌనరాగం సినిమా పూర్తయిన తర్వాత నిర్మాత ముక్తా శ్రీనివాసన్ వచ్చి ఒక క్యాసెట్ చేతిలో పెట్టారు. అది ఒక హిందీ సినిమా. ఆ సినిమాని తమిళ్లో చేయాలని చెప్పారు. నాకు రీమేక్ చేసే ఉద్దేశంలేదు. అయితే ఇదే మాట కమలహాసన్ గారితో చెప్పమన్నారు. నేను వెళ్లి ఆయనకు అదే చెప్పాను. అయితే నువ్వేం చేయాలనుకుంటున్నావో ఆ సినిమా చేద్దామన్న అని చెప్పారు. అలా నాయకుడు సినిమా వచ్చింది. ఈ సినిమా కూడా అలానే జరిగింది. కాల్ చేసి ఇద్దరం కలిసి ఒక సినిమా చేద్దామని చెప్పారు. అలా ఈ సినిమా జర్నీ మొదలైంది అన్నారు.

హీరో శింబు మాట్లాడుతూ, తెలుగు ఆడియన్స్ నాకు చాలా స్పెషల్. నా బిగినింగ్ కెరియర్లో మన్మధ సినిమాకి తెలుగు ఆడియన్స్ నుంచి వచ్చిన రెస్పాన్స్ మర్చిపోలేను. ఒజి సాంగ్ కూడా త్వరలో రాబోతుంది.థాంక్యూ సోమచ్ మణిరత్నం ఆయన క్రమ శిక్షణ, టైమింగ్ అద్భుతం. కమల్‌తో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్పీరియన్స్ అన్నారు. సుహాసిని మణిరత్నం మాట్లాడుతూ, ద బెస్ట్‌టాలెంట్ కలిసి ఒక సినిమాతో మీ ముందుకు వస్తున్నారు. ప్రేక్షకుల మీద చాలా ప్రేమతో చేసిన సినిమా ఇది. ఆడియన్స్ కూడా అంత గొప్పగా ఆదరిస్తారని నమ్మకం ఉంది. సినిమాలో అందరూ అదరగొట్టేసారు. ఈ సినిమా కోసం మీలానే జూన్ ఫిఫ్త్ కోసం ఒక ఆడియన్ లాగా ఎదురుచూస్తున్నాను. హీరోయిన్ త్రిష మాట్లాడుతూ, నాకు హైదరాబాద్ సెకండ్ హోమ్ ఇక్కడికి ఎప్పుడువచ్చినా చాలా ఆనందంగా ఉంటుంది. మణిరత్నం, కమలహాసన్‌తో కలిసి వర్క్ చేసే అవకాశంరావడం గొప్పఅదృష్టంగా భావిస్తున్నాను. తప్పకుండా ఈ సినిమా మీ అందరిని అలరిస్తుంది అన్నారు.

# హారర్ సస్పెన్స్ థ్రిల్లర్ 'ఘటికాచలం'

**నిఖిల్ దేవా దుల** హీరోగా నటిస్తున్న సినిమా 'ఘటికాచలం'. ఈ చిత్రానికి కథను అందిస్తూ ఒయాసిస్ ఎంటర్ టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు ప్రొడ్యూసర్ ఎం.సి.రాజు. 'ఘటికాచలం' చిత్రాన్ని ఇంటెన్స్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిస్తున్నారు దర్శకుడు అమర్ కామెపల్లి. ఈ సినిమాను మాస్ మూవీ మేకర్స్ పై ప్రముఖ దర్శకుడు మారుతి, సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ రిలీజ్ చేస్తున్నారు. ఈ నెల 31 "ఘటికాచలం' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా ట్రైలర్‌ను హైదరాబాద్‌లో లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో నటుడు రంగధామ్ మాట్లాడుతూ, 'ఘటికాచలం' చిత్రంలో నేను చిన్న రోల్ చేశాను. ఈ చిత్రంలో నటించే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ అమర్‌కి థ్యాంక్స్. మా చిత్రాన్ని మారుతి, ఎస్ కేఎన్ రిలీజ్ చేయడం సంతోషంగా ఉంది అన్నారు.నటుడు జోగి నాయుడు మాట్లాడుతూ, 'ఘటికాచలం' మంచి కంటెంట్ ఉన్న సినిమా. కంటెంట్ బాగున్న చిత్రాలను తెలుగు ఆడియెన్స్ తప్పకుండా ఆదరిస్తారు. ఈ చిత్రంలో నేనొక చిన్న రోల్ చేశాను. ఈ నెల 31న థియేట్రికల్ రిలీజ్‌కు వస్తున్న 'ఘటికాచలం' చిత్రాన్ని మీరంతా సక్సెస్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. నటుడు షాన్ మాట్లాడుతూ, 'ఘటికాచలం' సినిమాలో మంచి క్యారెక్టర్ చేశాను. ఈ



సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన డైరెక్టర్ అమర్‌కి థ్యాంక్స్. అన్నారు. డైరెక్టర్ అమర్ కామేపల్లి మాట్లాడుతూ హారర్ మూవీస్ ఇష్టం లేదనే సరైన హారర్ మూవీ చూడలేదని అనుకుంటాను. 'ఘటికా చలం' సినిమా టెక్నికల్‌గా హై క్వాలిటీతో ఉంటుంది. ప్రొడ్యూసర్ రాజుగారు ఇచ్చిన కథలో మంచి నావెల్టీఉంది. ఆ నావెల్టీనే టెక్నికల్‌గా హై క్వాలిటీతో మూవీచేసేందుకు స్ఫూర్తినిచ్చింది. డీవోపీ మనోజ్, ఇటాలియన్ మ్యూజిక్ డైరెక్టర్ ఫ్లేవియో..ఇలా మా టెక్నీషియన్స్ అందరూ సినిమాను ఎంతో క్రియేటివ్‌గా తీర్చిదిద్దారు. ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్స్‌కు మా చిత్రాన్ని పంపించాలని ప్రయత్నించాం. అయితే ముందు మన ఆడియెన్స్‌కు రీచ్ చేస్తే బాగుంటుంది అనిపించింది. ప్రొడ్యూసర్ ఎస్ కేన్ గారు, డైరెక్టర్ మారుతి ద్వారా "ఘటికాచలం' సినిమా గ్రాండ్‌గా రిలీజ్ కు వస్తుండటం సంతోషంగాఉంది. 'ఘటికాచలం' సినిమాను ప్రేక్షకులు తప్ప కుండా ఆదరిస్తారని నమ్ముతున్నాం అన్నారు.

హీరో నిఖిల్ దేవాదుల మాట్లాడుతూ నేను చైల్డ్ ఆర్టిస్టుగా 70 సినిమాల వరకు చేశాను. ఇది హీరోగా నా మొదటి మూవీ.ఈ క్యారెక్టర్ నాకు ఛాలెంజింగ్ గా అనిపించింది. మా మూవీ టీజర్‌ను లైక్ చేశారు. ఇప్పుడు ట్రైలర్ కూడా మీకు నచ్చుతుందని ఆశిస్తున్నాం. "ఘటికాచలం' సినిమాను ఈ నెల 31న థియేటర్స్‌లో చూసి సపోర్ట్ చేయాలని కోరుతున్నా. అన్నారు. ప్రొడ్యూసర్ ఎస్ కేఎన్ మాట్లా డుతూ "ఘటికాచలం' సినిమాను మారుతి చూసి బాగుందని చెబితే నేనూ చూశాను. ఈ సినిమాకు ప్రొడ్యూసర్ రాజు గారు మంచి స్టోరీ ఇచ్చారు. 31న "ఘటికా చలం' థియేటర్స్ లోకివస్తోంది. అన్నారు.

# 'ఉస్తాద్ భగత్ సింగ్' షూటింగ్ జూన్‌లో ప్రారంభం

**మోస్ట్ సక్సెస్ ఫుల్** కాంబినేషన్ పవర్ స్టార్ పవన్ కల్యాణ్, బ్లాక్ బస్టర్ డైరెక్టర్ హరీష్ శంకర్ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఉస్తాద్ భగత్ సింగ్' జూన్ నుంచి రెగ్యులర్ షూట్ ప్రారంభం కానుంది. మైత్రీ మూవీ మేకర్స్‌పై నవీన్ యెర్నేని, వై. రవి శంకర్ భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది కంప్లీట్ రీలోడెడ్, రీ ఇమాజిన్డ్ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది.పవన్ కల్యాణ్ పూర్తి స్థాయి కమర్షియల్ మాస్ అవతార్‌లో అలరించబోతున్నారు. ఇది



అభిమానులకే కాదు, యావత్ ప్రేక్షకులకు హైఓక్టేన్ కథనంతో గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఆశుతోష్ రానా, నవాబ్ షా, కేజీఎఫ్ ఫేమ్ అవినాష్, గౌతమి, నాగ మహేశ్, టెంపర్ వంశీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతాన్ని అందిస్తున్నారు, యంగ్ డైనమైట్ ఉజ్వల్ కుల్కర్ణి ఎడిటర్. రామ్‌లక్ష్మణ్ మాస్టర్స్ యాక్షన్ సన్నివేశాలను కొరియోగ్రాఫ్ చేస్తున్నారు.

# 'థాంక్యూ డియర్' ఫస్ట్ లుక్ లాంచ్!

**టాలీవుడ్‌లో యువ కథానాయకుడు** ధనుష్ రఘుముద్రి నటించిన 'థాంక్ యూ డియర్' చిత్రం ఫస్ట్ లుక్ లాంచ్ ఘనంగా జరిగింది. ప్రముఖ సీనియర్ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ చేతుల మీదుగా ఈ ఫస్ట్ లుక్ విడుదలైంది. ఫస్ట్ లుక్‌ను చూసిన తమ్మారెడ్డి, చిత్ర బృందాన్ని ప్రశంసిస్తూ, ఈ సినిమా ధనుష్‌కు మంచి గుర్తింపు తెస్తుందని, యువ బృందానికి ఆశీస్సులు అందజేస్తూ, సినిమా ఘన విజయం సాధించాలని కోరారు. ఈ సందర్భంగా హీరో ధనుష్ మాట్లాడుతూ, 'థాంక్ యూ డియర్' తన రెండో చిత్రమని, తమ్మారెడ్డి లాంటి సీనియర్ ప్రొడ్యూసర్ తమ సినిమా ఫస్ట్



లుక్‌ను విడుదల చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ సినిమా తన కెరీర్‌లో కీలకమైనదని, ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిర్మాత పప్పు బాలాజీ రెడ్డి మాట్లాడుతూ, ఈ చిత్రం ధనుష్‌కు గొప్ప పేరు తెస్తుందని, తమ్మారెడ్డి లాంటి ప్రముఖులు ఫస్ట్ లుక్‌ను విడుదల చేయడం తమకు ప్రోత్సాహకరంగా ఉందని అన్నారు. సినిమా ప్రేక్షకులను ఆకర్షిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. లైన్ నిర్మాత పుణీత్ రెడ్డి మాట్లాడుతూ, తమ్మారెడ్డి భరద్వాజ లాంటి సినీ పెద్ద ఈ ఫస్ట్ లుక్‌ను విడుదల చేయడం సంతోషకరమని, సినిమాను ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించామని తెలిపారు. ఈ చిత్రం యువతని కచ్చితంగా ఆకట్టుకొని విజయవంతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



నేహా మాలిక్

# 'వార్ 2' టీజర్‌కు వచ్చిన స్పందన చూస్తే ఎంతో ఆనందంగా ఉంది: ఎన్టీఆర్

**మ్యాన్ ఆఫ్ మాసెస్** ఎన్టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా రిలీజ్ చేసిన 'వార్ 2' టీజర్‌కు ప్రపంచ వ్యాప్తంగా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిన సంగతి తెలిసిందే. 'వార్ 2' స్పై యూనివర్స్ ఫ్రాంచైజ్‌లో రానున్న 'వార్ 2' ఇప్పుడు ఇంటర్నెట్‌లో సెన్సేషన్‌గా మారింది. 'వార్ 2' టీజర్ మీద ప్రేక్షకులు కురిపిస్తున్న ప్రేమకు ఎన్టీఆర్ ఉప్పొంగిపోయారు. ఈ మేరకు ఎన్టీఆర్ స్పందిస్తూ ప్రజల నుండి వస్తున్న ప్రేమ, ప్రశంసలను చూస్తుంటే నేను నటుడిని అయినందుకు చాలా సంతోషంగా అనిపిస్తోంది. మీరు చూపించే ఈ ప్రేమ నాకు చాలావిలువైనది. 'వార్ 2' మీద మీరు చూపిస్తున్న ప్రేమకు థాంక్స్. వైఆర్‌ఎఫ్ స్పై యూని వర్స్ చిత్రంలో నన్ను పూర్తిగా కొత్తగా చూపించారు. ఈ మూవీ కోసం మేం అంతా కూడా ఎంతో సరదాగా కలిసి



పని చేశాం. దేశంలోని ప్రతి మూల నుంచి వస్తున్న ప్రేమను చూసి నేను ఉప్పొంగిపోయాను. ఈ పాత్ర నాకు చాలా ప్రత్యేకమైనది. 'వార్ 2' కోసం ఇంతలా ఎదురు చూస్తున్నారు.. థియేటర్లో మీ స్పందన చూడటం నాకు మరింత ఆనందంగా, ఉత్సాహంగా ఉంటుంది. వైఆర్‌ఎఫ్ యూనివర్స్ ఎల్లప్పుడూ కొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఇస్తుంది. వైఆర్‌ఎఫ్ యూనివర్స్ బాక్సాఫీస్ బెంచ్‌మార్క్‌లను సృష్టిస్తుంది. మా 'వార్ 2' ఒక్క టీజర్‌తోనే ఇంతటి ప్రభావం చూపించడం, ఆడియెన్స్‌పై ముద్ర వేయడం చూసి నేను నిజంగా సంతోషంగా ఉన్నాను. ఆగస్టు 14 నుండి థియేటర్లలో అభిమానుల సందడి చూసేందుకు నేను ఎంతగానో ఎదురు చూస్తున్నాను అని అన్నారు. ఆదిత్య చోప్రా నిర్మాణంలో అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించిన 'వార్ 2' లో కియారా అద్వానీ కథా నాయిక.

# 'పెద్ది' హైదరాబాద్ షెడ్యూల్ ప్రారంభం

**గ్లోబల్ స్టార్ రామ్ చరణ్** హైలీ యాంటిసిపేటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ పెద్ది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ ఫిలిం మేకర్ బుచ్చి బాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పవర్ ఫుల్ కొలాబరేషన్, అద్భుతమైన టీంతో 'పెద్ది' భారతీయ సినిమాలో కొత్త ప్రమాణాలను నెలకొల్పడానికి సిద్ధంగా ఉంది. ప్రముఖ పాన్‌ఇండియా నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో విజనరీ వెంకట సతీష్ కిలారు తన ప్రతిష్టాత్మక బ్యానర్ వృద్ధి సినిమాస్ బ్యానర్ పై భారీ స్థాయిలో నిర్మిస్తున్న పెద్ది, లెన్తీ క్రూషియల్ షెడ్యూల్ హైదరాబాద్‌లోని మ్యాసీవ్ విలేజ్ సెట్‌లో ప్రారంభమోతోంది.

'పెద్ది' లోని రా అండ్ రస్టిక్ బ్యాక్ డ్రాప్, మూలకథను ప్రతిబింబించేలా, ప్రేక్షకులకు ఓ ప్రత్యేక అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో టీం అద్భుతమైన వర్క్ చేస్తోంది. ప్రముఖ ప్రొడక్షన్ డిజైనర్ అవినాష్ కొల్లా నేతృత్వంలో మ్యాసీవ్ విలేజ్ సెట్ ని నిర్మించారు. ఇక్కడ భారీ యాక్షన్ సీక్వెన్స్, టాకీ పోర్షన్ ని చిత్రీకరించనున్నారు. ఇప్పటికే 30 షూటింగ్ పూర్తి కాగా, ప్రస్తుతం ప్రారంభమైన ఈ షెడ్యూల్ ద్వారా సినిమా ఓ కీలక దశను చేరుకోనుంది. 'ఉప్పెన' విజయం తర్వాత బుచ్చిబాబు సానా మరింత ప్రెస్టిజియస్ గా, ప్రతి విభాగాన్ని చాలా కేర్ తీసుకుంటూ గ్రాండ్ స్కేల్ లో రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో రామ్ చరణ్ రస్టిక్ అండ్ రగ్గడ్ లుక్ లో కనిపించనున్నారు. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. చిత్రానికి స్టార్ డివోపీ ఆర్. రత్నవేలు సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, ఆస్కార్ అవార్డు విజేత ఏఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. జాతీయ అవార్డు గెలుచుకున్న నవీన్ నూలి ఎడిటింగ్ బాధ్యతలు చేపట్టారు. ఈ చిత్రం 2026 మార్చి 27న రామ్ చరణ్ పుట్టినరోజున ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



# 'విశ్వంభర' ఎపిక్ బుక్ లాంచ్


**మెగాస్టార్ చిరంజీవి** మోస్ట్ అవైటెడ్ సోషియోఫాంటసీ మూవీ 'విశ్వంభర' ఇప్పటికే నేషనల్ లెవల్‌లో మంచి హైప్‌ను క్రియేట్ చేసింది. ఫస్ట్ గ్లింప్స్, ఫస్ట్ సింగిల్, ఇతర ప్రమోషనల్ మేటీరియల్‌కు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది.



వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యువి క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్, వంశీ, ప్రమోద్‌లు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. మెగామాస్ ఇప్పుడు సరిహద్దులు దాటి గ్లోబల్‌గా మారింది. నిర్మాత విక్రమ్‌రెడ్డి విశ్వంభరను అంతర్జాతీయ వేదిక అయిన కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు తీసుకెళ్లారు. అక్కడ విశ్వంభర ఎక్స్‌క్లూజివ్ బుక్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఈవెంట్‌లో ఆయన సినిమా కథ, భారతీయ పురాణాల ప్రాధాన్యత, బుక్ విశేషాలు గురించి వివరించారు. అలాగే సినిమా స్థాయి, విఎఫ్ఎక్స్ స్టూడియోల సహకారం గురించి కూడా చెప్పారు. టాప్ హాలీవుడ్ స్టూడియోల భాగస్వామ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్,పనులు ఇప్పటికే 90 పూర్తయ్యాయి. మిగతా పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు పూర్తయ్యాక, మేకర్స్ సినిమా విడుదల తేదీని భారీ ప్రమోషన్‌లతో ప్రకటించనున్నారు. అయితే అనేది ఇప్పుడు అందరి మనసుల్లో మెదులుతున్న ప్రశ్న. ఈ చిత్రంలో త్రిషాకృష్ణన్ కథానాయికగా నటిస్తుండగా, ఆశికారంగనాథ్ కీలక పాత్రలో కనిపించనున్నారు. కునాల్‌కపూర్ మరో ముఖ్యమైన పాత్రలో కనిపించనున్నాడు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందించగా, పాటలు అద్భుతంగా వచ్చాయి.

# 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' షూటింగ్ ప్రారంభం

**యంగ్ టాలెంటెడ్ హీరో** కార్తిక్ రాజు డిఫరెంట్ కథలతో ఆడియెన్స్‌ను మెప్పిస్తున్నారు. కౌసల్యా కృష్ణమూర్తి, అథర్వ లాంటి సినిమాలతో ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న కార్తిక్ రాజు ప్రస్తుతం కొత్త మూవీని ప్రారంభించారు. రీసెంట్ సెన్సేషన్ అనగనగా ఫేమ్ కాజల్‌చౌదరి హీరోయిన్‌గా, కార్తిక్ రాజు హీరోగా రామకృష్ణ సినిమా బ్యానర్ మీద గాలి కృష్ణ తెరకెక్కిస్తున్న చిత్రం 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే'. ఈ సినిమాకు రాజా దుస్సా దర్శకత్వం వహిస్తున్నారు. మల్లవరం వేంకటేశ్వర రెడ్డి, రూప కిరణ్ గంజి సహ నిర్మాతలుగా వ్యవహరించనున్నారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా కార్తికేయ శ్రీనివాస్, లైన్ ప్రొడ్యూసర్‌గా కీసరి నరసింహ (కెఎన్‌ఆర్), ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ గా సుబ్బు, ఆర్ట్ డైరెక్టర్‌గా రవి కుమార్ గుర్రం, మ్యూజిక్ డైరెక్టర్‌గా సురేష్ బొబ్బిలి, గీత రచయితగా కాసర్ల శ్యామ్, కెమెరామెన్‌గా గంగానమోని శేఖర్ పని చేయనున్నారు. 'అట్లాస్ సైకిల్ అత్తగారు పెట్లే' సినిమాను శుక్రవారం (మే 23) గ్రాండ్‌గా లాంచ్ చేశారు. రామానాయుడు స్టూడియోలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ పూజా కార్యక్రమాలకు ప్రముఖ నిర్మాత సురేష్ బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, భీమనేని శ్రీనివాసరావు, క్రాంతి మాధవ్, హీరో చైతన్య వంటి వారు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. తమ్మారెడ్డి భరద్వాజ స్క్రిప్ట్ అందజేశారు. ముహూర్తపు సన్నివేశానికి సురేష్ బాబు క్లాప్ కొట్టగా, హీరో చైతన్య కెమెరా స్విచ్ ఆన్ చేయగా, తొలి షాట్‌కి భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వం వహించారు. అనంతరం దర్శకుడు రాజా దుస్సా మాట్లాడుతూ, ఇదొక పీరియాడికల్ మూవీ. హాస్యంతో పాటు



ఎమోషనల్ గానూ ఈ చిత్రం ఉంటుంది. 1980లో వరంగల్‌లో జరిగిన యథార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్నాము. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ చేయాలని ప్లాన్ చేస్తున్నాం. కార్తిక్ రాజు, కాజల్ చౌదరితో ఈ సినిమా చేస్తుండటం ఆనందంగా ఉంది. మానిర్మాత గాలి కృష్ణ సహకారం ఎప్పటికీ మర్చి పోలేను. ఈరోజు మాకోసం వచ్చిన సురేష్ బాబు, తమ్మారెడ్డి, భీమనేని శ్రీనివాసరావు, క్రాంతి మాధవ్, చైతన్యకి కృతజ్ఞతలు తెలిపారు. ఇది వరకు దర్శకుడు రాజా దుస్సా హన్సికతో 105 మినిట్స్ అనే ఓ ప్రయోగాత్మక చిత్రాన్ని తీసి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. హీరో కార్తిక్ రాజు మాట్లాడుతూ,80వ దశకంలో జరిగే కథతో ఈ చిత్రం రాబోతోంది. కాజల్ చౌదరి ప్రస్తుతం సక్సెస్ ఫుల్‌గా దూసుకుపోతోంది. ఆమెతో కలిసి నటిస్తుండటం ఆనందంగా ఉంది. మంచి కథను నాకు ఇచ్చిన మా దర్శకుడు రాజా దుస్సా, నిర్మాత గాలి కృష్ణకి థాంక్స్. మున్ముందు మా సినిమా నుంచి మరిన్ని అప్డేట్‌లు వస్తాయని అన్నారు. కాజల్‌చౌదరి మాట్లాడుతూ,ఈ చిత్రంలో నటిస్తుండటం ఆనందంగా ఉంది. కథ చాలా బాగుంటుంది. ఇదొక యూనిక్ స్టోరీ. మంచి టీంతో పని చేస్తున్నాను. తెలుగు ప్రేక్షకులు ప్రస్తుతం నా మీద ఎంతో ప్రేమనుకురిపిస్తున్నారు. ఈచిత్రంతోనూ నన్ను ఆదరిస్తారని కోరుకుంటున్నాను అని అన్నారు.

# జూన్ 2న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాలకు ముహూర్తం

## ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

**హైదరాబాద్,మే 23 ,ప్రభాతవార్త :** తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున అంటే వచ్చే నెల 2న ఇందిరమ్మ లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 33 జిల్లాల్లో మండలానికి కనీసం ఒక ఇంట్లో గృహప్రవేశం చేయించాలని భావిస్తున్నారు. స్లాబ్ పూర్తయిన ఇండ్లను గుర్తించి ప్లాస్టరింగ్‌తో పాటు ఇంటీరియర్ పనులను స్పీడప్ చేసేలా జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లకు ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా మొదటి విడత కింద మంజూరు చేసిన ఇళ్లలో 20 వేల ఇండ్ల నిర్మాణం ప్రారంభం కాగా, ఇందులో 5,200 ఇండ్లు బేస్ మెంట్ వరకు పూర్తయ్యాయి. 300 ఇండ్లు గోడలు పూర్తయ్యి స్లాబ్ కు రెడీ అవుతుండగా మరో 200 ఇండ్లకు స్లాబ్స్ దాకా పూర్తయి ప్లాస్టరింగ్ పనులు జరుగుతున్నాయి. ఈనెలాఖరు వరకు వెయ్యి వరకు స్లాబ్స్ పూర్తవుతాయని హౌసింగ్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు చెబుతున్నారు. బేస్ మెంట్, గోడలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు ప్రతి సోమవారం నగదు బదిలీ చేస్తున్నారు. ఇప్పటి వరకు రూ. 53.64 కోట్లను ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో వేసిన సంగతి తెలిసిందే.

రాష్ట్రవ్యాప్తంగా జీహెచ్ఎంసీతో పాటు అన్ని పట్టణ ప్రాంతాల్లో సొంత జాగా, ఇండ్లు లేని ప్రజలు లక్షల్లో ఉన్నారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 10,66,953 మంది అప్లై చేసుకోగా ఇందులో సొంత జాగా ఉన్నవాళ్లు 18 వేల మంది మాత్రమే ఉన్నట్లు అధికారుల సర్వేలో తేలింది. అలాంటి వారి కోసం సర్కారు భూముల్లో జీ ప్లస్ 3 ఫ్లోర్లతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ క్రమంలో జీహెచ్ఎంసీ పరిధిలో 15 ప్రాంతాల్లో ప్రభుత్వ భూమిని గుర్తించిన జీహెచ్ఎంసీ కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్ ఆ వివరాలను హౌసింగ్ అధికారులుకు అందజేశారు. ఆయా చోట్ల జీ ప్లస్ 3 మోడల్‌లో ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం నిర్మించనుంది. ఒక్క ఎకరా పరిధిలో 300 ఇళ్లు నిర్మించాలని హౌసింగ్ ఆఫీసర్లు నిర్ణయించారు. అంతకుమించి నిర్మిస్తే మౌలిక వసతులకు అధికంగా ఖర్చు చేయాల్సి వస్తుందని చెప్తున్నారు. దీంతో పాటు అన్ని జిల్లా కేంద్రాలు, పట్టణాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు పంపాలని కలెక్టర్లకు హౌసింగ్ ఉన్నతాధికారులు ఇప్పటికే లేఖ రాశారు. ఈ వివరాలు వచ్చిన తర్వాత కేబినెట్ లో తీసుకునే నిర్ణయం ఆధారంగా ముందుకు పోతామని అధికారులు చెబుతున్నారు.

జీహెచ్ఎంసీలో టవర్లు కట్టనున్న ప్రాంతాలు, నియోజకవర్గాలు. షేక్ పేట (ఖైరతాబాద్), హిమాయత్ నగర్ (ముషీరాబాద్), సైదాబాద్ (యాకుత్ పుర, మలక్ పేట) ఆసిఫ్ నగర్ (కార్వాన్, గోషామహల్, నాంపల్లి) మారేడ్ పల్లి (సికింద్రాబాద్), తిరుమలగిరి (కంటోన్మెంట్), బండ్లగూడ (చాంద్రాయణగుట్ట)లలో జిహెచ ఎంసిలలో నిర్మించనున్నారు. రాష్ట్రంలో ఈ ఏడాది నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మొత్తం 4.5 లక్షల ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలి దశలో 71 వేల ఇళ్లను మంజూరు చేయగా ఇందులో 47 వేల ఇళ్లను కలెక్టర్లు సాంక్షన్ చేశారు. రెండో దశలో 2.08 లక్షల ఇళ్లను మంజూరు చేయగా ఇప్పటి వరకు లక్ష ఇళ్లకు పునాదులు ప్రారంభం అయ్యాయి. దశల వారీగా రెండో విడత లబ్ధిదారులకు కలెక్టర్లు ఇళ్లను సాంక్షన్ చేస్తున్నారు. లబ్ధిదారులకు ఇసుక రీచ్‌ల ద్వారా ఫ్రీగా ఇసుక సరఫరా చేస్తుండగా మార్కెట్ రేటు కన్నా తక్కువకు సిమెంట్, ఐరన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల సిమెంట్, ఐరన్ కంపెనీల ప్రతినిధులతో సమావేశమై మార్కెట్ రేటు కన్నా తక్కువకు ఇవ్వాలని, వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఇళ్లను ప్రభుత్వం నిర్మించనుందని అధికారులు తెలిపారు.

# వైద్య, ఆరోగ్య శాఖలో ఇద్దరు అధికారులపై వేటు

## నీలోఫర్ సూపరింటెండెంట్ సస్పెన్షన్

### విధుల నుంచి సూర్యాపేట డిఎంహెచ్ఒ తొలగింపు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వైద్య, ఆరోగ్య శాఖలో ఒకే రోజు ఇద్దరు వైద్యాధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇద్దరు వైద్యాధికారులపై వేటు వేయడానికి అవినీతి ఆరోపణలే కారణం. అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం విచారణ కమిటీని నియమించి ప్రాథమిక సమాచారం తెప్పించుకున్న తరువాత ఇద్దరు అధికారులపై వేటు వేసింది. అందులో ఒక అధికాని సస్పెండ్ చేయగా.. మరో అధికారిని ప్రస్తుతం చేస్తున్న విధుల నుంచి తొలగిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. నీలోఫర్ ఆసుపత్రి ప్రాంగణంలోని పార్కులో ప్రైవేటు వ్యక్తికి మెడికల్ షాప్ నిర్మాణానికి అనుమతినిచ్చిన ఆసుపత్రి ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్ డాక్టర్ రవికుమార్‌పై రాష్ట్ర ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా నీలోఫర్‌లో పనిచేస్తున్న డాక్టర్ జి విజయ్‌కుమార్‌కు ఇన్‌ఛార్జ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలను అప్పగిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సూర్యాపేట జిల్లాలో తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఎంహెచ్ఒ డాక్టర్ కోట చలంను.. డిఎంహెచ్‌వో బాధ్యతల నుండి తప్పించారు. ఆయన స్థానంలో ఎల్‌బినగర్ జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి చంద్రశేఖర్‌ను సూర్యాపేట జిల్లా ఇన్‌ఛార్జ్ డిఎంహెచ్‌ఒగా నియమిస్తూ వైద్య, ఆరోగ్య శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

# అందుబాటులో జెఇఇ అడ్వాన్స్‌డ్ రెస్పాన్స్‌షీట్లు

## 26న ప్రాథమిక కీ విడుదల.. 27 వరకు అభ్యంతరాల స్వీకరణ

### జూన్ 2న ఫైనల్ కీ, ఫలితాలను వెల్లడించే అవకాశం

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఐటీల్లో చేరడానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) అడ్వాన్స్‌డ్-2025 పరీక్షకి సంబంధించి విద్యార్థుల రెస్పాన్స్ షీట్స్‌ను అందుబాటులో ఉంచినట్టు పరీక్షను నిర్వహించిన ఐఐటీ కాన్పూర్ ప్రకటించింది. ఈ నెల 18న ఆదివారం దేశవ్యాప్తంగా జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షను ప్రశాంతంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. కాన్పూర్ ఐఐటీ నిర్వహించిన జెఇఇ అడ్వాన్స్‌డ్ రెస్పాన్స్ షీట్‌ను అందుబాటులో ఉంచింది. ఈ నెల 26 లోగా ప్రాథమిక కీని విడుదల చేసి.. 27 వరకు ప్రాథమిక కీపై అభ్యంతరాలను స్వీకరించనున్నారు. విద్యార్థుల అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం జూన్ 2న ఆన్‌లైన్ ద్వారా జెఇఇ అడ్వాన్స్‌డ్-2025 తుది ఫలితాలను వెల్లడించడానికి ఐఐటీ కాన్పూర్ ప్రణాళికను సిద్ధం చేసుకుంది. అనంతరం జూన్ 3 నుంచి ఎన్ఐటీ, ఐఐటీ ఇతర జాతీయ సంస్థల్లో ప్రవేశానికి సంబంధించిన షెడ్యూల్ను జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ (జోసా) విడుదల చేయనుంది. దేశ వ్యాప్తంగా జెఇఇ మెయిన్ పరీక్ష రాసిన వారిలో 2.50 లక్షల మందికి అర్హత కల్పించారు. అడాన్స్‌డ్ పరీక్షను ఈ నెల 18న.. పేపర్-1 పరీక్షను ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ... పేపర్-2 పరీక్షను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించారు.

# బిఆర్ఎస్ మునిగిపోయే నావ.. దూకాలని కవిత తాపత్రయం

## పార్లమెంట్ ఎన్నికల నుంచి బిజెపి, బిఆర్ఎస్ బలపడిన బంధం


### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నావ మునిగిపోతుందని అందు లోంచి దూకాలని కవిత తాపత్రయ పడుతోందని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. శుక్రవారం సిఎల్‌పిలో విలేఖరులతో మాట్లాడుతూ పదేండ్ల బిఆర్ఎస్ పాపాలను లేఖ ద్వారా కవిత బయటపెట్టిందని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో కవితకు ఎస్సీ, ఎస్టీ, బిసిలు గుర్తుకు రాలేదని విమర్శించారు. వరంగల్ సభ లో నియంతలా కేసిఆర్ ఒక్కడే మాట్లాడాడు అని కవిత చెప్పడమే కాదు బిజెపి తో బిఆర్ఎస్‌కు ఉన్న సంబంధం కవిత బయట పెట్టిందని అన్నారు. ఎస్సీ వర్గీకరణ, కుల గణన పై కెసిఆర్ మౌనంగా ఉన్నారని కవిత తన లేఖలో స్పష్టం చేసిందని అన్నారు. పదేండ్లు దోచుకున్న సంపద లో వాటాల కోసమే కల్వకుంట్ల కుటుంబంలో పంచాయతీ జరుగుతోందని ఆయన భాష్యం చెప్పారు. ఆస్తుల పంపకాల లో తేడాలు రావడం తో కవితకు గత పాలనవైఫ్యాలు, ఎస్సీలు, ఎస్టీలు, బిసిలు గుర్తుకు వచ్చారని దుయ్య బట్టారు. ఎస్సీ ఎస్టీ బిసి లను కేసీఆర్ పార్టీ నుండి బయటికి పంపినప్పుడు కవితకు ఎందుకు గొంతు విప్పలేదని నిలదీశారు. కేవలం రాజకీయ మనుగడ కోసం బిఆర్ఎస్ పార్టీ నుంచి బయటకు పంపుతారన్న భయంతోనే కవిత ఇప్పుడు మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. బిఆర్ఎస్, బిజెపి ఒప్పందాన్ని బయటపెట్టి నందుకు కవితకు కృతజ్ఞతలు చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బిజెపి, బిఆర్ఎస్ బంధం బయటపడటమే కాదు అది రోజురోజుకు బలపడుతోందని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల ముందే కవిత ఈ విషయాన్ని బయట పెడితే బిజెపికి ఆ సీట్లు కూడా వచ్చేవికావు అని అన్నారు. పదేండ్లు కేసీఆర్ ఫాం హౌజ్‌నుంచి పాలన చేస్తుంటే కవిత ఎందుకు మాట్లాడలేదు. జనాలు ప్రతిపక్ష పాత్ర ఇస్తే పట్టిం చుకోకుండా కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యాడు అయినా ఈ విషయం కవిత లేఖలో ప్రస్తావిం చాల్సి ఉండాల్సిందని అన్నారు. హరీష్ రావు బిజెపిలోకి పోతుంటే కేటీఆర్ ఆయన కాళ్ళు పట్టుకున్నారని మీడియాలో చూశాను.. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో ఎలాంటి అవినీతి జరగలేదని నమ్మితే కేటీఆర్ సిబిఐ విచారణ కోరాలని సవాల్ చేశారు. కాళేశ్వరం పైన సిబిఐ విచారణ కోరుతు బిఆర్ఎస్ పార్టీ కేంద్రానికి లేఖ రాయాలని సూచించారు. మేడిగడ్డలో కాంగ్రెస్ వాళ్లు బాంబు పెట్టారని కెటిఆర్ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని దూషించారు. డబ్బు మదంతో కేటీఆర్ మాట్లాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు ఆరు అడుగులు ఉన్నాడు కానీ దామాక్ లేదని విమర్శించారు. కవిత కేసీఆర్ తప్పులు జనాలకు మీరు చెప్పినందుకు తెలంగాణ ప్రజలు సంతోషిస్తున్నారు. బిజెపిలో బిఆర్ఎస్ విలీనం అవుతోందని ఆయన జోస్యం చెప్పారు. బిఆర్ఎస్ గురించి ఆలోచించే సమయం తమ ముఖ్యమంత్రికి లేదని అన్నారు.

# తెలంగాణ డి.సిఎం భట్టితో బిసి నేతల భేటీ

## విద్యార్థుల ఫీజులు, హాస్టళ్ల మెస్ బిల్లులు, అద్దె బకాయిలు చెల్లించాలి

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ఇంజనీరింగ్, డిగ్రీ తదితర కాలేజీ కోర్సులు చదువుతున్న 14 లక్షల మంది విద్యార్థుల ఫీజుల బకాయిలు 6వేల కోట్లు వెంటనే చెల్లించాలని, కాలేజీ హాస్టళ్ళ అద్దె బకాయిలు చెల్లిందాలని కోరుతూ శుక్రవారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను బిసి నేతలు కలిసి చర్చలు జరిపారు. బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో కలిసిన ఈ బృందంలో పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్, ఎమ్మెల్యేలు రామచంద్ర నాయక్, ఆదినారాయణ, బి.సి నాయకులు నీల వెంకటేష్, అనంతయ్య, రాజేందర్, మోదీ రాందేవ్, రవి యాదవ్, బాలస్వామి, భాస్కర్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్లారు. 'ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం అన్నీ యూనివర్సిటీలలోని అనుబంధ కాలేజీ విద్యార్థుల డిగ్రీ పరీక్షను కాలేజీ యాజమాన్యాలు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ నెలలో జరగాల్సిన డిగ్రీ పరీక్షలను కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మా గాంధీ, పాల మూరు యూనివర్సిటీల పరిధిలో ఇప్పటికీ నిర్వహించకపోవడంతో విద్యార్థులు విద్యా సంవత్సరం నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు డిగ్రీ పరీక్షలు నిర్వహించకుండా నిరసనలు తెలుపు తున్నప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుంది. ప్రభుత్వం ఫీజు రీయిం బర్స్‌మెంట్ ఇవ్వక పోవడంతో యాజమా న్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. కళా శాల యాజమాన్యాలు అప్పులు తెచ్చి బోధన, బోధనేతర సిబ్బందికి జీతాలు చెల్లిస్తున్న పరిస్థితి ఏర్పడింది. అద్దెలు, అప్పులు పెరిగిపోవడంతో ఈ ఏడాది డిగ్రీ అడ్మిషన్లను నిలిపివేయగా, కొన్నిచోట్ల కళాశాలలకు తాళం వేసి ఇప్పటికి సెలవులు ప్రకటించారు. పరీక్షలు బహిష్కరిస్తున్నారు. పరీక్షలు బహిష్కరించడం కాలేజీ మూసివేయడం విద్యాశాఖ చరిత్రలో ఇదే మొదటిసారి. ఇది ఒక రకంగా ప్రభుత్వం ఫెయిల్ అయినట్టు లెక్క. ఇంత జరుగుతుంటే. తమకేమీ పట్టనట్లు ప్రభుత్వం వ్యవహరిస్తుండడం సరైనది కాదు. దీని మూలంగా సకాలంలో పరీక్ష నిర్వహించకపోవడంతో పీజీ సెట్, లా సెట్, ఈ సెట్, బి.ఎడ్ ఇతర పోటీ పరీక్షలు అర్హత కోల్పోతున్నారు. అలాగే ఉద్యోగ సివిల్స్ ఇతర ఉద్యోగా పోటీ పరీక్షలకు అవకాశం కోల్పోతున్నారు. వెంటనే ఫీజు బకాయిలు సుమారు 4వేలకోట్లు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో అద్దె భవనాల మూడేళ్ల అద్దె చెల్లించలేదు. ఎస్టీ హాస్టళ్ళ మెస్ బిల్లులు చెల్లించలేదు. దీంతో ఎస్టీ హాస్టళ్ళలను మూసివేసే పరిస్థితి ఏర్పడిందని డిప్యూటీ సిఎంను కృష్ణయ్య కోరారు. అందుకు స్పందించిన ఉపముఖ్యమంత్రి నెల రోజుల ఫీజుల బకాయిలు హాస్టల్ అద్దె బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.



డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో ఎంపి బలరామ్‌నాయక్, ఎమ్మెల్యేలు రామచంద్ర నాయక్, ఆదినారాయణతోపాటు బిసి నేతలు

# హైదరాబాద్‌కు 2 వేల ఎలక్ట్రిక్ బస్సులపై

## కేంద్రమంత్రి కుమారస్వామికి మంత్రి పొన్నం ధన్యవాదాలు

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తికి స్పందించి హైదరాబాద్‌కి 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు ప్రకటించిన కేంద్ర మంత్రి కుమార స్వామికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. ప్రధానమంత్రి ఈ-డ్రైవ్ పథకం కింద హైదరాబాద్‌కి 2వేల ఎలక్ట్రిక్ బస్సులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి కుమార స్వామి ప్రకటించడం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఈవీ పాలసీ తీసుకొచ్చిందని 100 శాతం టాక్స్ మినహాయింపు చేస్తున్నామన్నారు. దాంతోపాటు హైదరాబాద్ నగరంలో ఓఆర్ఆర్ లోపల నడిచే ఆర్టీసీ బస్సులను పూర్తిగా 2800 ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించిందని... ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం సహ కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి గతంలో కేంద్రమంత్రి కుమారస్వామిని కలిసి ఎలక్ట్రిక్ బస్సులకు సహకరించాలని విజ్ఞప్తి చేశామని మంత్రి పొన్నం ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని హైదరాబాద్ నగరానికి ప్రధాన మంత్రి ఇ-డ్రైవ్ పథకం కింద 2వేల బస్సులు కేటాయిస్తామని తెలపడంపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తంచేశారు. మిగిలిన 800 ఎలక్ట్రిక్ బస్సులు కూడా కేటాయించాలని కేంద్రానికి మంత్రి విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ సిఎం రేవంత్‌పై బిజెపి, బిఆర్ఎస్ కుట్రలు

## ఇడిలతో వేధిస్తే కార్యకర్తలు సహించరు

### ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్

**హైదరాబాద్, మే 23, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దేశంలోనే గొప్ప పేరు వస్తుందన్న భయంతో బిజెపి, బిఆర్ఎస్ కుట్ర చేస్తున్నాయనీ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. శుక్రవారం సిఎల్‌పి కార్యలయంలో ఆయన మాట్లాడుతూ మాదిగలకు మంత్రివర్గంలో అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరామని ఆయన తెలిపారు. మాదిగలకు న్యాయం జరగాలి, అన్నింట్లో మాదిగలే ముందుండి పోరాడుతున్నారని అన్నారు. ఇడి ఛార్జ్ షీట్ లో సిఎం రేవంత్ రెడ్డి పేరు ఉందని బీఆర్ఎస్, బిజెపిలు తెగ హడావిడి చేస్తున్నాయని ఆయన విమర్శించారు. పదేళ్ల పాటు బిఆర్ఎస్ పార్టీ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్క మాట కూడా మాట్లాడలేదని గుర్తుచేశారు .విపక్ష పార్టీ లపైన కేంద్రం ఇడి ని ప్రయోగిస్తోందని అన్నారు. ప్రశ్నించే వారి ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు బిజెపికి దగ్గరుండి ఓట్లు వేయించారని అందుకే ఎంపి సీట్లు ఎనిమిది గెలిచాయని అన్నారు. బిఆర్ఎస్ రజతోత్సవ సభలో బిజెపి పైన ఒక్క మాట కూడా మాట్లాడలేదని ఆయన అన్నారు. తెలంగాణకు నిధులెందుకు ఇవ్వడం లేదని కేంద్రాన్ని బిఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదు..?!! అని నిలదీశారు. ఇడిని అడ్డం పెట్టుకుని వేధించడానికి ప్రయత్నిస్తే కాంగ్రెస్ కార్యకర్తలు ఊరుకోరని హెచ్చరించారు. బిఆర్ఎస్ ను ప్రజలు నమ్మడం లేదని ఆయన అన్నారు ఆ పార్టీ లేవడం లేదు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ వైపే జనం నిలబడతారని అన్నారు. ఎమ్మెల్యే తుంగతుర్తి మందుల సామేల్ మాట్లాడుతూ జనాభా లో మాదిగలు 17 శాతం మంది ఉన్నారనీ నిజమైన మాదిగలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి విన్నవించామని అన్నారు. మల్లికార్జున ఖర్గే, సోనియా, రాహుల్ , కేసీ వేణుగోపాల్, మీనాక్షి నటరాజన్ లను కూడా కలిసి వేడుకొంటామని చెప్పారు. సిఎం రేవంత్ రెడ్డి మాదిగల పక్షపాతిని వర్ణించారు. వర్గీకరణ చేసి దశాబ్దాల కలను రేవంత్ రెడ్డి నేరవేర్చారని సామేల్ కితాబు ఇచ్చారు. మేం మాలల ను గౌరవిస్తామని ఆయన చెప్పారు. మాదిగలు ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేశారని ఆయన గుర్తుచేసుకొన్నారు. మాదిగలు సిఎం రేవంత్ రెడ్డి కి, ప్రభుత్వానికి అండగా నిలిచారని తెలిపారు. గతంలో దళితులను కేసీఆర్ అగౌరవపర్చారని దామోదర రాజనర్సింహ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాడారని ఆయనను కూడా గౌరవిస్తామని అన్నారు.

# మావోయిస్టుల మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించాలి

## అమరుల బంధుమిత్రుల సంఘం

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 23, ప్రభాతవార్త:** మావోయిస్టుల మృతదేహాలపట్ల ఉన్మాదంగా, అమానవీయంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వాల తీరును అమరుల బంధుమిత్రుల సంఘం, పలు ప్రజా సంఘాలు ఖండించాయి. ఈ నెల 21న నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో అమరులైన మావోయిస్టుల మృత దేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలని ఆ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు భవాని, జి.అనురాధ, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు, భల్లా రవి, రాజనర్సింహ్మా, రాజు, సురేష్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ సిపిఐ మావోయిస్టు కేంద్ర కార్య దర్శి నంబాల కేశవ రావు మృతదేహాన్ని రక్త సంబంధికులకు ఇవ్వకుండా ఛత్తీస్‌గఢ్ పోలీసులు వేధించడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు.

# బాలుని మృతికి రైల్వే అధికారులదే బాధ్యత

## రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి : వామపక్షాల డిమాండ్

**గుంతకల్లు రైల్వే,మే 23,ప్రభాతవార్త:** గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన మణికంఠ మృతికి పూర్తి బాధ్యత రైల్వే అధికారులదేనని వామపక్షాలు ఆరోపించాయి. కర్నూలు నగరంలోని ఎన్ఆర్ పేటకు చెందిన వెంకటేశ్వర్లు కుటుంబం రామేశ్వరంకు వెళ్లేందుకు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో రైలు కోసం ఏడోనెంబర్ ప్లాట్ ఫాంపై వేచి ఉండగా బాలుడు మణికంఠ వెయిటింగ్ హాల్ ముందర పడుకొని ఉన్న సమయంలో స్టేషన్ పైకప్పు పెచ్చులూడి తలపైన పడడం వలన తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆ బాలుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పుడు మృతిచెందాడని తెలిపారన్నారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఐ, సిపిఎం పార్టీల ప్రతినిధుల బృందాలు గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో 7వ నం. ప్లాట్ ఫాంను సందర్శించి వెయిటింగ్ హాల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు డి జగదీష్ మాట్లాడుతూ రైల్వే అధికారుల నిర్లక్ష్యం, రైల్వే కాంట్రాక్టర్ల అవినీతి కారణంగా ఒక బాలుడు మృతిచెందడం చాలా బాధాకరమని విచారం వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు బాధ్యులైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బాలుడి కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు బాధిత కుటుంబంలో ఒకరికి రైల్వే ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపినాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాము, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బిసి కుల్లాయప్ప, నాయకులు,ప్రజా నాట్యమండలి పట్టణ అధ్యక్షులు ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నాయకులు వెంకట్ నాయక్, నూర్ మహమ్మద్, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీనివాసులు, ఎస్ఎం బాషా, పట్టణ కార్యదర్శి మారుతి ప్రసాద్, ప్రతినిధులు నాగరాజు,సురేంద్రబాబు, తిమ్మప్ప, రాము, కర్ణ, వంశీ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌పై తప్పుడు ఆరోపణలు

## మాజీ మంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నేత శైలజానాథ్

**విజయవాడ మే 23 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ లిక్కర్‌స్కామ్ కేసులో వైఎస్ జగన్ పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు మాజీ మంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేత శైలజానాథ్ సీఎం చంద్రబాబు అధికార దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించిన ఆయన జగన్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. మద్యం అక్రమాలపై ఆధారాలు చేపాలని వైఎస్ జగన్ సవాల్ చేశారు. దీనిపై ఏమీ సమాధానం చెప్పలేక టీడీపీ నేతలు చేతులు ఎత్తేశారని సెటైర్లు వేశారు. నిజంగా డేటా డిలిట్ చేస్తే దాని వెనుక మొత్తం డిపార్ట్‌మెంట్ ఉన్నట్టే కదా? అని ప్రశ్నించారు. ఆధారాల్లేవని ఒకవైపు చెప్తూనే మరోవైపు బ్యాక్‌ఎండ్ లో ఉన్నాయని రాశారు. అంటే బ్యాక్‌ఎండ్‌లో మీకు కావాల్సినట్టు ఆధారాలు తయారు చేస్తున్నారనే అనుమానం కలుగుతోందన్నారు. ఇక సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏపీ బీజేపీ చీఫ్ పురంధేశ్వరి మద్యం కేసులో ఒక్కొక్కరు ఒక్కో రీతిలో ఆరోపణలు చేశారని ఫైర్ అయ్యారు శైలజానాథ్ నిజంగా అక్రమాలు జరిగి ఉంటే బేవరేజ్ కార్పొరేషన్ అధికారులందరి మీదా ఎందుకు కేసులు పెట్టలేదు అని ప్రశ్నించారు. డిస్టలరీల మీద కూడా కేసులు పెట్టి ఎందుకు విచారణ చేయలేదు? అని నిలదీశారు. ఆధారాలు లేకుండా కట్టుకథలు చెప్పటం మానాలని సూచించారు. ప్రజలకు ఇవ్వాల్సిన సంక్షేమ పథకాలను అందించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు జనాన్ని మోసం చేసినందునే వచ్చే నెల 4వ తేదీన వెన్నుపోటు దినాన్ని నిర్వహిస్తున్నాం అని ప్రకటించారు. నిన్నటి ప్రెస్‌మీట్‌లో జగన్ వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# సిగరెట్ కంటే ప్రమాదకరం బెట్టింగ్స్ యాప్స్: కెఎ పాల్

**విజయవాడ, మే 23 ప్రభాతవార్త ప్రతినిధి:** బెట్టింగ్ యాప్స్‌పై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు ఇచ్చిందని ప్రజా శాంతిపార్టీ అధ్యక్షుడు కే.ఏ పాల్ తెలిపారు. "ఎక్స్"లో ఆయన తన ఖాతాలో ఈ విషయం ప్రస్తావించారు.. బెట్టింగ్ యాప్స్‌పై కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రాలకు సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చిందన్నారు. బెట్టింగ్ యాప్‌ల వల్ల వేల మంది చనిపోయారని గుర్తు చేశారు. రూ.లక్షలు, కోట్లు అప్పులు చేస్తూ ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆత్మహత్యలను అడ్డుకునేందుకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని సుప్రీంకోర్టు ప్రభుత్వాలకు నోటీసులు ఇచ్చిందని తెలిపారు. సిగరెట్ తాగితే హానికరం అని ఉంటుందని స్మోకింగ్ కంటే మిలియన్ టైమ్స్ బెట్టింగ్ యాప్స్ డేంజర్ అని కే.ఏ పాల్ అన్నారు. 1100లకు పైగా సెలబ్రిటీలు యాప్ కోసం ప్రమోషన్ చేస్తున్నారని బెట్టింగ్ యాప్స్‌ను కోట్ల రూపాయలు తీసుకుని ప్రమోషన్ చేస్తున్నట్లు కే.ఏ పాల్ తెలిపారు. వీటి వల్ల విష్యత్తులో ఆత్మహత్యలు జరగకుండా చూడాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పారు. మానిలాండరింగ్ జరగకుండా ఉండాలంటే బెట్టింగ్ యాప్‌లను నిషేధించేలా కేంద్రం చట్టం తీసుకురావాలని కోరారు. ఈ యాప్స్ ప్రమేట్ చేసిన వారిపై తెలంగాణలో కేసులు పెట్టారని కానీ ఏం చర్యలు తీసుకున్నారు? అని ఆయన ప్రశ్నించారు. దీంతో పాటు రేపు జరగబోయే శాంతి సదస్సు గురించి కే.ఏ పాల్ మాట్లాడారు. జింఖానా గ్రౌండ్ లో రేపు సాయంత్రం శాంతి సదస్సు ఉందని రేపు సాయంత్రం 7 నుంచి 9 గంటల వరకు హైకోర్టు అనుమతి ఇచ్చిందని తెలిపారు.

# సినిమా హాళ్లు బంద్ ప్రచారంపై విచారణ

## మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ,మే23,ప్రభాతవార్తప్రతినిధి:** జూన్ 1వ తేదీ నుంచి సినిమా హాళ్లు బంద్ చేయాలని ఎగ్జిబిటర్లు నిర్ణయం తీసుకున్నారనే విషయంపై విచారణ చేపట్టాలని, ఈ నిర్ణయం వెనుక ఎవరు ఉన్నారో తెలుసుకోవాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శికి దిశానిర్దేశం చేసిన రాష్ట్ర సినిమా టోగ్రఫీ, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్. హరిహర వీరమల్లు సినిమా విడుదలకు ముందు థియేటర్లు మూసి వేయాలని ఆనలుగురు ఒత్తిడి చేస్తున్నారనే వార్తలువచ్చాయి. ఈ క్రమంలో సినిమాటోగ్రఫీ, పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పందించి హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్‌తోమాట్లాడారు. ఈ పరిణా మంతోపాటు ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు ఒక కార్టెల్‌గా ఏర్పడి అవాంఛనీయ నిర్ణయాలు తీసు కోవడం గురించీ విచారణ చేయాలని దుర్గేష్ స్పష్టం చేశారు. సినిమా హాల్స్ మూసివేత మూ లంగా ఎన్ని సినిమాలు ప్రభావితం అవుతాయి, ఎంత ట్యాక్స్ రెవెన్యూకి విఘాతం కలుగుతుంది అనే కోణంలోనూ వివరాలు సేకరించబోతున్నారు.

# జెఇఇ మెయిన్ బిఆర్క్ ఫలితాలలో తిరుమల విద్యార్థుల ప్రభంజనం

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బ్యూరో మే 23 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక జేఈఈ మెయిన్ బిఆర్క్,బి ప్లాన్ ఫలితాలలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ కాతేరు తిరుమల ఐఐటి అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు అత్యద్భుత ఫలితాలు సాధించి ప్రభంజనం సృష్టించినట్లు తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమల రావు తెలిపారు. బిఆర్క్ జనరల్ ఈడబ్ల్యూఎస్ విభాగంలో కె యశ్వంత్ సాత్విక్ ఆల్ ఇండియా మొదటి ర్యాంక్,వి రామ సాయి వరుణ్ రెడ్డి నాలుగవ ర్యాంకు సాధించారన్నారు. బి ప్లానింగ్ విభాగంలో వివిధ కేటగిరీలలో జాతీయస్థాయిలో కె యశ్వంత్ సాత్విక్ మూడవ ర్యాంకు,వి రామ




సాయి వరుణ్ రెడ్డి మూడవ ర్యాంకు, టీ షణ్ముఖ శ్రీనివాస్ 24 ర్యాంకు,టీ జశ్వంత దొర 63వ ర్యాంకు, వై సాయి తేజ,టి పవన్ శ్రీ కుమార్ చౌదరి 78వ ర్యాంకు,సుంకర జోషి చంద్ 99 వ ర్యాంకులు సాధించారని ఆయన తెలిపారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకాడమిక్ డైరెక్టర్ జి సతీష్ బాబు,ప్రిన్సిపల్ వి శ్రీహరిలతో కలిసి ఆయన అభినందించారు.



వినతిపత్రం అందిస్తున్న భూపతిరాజు రవీంద్ర రాజు తదితరులు

# క్లస్టర్ విధానంలో మాకు న్యాయం చేయండి: విఆర్ఒ అసోసియేషన్

**విజయవాడ, మే 23, ప్రభాతవార్త :** ప్రభుత్వ జారీ చేసిన జివోనెం.4తో విఆర్ఓలు, విఎస్‌లు, విఆర్ఏలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆంధ్ర ప్రదేశ్ విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు నేతృత్వంలో అసోసియేషన్ నేతలు సిసిఎల్ఎ కార్యాలయంలో అడిషనల్ సెక్రటరీ ప్రభాకర్‌రెడ్డికి శుక్రవారం వినతి పత్రంఅందించారు. తమకు రేషనలైజేషన్ ద్వారా విఆర్‌లోలు, విఎస్‌లు, విఆర్ఏలకు డిపార్ట్‌మెంట్ల హెడ్‌ల ప్రమేయం లేకుండా సిబ్బందినితగ్గిస్తూ ఈనెల 17న నెం.4 జిఓ జారీ చేయడం దారుణమన్నారు. నెం.4 జిఓ ప్రకారం క్లస్టర్ విధానం తెచ్చి, రెండు మూడు సచివాలయాలను కలిపి ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేస్తూ, ఒక క్లస్టర్‌కు విఆర్ఏను, లేదా సచివాలయానికి ఒక విలేజ్ సర్వేయర్‌ను కేటాయిస్తూ ఆదేశాలిచ్చారని, దీనివల్ల రాష్ట్రంలో సుమారు 7500 మంది గ్రామ రెవెన్యూ అధికారులను, మరియు 4722 విలేజ్ సర్వేయర్లను తగ్గిస్తూ ఏ సచివాలయంలోనూ చూపలేదన్నారు. దీంతో పదోన్నతులకు అర్హులైన విఆర్ఏలకు అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, కోశాధికారి ఎమౌళి తదితరులున్నారు.

## ఐపిఎల్‌లో అత్యధికంగా..

# చెన్నై, ముంబైకే టైటిల్స్

### ప్లే ఆఫ్స్‌కు 12 సార్లు సూపర్ కింగ్స్

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజను 18కి సంబంధించి లీగ్ దశ దాదాపు ముగింపుకు వచ్చేసింది. ఇక మిగిలింది ప్లే ఆఫ్, ఫైనల్ మ్యాచ్‌లే. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకూ జరిగిన ఐపీఎల్ సీజన్లలో అత్యధికసార్లు టైటిల్ గెల్చిన జట్లుగా చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ నిలిస్తే కేకేఆర్ జట్టు మూడు సార్లు టోర్నీ గెల్చుకుంది. అయితే కొన్ని జట్లు టైటిల్ గెలవకపోయినా అత్యధిక సార్లు ప్లే ఆఫ్ చేరాయి. ఈ 18 సీజన్లలో చెన్నై సూపర్ కింగ్స్ 5 సార్లు టైటిల్ గెల్చుకుంది. ఇదే జట్టు 12 సార్లు అత్యధికంగా ప్లే ఆఫ్స్ చేరింది. ఈ జట్టు తాజాగా ఐపీఎల్ 2023లో టోర్నీ గెల్చుకుంది. ఇక చెన్నై సూపర్ కింగ్స్ తరువాత అత్యధికంగా ప్లే ఆఫ్ చేరిన జట్టుగా ముంబై ఇండియన్స్ గుర్తింపు తెచ్చుకుంది. 10 సార్లు ప్లే ఆప్ చేరగా 5 సార్లు టైటిల్ గెల్చుకుంది. ఈ జట్టు చివరిసారిగా 2020లో టైటిల్ సాధించింది. ఇక రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేకపోయిన ఆర్సీబీ 10 సార్లు ప్లే ఆఫ్ చేరింది. ఈ సీజన్‌లో 12 మ్యాచ్‌లలో 17 పాయింట్లు సాధించి 2వ స్థానంలో ఉంది.

కోల్‌కతా నైట్‌రైడర్స్ జట్టు ఇప్పటి వరకు 8 సార్లు ప్లే ఆఫ్‌కు చేరింది. మూడు సార్లు ట్రోఫీ గెల్చుకుంది. 2012, 2014 తరువాత గత ఏడాది 2024లో టైటిల్ గెల్చుకుంది. ఈసారి మాత్రం ప్లే ఆఫ్ చేరలేకపోయింది. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఇప్పటి వరకు 7 సార్లు ప్లే ఆఫ్ చేరగా రెండు సార్లు టైటిల్ గెల్చుకుంది. 2009లో దెక్కన్ ఛార్జర్స్ పేరుతో 2016లో ఎస్ఆర్‌హెచ్ పేరుతో గెల్చుకుంది. గత ఏడాది 2024లో ఫైనల్‌లో పరాజయం చెందింది. ఈసారి ప్లే ఆఫ్ చేరలేకపోయింది. ఇక ఢిల్లీ కేపిటల్స్, రాజస్థాన్ రాయల్స్ జట్లు 6 సార్లు ప్లే ఆఫ్ చేరాయి. రాజస్థాన్ రాయల్స్ 2008లో ఓసారి టైటిల్ గెల్చుకుంది. ఈసారి ప్లే ఆఫ్ చేరలేకపోయింది. ఇక ఢిల్లీ కేపిటల్స్ ఒక్కసారి కూడా టైటిల్ గెలవలేదు. 2020లో ఫైనల్ వరకు చేరింది. పంజాబ్ కింగ్స్ లెవెన్ 3 సార్లు ప్లే ఆఫ్ చేరింది కానీ టైటిల్ గెలవలేకపోయింది. ఈసారి 17 పాయింట్లతో ఇప్పటికే ప్లే ఆఫ్ స్థానం ఖాయం చేసుకుంది. ఇక గుజరాత్ టైటాన్స్ జట్టు తొలి సీజన్ 2022లోనే ఛాంపియన్‌గా నిలిచింది. ఇప్పుడు మూడోసారి ప్లే ఆఫ్ చేరింది. లక్నో సూపర్ జెయింట్స్ రెండు సార్లు ప్లే ఆఫ్ చేరింది. ఈసారి ప్లే ఆఫ్‌కు ముందే నిష్క్రమించింది.




# కొరియా ఓపెన్‌లో మెరిసిన సంధు




**న్యూఢిల్లీ:** కోలోన్ కొరియా ఓపెన్‌లో కఠినమైన పోటీ మధ్య యువరాజ్ సంధు మెరిశాడు. ఆసియా టూర్‌లో భాగంగా కోలోన్ కొరియా ఓపెన్‌లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయుడిగా యువరాజ్ సంధు నిలిచాడు. సంధు 2వ ఓవర్ 73తో ముగించి 48వ స్థానంలో నిలిచాడు. కొరియాకు చెందిన యుజున్ జంగ్ సవాలుతో కూడిన మొదటి రౌండ్‌ను నడిపించాడు.

సంధు 10వ హోల్ నుండి ఆట ప్రారంభించి, బర్డీతో ఓపెనింగ్ చేశాడు, మరో రెండు బర్డీలు మరియు రెండు బోగీలను సాధించి మొదటి తొమ్మిదిలో వన్ అండర్‌గా నిలిచాడు. అయితే, వెనుక తొమ్మిదిలో మూడు బోగీలను పడగొట్టడం వలన అతని స్కోరు 73కి చేరుకుంది. ఇక ఇంతలో, జీవ్ మిల్కా సింగ్ మరియు ఎస్ఎస్‌పి చౌరాసియా ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సింగ్ 6 ఓవర్లలో 77 పరుగులు చేసి 110వ స్థానంలో నిలిచాడు, చౌరాసియా 10 ఓవర్లలో 81 పరుగులు చేసి 137వ స్థానంలో నిలిచింది.



## జూ. ప్రపంచ కప్ షూటింగ్‌లో

# కనక్‌కు స్వర్ణం

**న్యూఢిల్లీ:** జూనియర్ ప్రపంచ కప్-2025లో భారత్ ఖాతాలో తొలి బంగారు పతకం చేరింది. భారత్ షూటర్ కనక్ పసిడి పతకంతో మెరిసింది. జర్మనీలోని సుహ్ల్‌లో జరుగుతున్న అంతర్జాతీయ షూటింగ్ స్పోర్ట్ ఫెడరేషన్ (ఐఎస్ఎస్ఎఫ్) జూనియర్ ప్రపంచ కప్‌లో భాగంగా శుక్రవారం షూటర్ కనక్ భారతదేశానికి తొలి బంగారు పతకాన్ని అందించింది. గత సంవత్సరం లిమాలో జరిగిన జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజత పతక విజేత కనక్, మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఫైనల్‌లో 239 పాయింట్లు సాధించి పసుపు లోహాన్ని కైవసం చేసుకుంది. ఆమె రెండుసార్లు ఒలింపియన్ మరియు ప్రస్తుత యూరోపియన్ ఛాంపియన్ అయిన మోల్డోవాకు చెందిన అన్నా డుల్సేను 1.7 పాయింట్ల తేడాతో అధిగమించింది. చైనీస్ తైపీకి చెందిన చెన్ యెన్‌చింగ్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. అదే సమయంలో, మరో భారత షూటర్ ప్రాచి ఐదవ స్థానంలో నిలిచింది. ఇతర ఈవెంట్లలో, భారత్‌కే చెందిన వంశిక తివారీ, యశస్వి రాథోడ్ మరియు మోహికా సిసోడియా వరుసగా 15వ, 19వ, 28వ స్థానాల్లో నిలిచారు. పురుషుల స్కీట్ విభా గంలో, హర్మెహర్ సింగ్ లల్లీ తృటిలో ఫైనల్స్‌కు దూరమ య్యాడు. 117 పాయింట్లతో క్వాలిఫయర్స్‌లో ఏడవ స్థానంలో నిలిచాడు. అంతకుముందు అడ్రియన్ కర్మాకర్ 50 మీటర్ల రైఫిల్ ప్రోన్ ఈవెంట్‌లో రజతంతో భారత్ పతక ఖాతాను తెరిచింది. స్కీట్ షూటర్ రైజా ధిల్లాన్ అద్భుతమైన ప్రదర్శనతో రజత పతకాన్ని సాధించింది. 21ఏళ్ల ధిల్లాన్ ఫైనల్స్‌లో తన 60 షాట్‌లలో 51 షాట్‌లను బద్దలుకొట్టింది, అలాగే 53షాట్‌లతో స్వర్ణం సాధించిన గ్రేట్ బ్రిటన్‌కు చెందిన ఫోబ్ బోడ్లీస్కాట్ తర్వాత రెండవ స్థానంలోనిలిచింది. ఈ ఈవెంట్‌లో ప్రస్తుత స్టాండింగ్స్ ప్రకారం భారత్ మొత్తం మూడు పతకాలతో ముందంజలో ఉంది.

# చెలరేగిన ఇంగ్లాండ్

### జింబాబ్వేపై 498 పరుగుల భారీ స్కోర్



**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో జరుగుతున్న తొలి టెస్టులో ఇంగ్లాండ్ బ్యాటర్లు చెలరేగి ఆడుతున్నారు. నాటింగ్ హామ్ వేదికగా ట్రెంట్ బ్రిడ్జ్ లో ప్రారంభమైన మ్యాచ్‌లో తొలి రోజే భారీ స్కోర్ చేయడం విశేషం. పసికూన జింబాబ్వేపై ఇంగ్లాండ్ ప్రతాపం చూపించారు. ఆడుతుంది టెస్ట్ అయినప్పటికీ వన్డే తరహాలో బ్యాటింగ్ చేస్తూ ప్రత్యర్థికి చుక్కలు చూపించారు. దీంతో తొలి రోజే ఇంగ్లాండ్ 88 ఓవర్లలో 498 పరుగుల భారీ స్కోర్ చేయడం విశేషం. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ కు దిగిన ఇంగ్లాండ్ కు ఓపెనర్లు అదిరిపోయే ఆరంభం ఇచ్చారు. తొలి వికెట్ కు ఏకంగా 231 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని మాధవీర విడగొట్టాడు. హిట్టింగ్ తో 134 బంతుల్లోనే 140 పరుగులు చేసిన బెన్ డకెట్ ఔటయ్యాడు. ఈ దశలో క్రాలీ, ఓలీ పోప్ ఇన్నింగ్స్ ను ముందుకు తీసుకెళ్లారు. రెండో వికెట్ కు వీరిద్దరూ 137 పరుగుల భాగస్వామ్యం నిర్మించారు. ఈ క్రమంలో సెంచరీ చేసిన క్రాలీ 124 పరుగుల వద్ద సికిందర్ రాజా బౌలింగ్ లో ఎల్బీడబ్ల్యూ రూపంలో వెనుదిరిగాడు. ఆ తర్వాత పోప్, రూట్ కలిసి మరో సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పడం విశేషం. రూట్ 34 పరుగులు చేసి ఔటైనా పోప్ 170 పరుగులు చేసి జెయంగా నిలిచాడు. టాపార్డర్ లో ముగ్గురు సెంచరీలతో అదరగొట్టడంతో తొలి రోజు అట ముగిసే సమయానికి 3 వికెట్ల నష్టానికి 498 పరుగులు చేసింది. క్రీజ్ లో పోప్ (169), హ్యారీ బ్రూక్ (9) ఉన్నారు. జింబాబ్వే బౌలర్లలో మధవీర,సికిందర్ రాజా, ముజరభని తలో వికెట్ పడగొట్టారు.

# యూరప్‌లో జూన్ 7 నుండి హాకీ లీగ్

### భారత్ పురుషుల జట్టు ప్రకటన

**న్యూఢిల్లీ:** ఇంటర్నేషనల్ హాకీ ఫెడరేషన్ హాకీ ప్రొ లీగ్‌కు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. జూన్ 7వ తేదీ నుండి యూరప్‌లోని అమ్‌స్టెల్‌వీన్, నెదర్లాండ్స్, అంట్వెర్ప్, బెల్జియంలో భారత్ పురుషుల హాకీ జట్టు పర్యటించనుంది. 7, 9వ తేదీల్లో నెదర్లాండ్స్‌తోను, 11, 12 తేదీల్లో అర్జెంటీనాతో భారత్ జట్టు తలపడనుంది. తదుపరి 14, 15 తేదీల్లో ఆస్ట్రేలియాతోను, 21, 22 తేదీల్లో బెల్జియంతో మ్యాచ్‌లు ఆడనుంది. ఈ నేపథ్యంలో 24 మందితో కూడిన భారత్ జట్టును భారత్ హాకీ సమాఖ్య ప్రకటించింది. అనుభవజ్ఞులు, యువ ప్లేయర్లతో భారత్ హాకీ జట్టును సమతూకంగా ఏర్పాటు చేశారు. హాకీ ప్రపంచ కప్‌కు అర్హత సాధించిన నేపథ్యంలో ప్రతీ పాయింట్



కీలకం కావడంతో అన్ని మ్యాచ్‌ల్లోనూ విజయాలు సాధించేందుకు పట్టుదలతో జట్టును నిర్మించింది. ఇక భారత్ పురుషుల హాకీ జట్టులో గోల్ కీపర్స్‌గా కృషన్ బహదూర్ పాఠక్, సూరజ్, డిఫెండర్లుగా సుమిత్, అమిత్ రోహిదాస్, జుగ్‌రాజ్ సంగ్, నీలమ్ సంజీవ్, హర్మన్ ప్రీత్ సింగ్, జర్మన్ ప్రీత్ సింగ్, సంజయ్, యశ్ దీప్ సివాచ్, మిడ్ ఫీల్డర్లుగా రాజ్‌కుమార్ షాల్, నీలకంఠ శర్మ, హార్తిక సింగ్, రాజిందర్ సింగ్, మన్ ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రాద్, శంషేర్ సింగ్, ఫార్వర్డ్స్‌గా గుర్జాంత్ సింగ్, అభిషేక్, శైలానంద్ లక్రా, మన్‌దీప్ సింగ్, లలిత్ కుమార్ ఉపాధ్యాయ్, దిల్ ప్రీత్ సింగ్, సుఖ్‌జీత్ సింగ్ ఉన్నారు.

## వాణిజ్యం

# స్టాక్స్ వర్సెస్ బాండ్లు..

**ముంబై, మే 23:** స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడం అనేది కాస్త రిస్క్‌తో కూడిన వ్యవహారం అయినప్పటికీ, అధ్యయనం అదేవిధంగా మార్కెట్ పట్ల అవగాహన పెంచుకొని, నిపుణుల సలహాలు పాటిస్తూ ముందుకు వెళితే దీర్ఘకాలికంగా మంచి రిటర్న్లు పొందే అవకాశం ఉంటుంది. అయితే స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు అనేవి రిస్క్ వ్యవహారం అని చెప్పవచ్చు. ముఖ్యంగా అంతర్జాతీయ జాతీయ పరిణామాలు వీటిని ప్రభావితం చేస్తూ ఉంటాయి. దీంతో పాటు స్టాక్ మార్కెట్‌కు బదులుగా బాండ్ మార్కెట్ కూడా ఉంటుంది. వీటిని కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వ సంస్థలు కూడా విడుదల చేస్తూ ఉంటాయి. ఈ బాండ్ల విలువ అనేది ఆ సంస్థల పెర్ఫార్మన్స్‌ను బట్టి ఉంటుంది. ఇండియన్ బాండ్ మార్కెట్లో కూడా కనిపిస్తోంది. కార్పొరేట్ బాండ్ మార్కెట్ 2.69 లక్షల కోట్ల డాలర్ల స్థాయిని అధిగమించింది.

ముఖ్యంగా సెబి రూల్స్ మార్చడంలో ఈ సారి బాండ్ మార్కెట్లో చక్కటి పెర్ఫార్మెన్స్ కనిపిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ బాండ్ల ఫేస్ వాల్యూను రూ.10 లక్షల నుంచి రూ.10వేలకి తగ్గించడం ద్వారా చిన్న పెట్టుబడి దారులు కూడా బాండ్ మార్కెట్లో పెట్టుబడి పెట్టడం సులభంగా మారింది. మరోవైపు గ్లోబల్ బాండ్ ఇండెక్స్‌లో భారత్ ఎంట్రీ ఇవ్వడం జెపిమోర్గాన్, బ్లూమ్‌బర్గ్, ఎఫ్‌టిఎస్‌ఇ రుసేల్ వంటి గ్లోబల్ ఇండెక్స్‌లలో భారత్ బాండ్ మార్కెట్లో విదేశీ పెట్టుబడుల పెద్ద ఎత్తున రావడం ప్రారంభించాయి. అయితే ఆర్‌బిఐ వడ్డీరేట్లు తగ్గించినట్లయితే మాత్రం బాండ్లపై వడ్డీ ధర తగ్గుతుంది. తద్వారా తక్కువ ఆదాయం లభిస్తుంది. ఆదాయాన్ని బట్టి బేరీజు వేసుకున్నట్లయితే బాండ్లు స్థిరమైన ఆదాయం అందిస్తాయి.




ఎఎఎ రేటింగ్ ఉన్న బాండ్లు ఏడు నుంచి ఎనిమిది శాతం రాబడి అందిస్తాయి. అదే స్టాక్ మార్కెట్లో అయితే రిస్క్ ఎక్కువగా ఉంటుంది. అదే సమయంలో అధిక రాబడి కూడా లభించే అవకాశం ఉంటుంది. సాధారణంగా బాండ్లు మూడు రకాలుగా ఉంటాయి. షార్ట్ టెర్మ్: వీటిలో ప్రధానంగా ఎఎఎ షార్ట్ టెర్మ్ బాండ్లు ముఖ్యమైనవి. అలాగే రెండోది మిడ్ టెర్మ్: బాండ్లు, స్టాక్స్ మిక్స్ అయి ఉంటాయి. లాంగ్ టెర్మ్ 7 సంవత్సరాల కన్నా ఎక్కువ కాలం ఉంటాయి.

# ఈ యేడాదిలో అత్యధిక స్కూటర్ విక్రయాలు ఇవే..

**న్యూఢిల్లీ, మే 23:** భారతదేశం వరుసగా రెండవ సంవత్సరం ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ త్రీవీలర్ల మార్కెట్‌గా నిలిచింది. గత సంవత్సరం భారతదేశంలో ఎలక్ట్రిక్ త్రీవీలర్ల అమ్మకాలు దాదాపు 20 శాతం పెరిగి దాదాపు ఏడు లక్షల యూనిట్లకు చేరుకున్నాయి. ఈ సమాచారం అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఇఎ) నివేదికలో అందించింది. ప్రపంచ ఎలక్ట్రిక్ త్రీవీలర్ మార్కెట్లో భారతదేశం అత్యధిక వృద్ధిని సాధిస్తోందని పారిస్‌కు చెందిన ఎనర్జీ రెగ్యులేటర్ తన గ్లోబల్ 'ఇవి' ఔట్‌లుక్2025 లో తెలిపింది. గత సంవత్సరంతో పోలిస్తే ప్రపంచ వ్యాప్తంగా త్రీవీలర్ మార్కెట్ ఐదు శాతం క్షీ ణించినప్పటికీ, ఎలక్ట్రిక్ త్రీవీలర్ అమ్మకాలు 2024 నాటికి 10 శాతం కంటే ఎక్కువ పెరిగి 1 మిలియన్ వాహ నాలను దాటవచ్చని అంచనా. మొత్తం త్రీవీలర్ అమ్మకాలలో ఎలక్ట్రిక్ త్రీవీలర్ అమ్మ కాలు దాదాపు నాలుగింట ఒక వంతు వాటా కలిగి ఉన్నాయి. 2023 నాటికి ఇది 20శాతానికి పైగా పెరుగుతుంది. ఈ మార్కెట్ చాలా కేంద్రీకృతమై ఉంది. వీటిలో చైనా, భారత దేశం కలిసి మొత్తం ఎలక్ట్రిక్, సాంప్రదాయ త్రిచక్ర వాహనాల అమ్మకాలలో 90 శాతానికిపైగా వాటా కలిగి ఉన్నాయి. గత మూడు సంవత్సరాలుగా చైనాలో మూడు చక్రాల వాహనాల విద్యుదీకరణ 15శాతం కంటే తక్కువగా స్తబ్దుగా ఉందని నివేదిక పేర్కొంది. 2023లో భారతదేశం చైనాను అధిగమించి ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ త్రీవీలర్ల మార్కెట్‌గా అవతరించింది. 2024లో ఈ స్థానాన్ని నిలుపుకుంది. అమ్మకాలు సంవత్సరానికి 20 శాతం పెరిగి దాదాపు 700,000 వాహనాలకు చేరుకున్నాయి. 2024లోవిద్యుత్ అమ్మకాలు రికార్డు స్థాయిలో 57శాతం వాటాను కలిగిఉంటాయి. ఇది గత సంవత్సరం కంటే మూడుశాతం ఎక్కువ. కొత్తపిఎంఇ- డ్రైవ్ పథకం కింద విధాన మద్దతు కారణంగా ఈపెరుగుతున్న ధోరణి కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. ఈపథకం కింద 2024లో వాణిజ్య ఉపయోగం కోసం 3,00,000 కంటే ఎక్కువ ఎలక్ట్రిక్ త్రీవీలర్లకు మద్దతు ఇవ్వడానికి బడ్జెట్ కేటాయించింది. చైనా, భారతదేశం, ఆగ్నేయాసియా ప్రపంచంలోనే అతిపెద్ద ద్విచక్ర, త్రిచక్ర వాహన మార్కెట్లు అని, 2024లో ఈ వాహనాల ప్రపంచఅమ్మకాలలో 80 శాతంవాటాను కలిగి ఉన్నాయని ఐఇఎ తెలిపింది.



# టాటా ఏస్ వాహనాల కోసం ప్రత్యేక కిట్

**ముంబై, మే 23:** ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంత యువత కొంత మంది వస్తు రవాణాకు అనుగుణంగా ఉండే టాటా ఏస్ వాహనాలను కొనుగోలు చేసి వాటి ద్వారా జీవనోపాధి పొందుతున్నారు. అయితే వారికి టాటా ఏస్ నిర్వహణ ఖర్చు ముఖ్యంగా డీజిల్ ఖర్చు అధికంగా ఉంటుంది. ఈ ఖర్చును తగ్గించుకునేలా ఓ కంపెనీ 'ఇవి' కిట్‌ను విడుదల చేశారు. సాంప్రదాయ ఐసీఈ ఇంజిన్ నుంచి ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడానికి రూపొందించిన రెట్రోఫిట్ కిట్‌ను సన్ మొబిలిటీ బ్లూవీల్ భాగస్వామ్యంతో విడుదల చేసింది. ఈ కొత్త ఈవీల భారీ ధర లేకుండా ఫ్లీట్ ఆపరేటర్లు ఎలక్ట్రిక్ మొబిలిటీకి మారడాన్ని సులభతరం చేస్తుందని ఆ కంపెనీల ప్రతినిధలు చెబుతున్నారు. సన్ మొబిలిటీకు సంబంధించిన బ్యాటరీ స్వాపింగ్ టెక్నాలజీని సమగ్రపరచడం ద్వారా ఈ కిట్లు టాటా ఏస్ వాహనాలను మార్చుకోదగిన బ్యాటరీలతో ఎలక్ట్రిక్ యూనిట్లుగా పనిచేయడానికి వీలు కల్పిస్తాయి. తద్వారా గణనీయమైన ఖర్చు ఆదాతో పాటు కార్యాచరణ ప్రయోజనాలను పొందవచ్చు. రెట్రోఫిట్ కిట్లు మొదట ఎన్‌సీఆర్ ప్రాంతంలో అందుబాటులో ఉంటాయి. భవిష్యత్‌లో ఇతర రాష్ట్రాలకు విస్తరించే ప్రణాళికలు ఉన్నాయని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు. 'ఇవి' రెట్రోఫిట్టింగ్ అంటే పెట్రోల్, డీజిల్ లేదా సీఎన్‌జీ వాహనాన్ని ఎలక్ట్రిక్ వాహనంగా మార్చే ప్రక్రియ. అంతర్గత దహన యంత్రాన్ని ఎలక్ట్రిక్ మోటారుతో భర్తీ చేసి బ్యాటరీ ప్యాక్‌ను ఇన్‌స్టాల్ చేస్తారు. ఈ మార్పిడిలో వాహన అసలు నిర్మాణం, డిజైన్‌ను అలానే ఉంచుతూ మోటారు, బ్యాటరీ, తరచుగా కొత్త నియంత్రణ వ్యవస్థ వంటి కొత్త భాగాలను అమరుస్తారు. ఈ విధానం బ్రాండ్‌న్యూ 'ఇవి'ని కొనుగోలు చేయకుండా ఎలక్ట్రిక్ మొబిలిటీకి మారడానికి ఖర్చుతో కూడుకున్న మార్గాన్ని అందిస్తుంది. సీఎన్‌జీ వాహనాల నుండి మారుతున్న ఫ్లీట్ ఆపరేటర్లు నెలవారీ ఖర్చులో దాదాపు 30 శాతం తగ్గింపును ఆశించవచ్చు. డీజిల్ నుండి మారుతున్న వారు 40 శాతం వరకు ఆదా పొందుతారు. ఈ మార్పిడి ఆర్థిక ప్రయోజనాలను అందించడమే కాకుండా ఇప్పటికే ఉన్న వాహనాల జీవిత కాలాన్ని పొడిగించుకోవచ్చు. కొత్త రెట్రోఫిట్ సొల్యూషన్ ఎలక్ట్రిక్ వాహనాల స్వీకరణ వైపు ప్రభుత్వ ప్రోత్సాహానికి అనుగుణంగా ఉంటుంది. బ్రాండ్‌న్యూ వాహనాల్లో పెట్టుబడి పెట్టకుండా నియంత్రణ ప్రమాణాలను పాటించడానికి టాటా ఏస్ వాహనదారులకు ఆచరణాత్మక ప్రత్యామ్నాయాన్ని అందిస్తుంది.



# ఇపిఎఫ్‌ఒలో అమలైన ఐదు కీలక మార్పులు

**ముంబై, మే 23:** ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఇపిఎఫ్ఒ) 2025 సంవత్సరంలో తన సభ్యుల కోసం అనేక ప్రధాన మార్పులను చేసింది. ఇది ప్రక్రియలను సులభతరం, డిజిటల్, పారదర్శకంగా మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మార్పులు ఉద్యోగులకు మాత్రమే అనుకూలమైనవి కావు. కానీ అది వారి పొదుపు, పెన్షన్ సంబంధిత విషయాలను కూడా ప్రభావితం చేస్తుంది. ఈ ఐదు ప్రధాన మార్పులను మనం అర్థం చేసుకుందాం. ఇప్పుడు ఇపిఎఫ్ఒలో మీ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేయడం చాలా సులభం అయింది. మీ యూనివర్సల్ అకౌంట్ నంబర్ ఆధార్‌తో లింక్ చేయబడి ఉంటే, మీరు మీ పేరు, పుట్టిన తేదీ, లింగం, జాతీయత, తల్లిదండ్రుల పేరు, వైవాహిక స్థితి, జీవిత భాగస్వామి పేరు, ఉద్యోగ ప్రారంభ తేదీ వంటి వివరాలను ఎటువంటి పత్రం లేకుండా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయవచ్చు. అయితే, అక్టోబర్ 1, 2017కి ముందు గితివి సృష్టించబడిన వారు, కొన్ని సందర్భాల్లో కంపెనీ నుండి అనుమతి తీసుకోవలసి ఉంటుంది. ఈ మార్పు ఉద్యోగుల సమయం, శ్రమను ఆదా చేయడంలో సహాయపడుతుంది. గతంలోఉద్యోగాలు మారేటప్పుడు పీఎఫ్ బదిలీ చేయడం సంక్లిష్టమైన, సమయం తీసుకునే ప్రక్రియ. దీనికి కంపెనీ ఆమోదం అవసరం. కానీ జనవరి 15, 2025 నుండి ఇపిఎఫ్ఒ దానిని సులభతరం చేసింది. ఇప్పుడు చాలా సందర్భాలలో పాత లేదా కొత్త కంపెనీ ఆమోదం అవసరంఉండదు. మీ యుఎఎన్ ఆధార్‌తో లింక్ చేయబడి, వివరాలు (పేరు, పుట్టిన తేదీ, లింగం) సరిపోలితే, పీఎఫ్ బదిలీ వేగంగా జరుగుతుంది. ఇది మీ పొదుపు నిర్వహణ, కొనసాగింపును నిర్ధారిస్తుంది. జనవరి 1, 2025 నుండి ఇపిఎఫ్ఒ కేంద్రీకృత పెన్షన్ చెల్లింపు వ్యవస్థను ప్రారంభించింది. ఇప్పుడు పెన్షన్ ఎన్‌పిసిఐ ప్లాట్‌ఫామ్ ద్వారా నేరుగా ఏదైనా బ్యాంకు ఖాతాకు పంపబడుతుంది. గతంలో పెన్షన్ చెల్లింపు కోసం పెన్షన్ చెల్లింపు ఆర్డర్‌ని ఒక ప్రాంతీయ కార్యాలయం నుండి మరొక ప్రాంతీయ కార్యాలయానికి బదిలీ చేయాల్సి వచ్చేది. దీని వలన ఆలస్యం జరిగింది. ఇప్పుడు ఈ ప్రక్రియ ముగిసింది. అలాగే, పెన్షనర్లు డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్‌ను సులభంగా సమర్పించగలిగేలా కొత్త పిపిఒని యుఎఎన్‌తో లింక్ చేయడం తప్పనిసరి. అధిక జీతం ఆధారంగా పెన్షన్ తీసుకోవాలనుకునే ఉద్యోగుల కోసం పెన్షన్ నియమాలను ఇపిఎఫ్ఒ స్పష్టంచేసింది. ఇప్పుడు అందరికీ ఒకే ప్రక్రియ అనుసరించబడుతుంది. ఉద్యోగిజీతం నిర్దేశించిన పరిమితి కంటే ఎక్కువగా ఉండి, అతను అదనపు సహకారాలు చెల్లిస్తే అతను అధిక జీతంతో పెన్షన్ పొందవచ్చు. ప్రైవేట్ ట్రస్టులను నడుపుతున్న కంపెనీలు కూడా ఇపిఎఫ్ఒ నియమాలను పాటించాల్సి ఉంటుంది. ఈనియమం పెన్షన్‌మొత్తాన్ని పెంచడంలో సహాయపడుతుంది. జనవరి 16, 2025న జాయింట్ డిక్లరేషన్ (జెడి) ప్రక్రియను సులభతరం చేయడానికి ఇపిఎఫ్ఒ కొత్త మార్గదర్శకాలను జారీ చేసింది. ఇప్పుడు తప్పు లేదా అసంపూర్ణ సమాచారాన్ని సరిదిద్దడం సులభం అవుతుంది. క్లెయిమ్‌ల ప్రక్రియ వేగంగా, పారదర్శకంగా ఉంటుంది.




# ఎగుమతుల్లో భారత్ భేష్

**ముంబై, మే 23:** ఇటీవల విడుదలైన డేటా ప్రకారం దేశంలో పెట్రోలియం ఉత్పత్తులు, వజ్రాలు వంటి సాంప్రదాయ ఎగుమతులను అధిగమించి భారతదేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు గత మూడేళ్లల్లో బాగా పెరిగాయి. అమెరికాకు దాదాపు ఐదు రెట్లు, జపాన్‌కు దాదాపు నాలుగు రెట్లు పెరిగాయి. స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు 2023-24లో 15.57 బిలియన్ల డాలర్లు, 2022-23లో 10.96 బిలియన్ల డాలర్ల నుంచి 2024-25లో 24.14 బిలియన్ల డాలర్లకు చేరుకున్నాయి. గత ఆర్థిక సంవత్సరంలో భారతదేశం స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో అత్యధిక వృద్ధిని నమోదు చేసిన మొదటి ఐదు దేశాలు అమెరికా, నెదర్లాండ్స్, ఇటలీ, జపాన్, చెక్ రిపబ్లిక్‌గా ఉన్నాయి. అమెరికాకు భారతదేశం ఎగుమతులు 2022-23లో 2.16 బిలియన్ల డాలర్ల నుంచి 2023-24లో 5.57 బిలియన్ల డాలర్లకు, 2024-25లో 10.6 బిలియన్ల డాలర్లకు పెరిగాయి. ఎగుమతుల విషయంలో జపాన్‌లో కూడా గణనీయమైన ఎగుమతి వృద్ధి నమోదైంది. ఈ దేశానికి ఎగుమతులు 2022-23లో 120 మిలియన్ల డాలర్లకు నుంచి 2025 ఆర్థిక సంవత్సరంలో 520 మిలియన్ల డాలర్లకు పెరిగాయి. ఈ వేగవంతమైన పెరుగుదల వల్ల స్మార్ట్ ఫోన్లు భారతదేశంలో అత్యధికంగా ఎగుమతి చేసిన వస్తువుల్లో ఒకటిగా మారిందని. పెట్రోలియం ఉత్పత్తులు, వజ్రాలు వంటి ఎగుమతులను అధిగమించడానికి దోహదపడిందని వాణిజ్య మంత్రిత్వ శాఖ అధికారి తెలిపారు. ఉత్పత్తిసంబంధిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకం వంటి ప్రభుత్వ పథకాల వల్ల వృద్ధి వేగంగా పెరిగిందని నిపుణులు చెబుతున్నారు.




'మేక్ ఇన్ ఇండియా సర్వీస్ నివేదిక ప్రకారం 2024లో భారతదేశ స్మార్ట్‌ఫోన్ ఎగుమతుల్లో ఆపిల్, సామ్‌సంగ్ దాదాపు 94 శాతం వాటాను కలిగి ఉన్నాయి. 2024లో మేడ్‌ఇన్ ఇండియా స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు సంవత్సరానికి 6 శాతం పెరిగాయి. 2025లో భారతదేశంలో స్మార్ట్‌ఫోన్ తయారీ వృద్ధి అంచనా 2025లో రెండంకెలలో పెరుగుతుందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.